# విశాల భారతి

01-05-2026

తెలుగు దినపత్రిక

www.vishalabharati.com
epaper.vishalabharati.com

శుక్రవారం, హైదరాబాద్ సంపుటి:4 సంచిక: 119




## కరెంటు సమస్య రానివ్వం

- ఎండలు పెరిగినా విద్యుత్ కోతలు ఉండవు
- లోటు రాకుండా బయట మార్కెట్ నుండి విద్యుత్ కొనుగోలు
- ఆసుపత్రులు, తాగునీటి సరఫరాకు నిరంతర కరెంట్
- రాష్ట్రంలోని ప్లాంట్లను పూర్తిస్థాయిలో వినియోగించాలి
- భవిష్యత్ సవాళ్లను ఎదుర్కొవడానికి ముందస్తు ప్రణాళిక
- ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రాధాన్యం

02




# రైతుల గుండెల్లో ఫ్యూచర్ సెగ

## నాడు వ్యతిరేకించి, నేడు భూములు ఇవ్వాల్సిందేనన్న రేవంత్

- మాట తప్పిన కాంగ్రెస్ ప్రభుత్వంపై రైతుల ఆగ్రహం
- 46 రోజులుగా గిరిజన రైతుల దీక్షను పట్టించుకోని వైనం
- ఫార్మా సిటీ రద్దు హామీ ఏమైందని నిలదీత
- రైతులు కాదు, పాలకులే భూములు త్యాగం చేయాలి

02

రాజకీయాల్లో నిలకడ లేని మాటలు, అధికారంలోకి రాకముందు ఇచ్చే హామీలు పాలకుల పీఠం ఎక్కాక ఎలా తలకిందులవుతాయో చెప్పడానికి రంగారెడ్డి జిల్లా రైతుల భూపోరాటమే నిలువెత్తు సాక్ష్యంగా నిలుస్తోంది. నాడు విపక్ష నేతగా రైతుల కన్నీళ్లు తుడుస్తామని భరోసా ఇచ్చిన గొంతుకే, నేడు ముఖ్యమంత్రి హోదాలో 'భూములు ఇవ్వాల్సిందే.. లేదంటే గుంజుకుంటాం' అని హెచ్చరిస్తుండటం అన్నదాతల గుండెల్లో అగ్గి రాజేస్తోంది. మూడు పంటలు పండే పచ్చని పొలాల్లో ఫార్మా సిటీ వద్దని, కాంగ్రెస్ రాగానే భూములు వెనక్కి ఇస్తామని నాడు ఊరూరా పాద-యాత్రలు చేసి మరీ చెప్పిన రేవంత్ రెడ్డి, ఇప్పుడు 'ఫ్యూచర్ సిటీ' పేరుతో అదే భూములపై కన్నే-యడం నమ్మకద్రోహమేనని స్థానిక రైతాంగం నినదిస్తోంది.

# పత్రికా స్వేచ్ఛలో దిగజారి పోయాం

## 180 దేశాల్లో 157వ స్థానం, గతేడాది 151

- ఒకే ఏడాదిలో భారత్ 6 స్థానాలు దిగజారింది
- నార్వే, నెదర్లాండ్స్, ఎస్టోనియా, డెన్మార్క్, స్వీడన్
- సౌదీ అరేబియా, ఇరాన్, చైనా, నార్త్ కొరియా, ఎరిత్రియా
- జర్నలిస్టులపై దాడులు, మీడియాపై రాజకీయ ఒత్తిడి, అణచివేత
- ప్రపంచవ్యాప్తంగా 100 దేశాల్లో పత్రికా స్వేచ్ఛ పడిపోయింది



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంగా వెలుగొందుతున్న భారత గడ్డపై నేడు వాస్తవాలు మాట్లాడాలంటేనే భయం వేసే పరిస్థితులు దాపురిస్తున్నాయి. పత్రికా స్వేచ్ఛ అనేది కేవలం కాగితాలకే పరిమితమవుతూ, క్షేత్రస్థాయిలో జర్నలిస్టుల గొంతు నొక్కే ప్రయత్నాలు ముమ్మరం కావడమే దీనికి ప్రధాన కారణం. తాజాగా విడుదలైన గణాంకాలు చూస్తుంటే మనం ఎటువైపు ప్రయాణిస్తున్నామనే సందేహం కలగక మానదు. అక్షరం ఆయుధంగా మారాల్సిన చోట, అదే అక్షరం నేడు సంకెళ్లకు గురవుతోంది. వ్యవస్థలోని లోపాలను ఎత్తిచూపాల్సిన మీడియా, కొన్ని శక్తుల చేతుల్లో కీలుబొమ్మగా మారడం వల్ల సమాజానికి అందాల్సిన వాస్తవ సమాచారం కరువైపోతోంది. అంతర్జాతీయ జర్నలిజం వాచ్‌డాగ్ రిపోర్టర్స్ వితౌట్ బోర్డర్స్ సంస్థ తాజాగా 2026 సంవత్సరానికి సంబంధించి ప్రపంచ పత్రికా స్వేచ్ఛ సూచీని విడుదల చేసింది. ఈ జాబితాలో భారతదేశం 157వ స్థానానికి పడిపోవడం అత్యంత బాధాకరమైన విషయం. గడిచిన ఏడాది అంటే 2025లో మన దేశం 151వ స్థానంలో ఉండగా, కేవలం పన్నెండు నెలల కాలంలోనే ఆరు మెట్లు కిందికి జారిపోవడం గమనార్హం. మొత్తం 180 దేశాలతో కూడిన ఈ జాబితాలో మనకంటే వెనుక ఉన్నవి అతి తక్కువ దేశాలేనని అర్థమవుతోంది. ప్రజాస్వామ్య విలువలు కాపాడటంలో కీలక పాత్ర పోషించాల్సిన మీడియా, నేడు అస్తిత్వ పోరాటం చేస్తోందని మిగతా 4లో..

# ట్రంప్‌కు పుతిన్ వార్నింగ్



- దాడులు వద్దని పుతిన్ హెచ్చరిక; అణు నిల్వల్లో రష్యా సాయం
- యుద్ధం ఆపాలని ట్రంప్ షరతు; కాల్పుల విరమణకు ఇద్దరి మొగ్గు
- ఉక్రెయిన్ కావాలనే యుద్ధాన్ని పొడిగిస్తోందని ఏకాభిప్రాయం
- ఇంధన, ఆర్థిక రంగాల్లో పరస్పర సహకారంపై చర్చ
- ట్రంప్‌పై దాడిని ఖండిస్తూ పుతిన్ సంఘీభావం
- 90 నిమిషాల పాటు సాగిన సంభాషణ ఫలప్రదం

03

పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ము-కున్న వేళ, ప్రపంచ రాజకీయ యవనికపై ఒక సంచలనాత్మక పరిణామం చోటుచే-సుకుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, రష్యా అధినేత వ్లాదిమిర్ పుతిన్ మధ్య జరిగిన సుదీర్ఘ టెలిఫోన్ సంభాషణ ఇప్పుడు అంతర్జాతీయ సమాజంలో హాట్ టాపిక్ గా మారింది. దాదాపు గంటన్నర పాటు సాగిన ఈ చర్చల్లో అనేక కీలక నిర్ణ-యాలు, హెచ్చరికలు వెలువడ్డాయి. ముఖ్యంగా ఇరాన్ విషయంలో పుతిన్ చేసిన వ్యాఖ్యలు అగ్రరాజ్యాన్ని ఆలోచనలో పడేశాయి.

# ₹7,823 కోట్లతో అభివృద్ధి పండుగ

- వచ్చే నెల 10న మోదీ హైదరాబాద్ పర్యటన
- రూ. 7,823 కోట్ల అభివృద్ధి పనులకు శ్రీకారం
- గిరిజన వర్సిటీ, రైల్వే లైన్లు, హైవే పనులు
- పెట్రోలియం ఉత్పత్తుల టెర్మినల్ ప్రారంభం

03





# టీఆర్ఎస్ నాకు రాసిపెట్టి ఉందేమో!

- తెలంగాణ రక్షణ సేన పేరుకు గ్రీన్ సిగ్నల్
- టీఆర్ఎస్ నాకు రాసిపెట్టి ఉందేమో' అని హర్షం
- దరఖాస్తు చేసిన ఐదు పేర్లలో 3వ ప్రాధాన్యత ఖరారు
- పాత పేరు మళ్లీ రావడం అనుకోకుండా జరిగిందే
- తెలంగాణ అస్తిత్వం, సాంస్కృతిక వైభవం కోసం పోరాటం
- ప్రజా సమస్యలపై పోరాటాన్ని ఉధృతం చేస్తామని హామీ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త అధ్యాయం మొదలైంది. తెలంగాణ రక్షణ సేన పేరుకు కేంద్ర ఎన్నికల సంఘం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో రాష్ట్ర రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి పెరిగింది. ఈ పరిణామంపై మాజీ ఎమ్మెల్సీ కవిత తనదైన శైలిలో స్పందిస్తూ భావోద్వేగపూరిత వ్యాఖ్యలు చేశారు. తన రాజకీయ ప్రయాణంలో టీఆర్ఎస్ అనే అక్షరాలు మరోసారి తోడవ్వడం కేవలం యాదృచ్ఛికం కాదని, అది తన నొసట రాసిపెట్టి ఉన్న అదృష్టమని ఆమె అభివర్ణించారు. సుదీర్ఘ కాలం పాటు ఒకే పేరుతో మమేకమైన తనకు, మళ్లీ అదే పేరుతో ప్రజల ముందుకు రావడం మిగతా 3లో..

## కేటీఆర్, హరీశ్ రావు
# ఫోన్లు హ్యాక్



- కేటీఆర్, హరీశ్ రావు ఫోన్లు, సీసీ కెమెరాలను హ్యాక్ చేస్తున్నారు
- ఈ హ్యాకింగ్‌పై వెంటనే సిట్ విచారణ జరిపించాలి
- ట్యాపింగ్ కేసులో కేసీఆర్ కుటుంబాన్ని ఇరికించే కుట్ర జరుగుతోంది
- బీఆర్ఎస్ నేతల పేర్లు చెప్పాలని పోలీసులపై సీఎం ఒత్తిడి తెస్తున్నారు
- చట్టవిరుద్ధమైన సీఎం ఆదేశాలను అధికారులు పాటించవద్దు
- రాష్ట్రంలో రైతుల పరిస్థితి హృదయ విదారకంగా ఉంది

03

# రేవంత్ వర్సెస్ కాంట్రాక్టర్ల బిగ్ ఫైట్..!

- బకాయిల కోసం నిర్మాణ సంస్థల లీగల్ నోటీసు
- ఉచితంగానే చేయాలని ప్రభుత్వం కచ్చితమైన ఆదేశం
- గడువు తీరిందని, బాధ్యత లేదని కాంట్రాక్టర్ల స్పష్టీకరణ
- రూ. 176.5 కోట్లు + 12శాతం వడ్డీ చెల్లించాలని డిమాండ్
- నాసిరకం పనులపై విజిలెన్స్ విచారణ, బ్లాక్ లిస్ట్ హెచ్చరిక
- న్యాయపోరాటంతో ప్రాజెక్టు ఆలస్యమై రైతులకు నష్టం

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో కాళేశ్వరం ప్రాజెక్టు ఇప్పుడు ఒక అంతుచిక్కని యుద్ధ క్షేత్రంగా మారిపోయింది. నీటి పారుదల రంగంలో అద్భుతమని ఒకరు, అవినీతికి నిలయమని మరొకరు విమర్శలు కురిపిస్తున్న వేళ, బ్యారేజీల మిగతా 3లో..





## స్టేట్ సెక్యూరిటీ అడ్వయిజర్‌గా
# శివధర్ రెడ్డి

- తెలంగాణ రాష్ట్ర భద్రతా సలహాదారుగా నియామకం
- మూడేళ్ల పాటు పదవిలో కొనసాగింపు
- శాంతిభద్రతలు, డ్రగ్స్ కట్టడిపై ప్రభుత్వానికి సలహాలు
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్థాయి హోదా
- నెలకు రూ.2.25 లక్షల గౌరవ వేతనం

02

## ‘కనెక్షన్’ ఇస్తానని ‘కలెక్షన్’ చేసుకున్నాడు: కటకటాల్లో కరెంటోడు



వివరాలు వెల్లడిస్తున్న డిఐ రమేష్ నాయుడు


నిందితుడు వద్ద నుంచి రికవరీ చేసిన సొత్తు

**సైబరాబాద్ విశాలభారతి:** ఇళ్లలో కరెంట్ కనెక్షన్ ఇస్తానని నమ్మించి, లోపలికి వెళ్లి కాస్ట్లీ ఎలక్ట్రికల్ పార్ట్స్ కలెక్షన్ చేసుకున్న ఘరానా దొంగను మియాపూర్ పోలీసులు అరెస్ట్ చేశారు. నిందితుడి నుంచి లక్షా యాభై వేల విలువైన చోరీ సొత్తు, బైక్ స్వాధీనం చేసుకున్నట్లు కూకట్‌పల్లి ఏసీపీ విలేకరులకు తెలిపారు. నిందితుడు నిజామాబాద్ జిల్లా నవీపేట్‌కు చెందిన కల్లూరి లక్ష్మణ్ (39). జీడిమెట్ల రామ్‌రెడ్డి నగర్‌లో ఉంటూ ఎలక్ట్రీషియన్ పనులు చేస్తున్నాడు. మియాపూర్, కూకట్‌పల్లి పరిసరాల్లో ఇళ్లు, చిన్న షాపుల్లో కరెంట్ రిపేర్ల పేరుతో తిరుగుతుండేవాడు.

**దొంగబుద్ధి ఇలా:** కరెంట్ వర్క్ పేరుతో ఇంట్లోకి వెళ్లి ABB MCCBలు, క్యాపాసిటర్ బ్యాంకులు ఎక్కడున్నాయో గుర్తుపెట్టుకునేవాడు. రెండు మూడు రోజుల తర్వాత ‘మెయింటెనెన్స్ ఉంది’ అని మళ్లీ వెళ్లి, ఇంట్లో ఎవరూ లేని సమయంలో వాటిని విప్పేసి తన జూపిటర్ బైక్‌లో వేసుకొని ఉడాయించేవాడు. బయట అమ్మేసి సొమ్ము చేసుకునేవాడు.

**ఎలా దొరికాడంటే:** మియాపూర్ పీఎస్ పరిధిలో వరుసగా ఎలక్ట్రికల్ పార్ట్స్ చోరీలు జరుగుతుండటంతో క్రైమ్ టీమ్ స్పెషల్ డ్రైవ్ చేపట్టింది. సీసీటీవీ ఫుటేజీలను క్షుణ్ణంగా పరిశీలించగా ప్రతి చోటా ఒకే బైక్, ఒకే వ్యక్తి కనిపించాడు. బాధితులను ఆరా తీయగా ‘ఎలక్ట్రీషియన్ పనికి వచ్చాడు’ అని చెప్పడంతో క్లూ దొరికింది. టెక్నికల్ డేటా, ఇన్‌ఫార్మర్ సమాచారంతో జీడిమెట్లలోని అతడి ఇంటిపై మెరుపు దాడి చేసి లక్ష్మణ్‌ను అదుపులోకి తీసుకున్నారు.

**స్వాధీనం చేసుకున్నవి:** ఆరు ABB MCCBలు, ఎనిమిది క్యాపాసిటర్ బ్యాంకులు, నేరానికి వినియోగించిన జూపిటర్ బైక్. వీటి మొత్తం విలువ లక్షా యాభై వేలు.

నిందితుడిపై మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించారు.

**సిబ్బందికి అభినందనలు:** సీసీటీవీ ఫుటేజ్, టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా తక్కువ సమయంలోనే కేసును ఛేదించిన మియాపూర్ ఇన్‌స్పెక్టర్, క్రైమ్ సిబ్బందిని సైబరాబాద్ సీపీ అభినందించారు. సిబ్బందికి రివార్డులు ప్రకటించారు.

**పోలీసుల సూచన:** ఇంటికి పనులకు వచ్చే వారి ఫొటో, ఆధార్ కార్డు నకలు తప్పక తీసుకోండి. అనుమానాస్పదంగా ఎవరైనా కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలి. హెల్ప్‌లైన్: 9912491778.

# స్టేట్ సెక్యూరిటీ అడ్వయిజర్‌గా శివధర్ రెడ్డి

- తెలంగాణ రాష్ట్ర భద్రతా సలహాదారుగా నియామకం
- మూడేళ్ల పాటు పదవిలో కొనసాగింపు.
- శాంతిభద్రతలు, డ్రగ్స్ కట్టడిపై ప్రభుత్వానికి సలహాలు
- ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్థాయి హోదా
- నెలకు రూ.2.25 లక్షల గౌరవ వేతనం
- డీజీపీగా ఆయనకున్న సుదీర్ఘ అనుభవానికి గుర్తింపు




**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాష్ట్ర భద్రతా ముసాయిదాలో సరికొత్త అధ్యాయం మొదలైంది. కీలకమైన శాంతిభద్రతల పరిరక్షణలో తనదైన ముద్ర వేసిన మాజీ డీజీపీ శివధర్ రెడ్డిని రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత కలిగిన 'స్టేట్ సెక్యూరిటీ అడ్వయిజర్' (రాష్ట్ర భద్రతా సలహాదారు)గా నియమిస్తూ కీలక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని ప్రభుత్వం ఈ మేరకు బుధవారం అధికారిక ఉత్తర్వులు జారీ చేయడంతో అధికార వర్గాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. కేవలం పదవీ విరమణ చేసిన అధికారులకు ఇచ్చే సాధారణ నియామకంలా కాకుండా, రాష్ట్ర భవిష్యత్తు భద్రతా అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఈ పోస్టును ప్రభుత్వం డిజైన్ చేసినట్లు కనిపిస్తోంది. పోలీస్ బాధ్యతల నుంచి విశ్రాంతి తీసుకున్న వెంటనే శివధర్ రెడ్డికి ఈ బాధ్యతలు అప్పగించడం వెనుక ఆయన అపారమైన అనుభవం దాగి ఉంది. ఆయన బాధ్యతలు చేపట్టిన నాటి నుండి వచ్చే మూడేళ్ల కాలం పాటు ఈ హోదాలో కొనసాగనున్నారు. రాష్ట్రంలో శాంతిభద్రతల నిర్వహణ అనేది కేవలం లా అండ్ ఆర్డర్ సమస్య మాత్రమే కాకుండా, అభివృద్ధికి పునాది అని ప్రభుత్వం బలంగా నమ్ముతోంది. అందుకే క్షేత్రస్థాయిలో నేరాల తీరుతెన్నులు, అంతర్గత భద్రతపై లోతైన అవగాహన ఉన్న శివధర్ రెడ్డి వంటి అధికారి సేవలను పూర్తిస్థాయిలో వినియోగించుకోవాలని ప్రభుత్వం ఈ కీలక అడుగు వేసింది. నేటి తరం ఎదుర్కొంటున్న అతిపెద్ద సవాలు మాదకద్రవ్యాల మహమ్మారి. డ్రగ్స్ కట్టడి విషయంలో రాజీలేని పోరాటం చేయాలని భావిస్తున్న రేవంత్ సర్కార్, ఈ విషయంలో శివధర్ రెడ్డి సలహాలకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వనుంది. నేర నియంత్రణలో ఆధునిక సాంకేతికతను జోడించడం, గంజాయి సాగు మరియు రవాణాపై ఉక్కుపాదం మోపడం వంటి అంశాల్లో ఆయన కీలక పాత్ర పోషించనున్నారు. కేవలం నేరాలు జరిగిన తర్వాత దర్యాప్తు చేయడం కంటే, నేరాలు జరగకుండా నివారించే నిఘా వ్యవస్థను పటిష్టం చేయడంలో ఆయన అనుభవం రాష్ట్రానికి వెన్నెముకలా మారనుంది. రోడ్డు భద్రత అనేది ప్రస్తుత కాలంలో ప్రతి పౌరుడికి అత్యంత ఆందోళన కలిగించే విషయం. నిత్యం జరుగుతున్న ప్రమాదాలను అరికట్టి ప్రాణనష్టాన్ని తగ్గించేందుకు శాస్త్రీయమైన పద్ధతులను శివధర్ రెడ్డి సూచించనున్నారు. వాహనాల రాకపోకల క్రమబద్ధీకరణ నుంచి రహదారి మౌలిక సదుపాయాల మెరుగుదల వరకు ఆయన అందించే మార్గదర్శకాలు ఎంతో కీలకం కానున్నాయి. ముఖ్యంగా సైబర్ నేరాలు వంటి కొత్త తరం సవాళ్లను ఎదుర్కోవడానికి పోలీస్ యంత్రాంగాన్ని సిద్ధం చేయడంలో ఆయన తన మేధస్సును ఉపయోగించనున్నారు. ఈ నియామకంతో శివధర్ రెడ్డి హోదాను ప్రభుత్వం రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి స్థాయికి పెంచింది. అంటే కేబినెట్ స్థాయిలో నిర్ణయాలను ప్రభావితం చేసే అధికారం ఆయనకు లభించనుంది. దీనివల్ల వివిధ శాఖల మధ్య సమన్వయం సాధించడం సులభతరమవుతుంది. కేవలం సలహాదారుగా మాత్రమే కాకుండా, భద్రతాపరమైన నిర్ణయాల్లో క్రియాశీలక పాత్ర పోషించేలా ప్రభుత్వం ఆయనకు అన్ని రకాల అధికారాలను కల్పించింది. దీనివల్ల ప్రభుత్వ నిర్ణయాల్లో మరింత పారదర్శకత, వేగం పెరిగే అవకాశం ఉంటుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ప్రభుత్వం శివధర్ రెడ్డికి కల్పించిన వసతులు మరియు వేతన ప్యాకేజీ కూడా ఆయన హోదాకు తగినట్లుగానే ఉన్నాయి. నెలకు రూ. 2.25 లక్షల గౌరవ వేతనంతో పాటు, రూ.50 వేల ఇంటి అద్దె భత్యాన్ని కేటాయించింది. వీటితో పాటు ప్రభుత్వం అధికారిక వాహనాన్ని, అత్యుత్తమ వైద్య సదుపాయాలను కూడా అందించనుంది. అత్యున్నత స్థాయి అధికారికి ఉండాల్సిన గౌరవాన్ని కల్పిస్తూనే, ఆ స్థాయి బాధ్యతలను కూడా ఆయన భుజస్కంధాలపై ఉంచింది. ఇది రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా తీసుకున్న ఒక వ్యూహాత్మక నిర్ణయంగా నిలుస్తుంది. కార్యాలయ నిర్వహణ విషయంలోనూ ప్రభుత్వం ఎక్కడా వెనకడుగు వేయలేదు. శివధర్ రెడ్డి విధులను సులభతరం చేసేందుకు ఒక ఓఎస్డీ, ప్రైవేట్ సెక్రటరీ, పర్సనల్ అసిస్టెంట్‌తో పాటు నలుగురు ఆఫీస్ సబార్డినేట్లను హోం శాఖ కేటాయించనుంది. అంటే ఒక పూర్తిస్థాయి కార్యాలయ యంత్రాంగం ఆయన ఆధీనంలో ఉంటుంది. నిరంతర నిఘా, డేటా విశ్లేషణ మరియు వివిధ విభాగాల రిపోర్టులను సమీక్షించేందుకు ఈ సిబ్బంది ఆయనకు సహకరిస్తారు. దీనివల్ల భద్రతా విశ్లేషణలు మరింత వేగంగా ప్రభుత్వానికి చేరతాయి. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత ఎదురవుతున్న భౌగోళిక మరియు రాజకీయ సవాళ్లను సమర్థంగా ఎదుర్కోవడంలో శివధర్ రెడ్డి గతంలో డీజీపీగా అద్భుతమైన ప్రతిభ కనబరిచారు. అప్పట్లో ఆయన చేపట్టిన సంస్కరణలు, పోలీస్ వ్యవస్థలో తీసుకొచ్చిన క్రమశిక్షణ నేటికీ చర్చనీయాంశమే. అందుకే ఆయనను కేవలం విశ్రాంత అధికారిగా చూడకుండా, రాష్ట్రానికి ఒక ఆస్తిగా భావించి ఈ పదవిని కట్టబెట్టారు. విపత్కర పరిస్థితుల్లో శాంతి భద్రతలను కాపాడడంలో ఆయనకు ఉన్న నేర్పు ప్రస్తుత ప్రభుత్వానికి పెద్ద బలంగా మారనుంది. ప్రస్తుత సమాజంలో అంతర్గత భద్రతకు విఘాతం కలిగించే శక్తులు పొంచి ఉన్న వేళ, అప్రమత్తంగా ఉండటం అత్యవసరం. శివధర్ రెడ్డి నియామకం వల్ల రాష్ట్రంలో నిఘా వ్యవస్థ మరింత పదును దేరనుంది. ఉగ్రవాద వ్యతిరేక చర్యలు, తీవ్రవాద నియంత్రణ వంటి సున్నితమైన అంశాల్లో ఆయన అనుభవం తెలంగాణ సరిహద్దుల్లో రక్షణ కవచంలా పనిచేస్తుంది. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలకు చేరాలన్నా, మౌలిక సదుపాయాలు మెరుగుపడాలన్నా ప్రశాంతమైన వాతావరణం ముఖ్యం. ఆ వాతావరణాన్ని నిర్మించే బాధ్యతనే ఇప్పుడు ఆయనకు అప్పగించారు. యువతకు స్ఫూర్తినిచ్చేలా శివధర్ రెడ్డి తన కెరీర్ పొడవునా నిజాయితీగా పనిచేసి గుర్తింపు పొందారు. ఇప్పుడు రెండో ఇన్నింగ్స్‌లో కూడా అదే ఉత్సాహంతో ప్రజా సేవ చేసేందుకు ఆయన సిద్ధమవుతున్నారు. పోలీస్ వ్యవస్థలో కింది స్థాయి సిబ్బందికి కూడా ఆయన మార్గదర్శకత్వం ఎంతో అవసరం. క్షేత్రస్థాయి సిబ్బంది మనోస్థైర్యాన్ని పెంచేలా, వారి పనితీరును మెరుగుపరిచేలా ఆయన ఇచ్చే సూచనలు అద్భుత ఫలితాలను ఇస్తాయని ప్రభుత్వం ఆశిస్తోంది. ఇది రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని తీసుకున్న దూరదృష్టి గల నిర్ణయం. శివధర్ రెడ్డి నియామకం తెలంగాణ పోలీస్ వ్యవస్థలో ఒక కొత్త ఉత్సాహాన్ని నింపుతోంది. ప్రభుత్వం ఆయనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ, రాష్ట్రాన్ని సురక్షితమైన మార్గంలో నడిపించడంలో ఆయన కీలక సూత్రధారి కానున్నారు. నేరాలు లేని సమాజం, భయం లేని జీవనం సాగించేలా ప్రజలకు భరోసా ఇవ్వడంలో ఈ 'స్టేట్ సెక్యూరిటీ అడ్వయిజర్' పాత్ర అత్యంత కీలకం. భవిష్యత్తులో తెలంగాణ భద్రతా వ్యవస్థ ఏ స్థాయిలో ఉంటుందో శివధర్ రెడ్డి మార్గదర్శకత్వంలో చూడాల్సి ఉంది. ఆ దిశగా రాష్ట్ర ప్రభుత్వం వేసిన ఈ అడుగు ముమ్మాటికీ ప్రశంసనీయం.

# రైతుల గుండెల్లో ఫ్యూచర్ సెగ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**



అభివృద్ధి ముసుగులో జరుగుతున్న ఈ భూసేకరణ పర్వం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో సరికొత్త రణభేరిగా మారుతుండటం గమనార్హం. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని మీర్‌ఖాన్‌పేట వేదికగా జరిగిన పోలీస్ కమిషనరేట్ శంకుస్థాపన కార్యక్రమంలో ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు ఆ ప్రాంత గిరిజన రైతులను తీవ్రంగా కలిచివేస్తున్నాయి. 2021 ఫిబ్రవరిలో రావిర్యాల సభలో రైతుల భూమిని ‘కన్నతల్లి’తో పోల్చిన అదే నాయకుడు, నేడు ఆ తల్లిని వదిలేసి ఎక్కడో కల్వకుర్తి అవతల భూములు కొనుక్కోమని ఉచిత సలహాలు ఇవ్వడాన్ని బాధితులు తట్టుకోలేకపోతున్నారు. ముఖ్యంగా యాచారం, కందుకూరు, కడ్తాల్ మండలాల్లోని 20 వేల ఎకరాల సారవంతమైన భూములను కేవలం రూ. 14 లక్షల నుంచి రూ. 16 లక్షల లోపు ధరకు గత ప్రభుత్వం తీసుకుంటోందని నాడు రేవంత్ రెడ్డి మండిపడ్డారు. ఆ భూముల విలువ కోట్లలో ఉందని, కార్పొరేట్ శక్తులకు కట్టబెట్టడమే లక్ష్యమని విమర్శించిన ఆయన, ఇప్పుడు అదే దారిలో పయనిస్తూ రైతుల ఆత్మగౌరవాన్ని కాలరాస్తున్నారని బాధితులు లేఖ ద్వారా తమ ఆవేదనను వెలిబుచ్చారు. నాడు ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు గజ్వేల్‌లోని ఫాంహౌస్ భూములకు ఎకరాకు రూ. 25 లక్షలు ఇస్తాం, 48 గంటల్లో డబ్బులు జమ చేస్తామని కేసీఆర్‌కు సవాల్ విసిరిన విషయాన్ని రైతులు గుర్తు చేస్తున్నారు. అప్పుడు రైతుల పక్షాన నిలబడ్డ కాంగ్రెస్ నేతలు మల్లు భట్టి విక్రమార్క, సీతక్క వంటి వారు నేడు ప్రభుత్వంలో కీలక పదవుల్లో ఉన్నా, తమ గోస పట్టించుకోకపోవడంపై నిరసన వ్యక్తమవుతోంది. ఫార్మా సిటీని రద్దు చేసి పూర్తి హక్కులు కల్పిస్తామన్న హామీ ఏమైందని, ఇప్పటికీ ఆ జీవోను ఎందుకు రద్దు చేయలేదని రైతులు సూటిగా ప్రశ్నిస్తున్నారు. గత 46 రోజులుగా గ్రీన్ ఫీల్డ్ రోడ్డుకు వ్యతిరేకంగా గిరిజన రైతులు నిరాహార దీక్షలు చేస్తున్నా, కనీసం వారి మొర ఆలకించకుండా సభలు నిర్వహించడం పాలకుల మొండివైఖరికి నిదర్శనంగా కనిపిస్తోంది. అభివృద్ధి పేరిట సామాన్య రైతుల నుంచి భూములు తీసుకోవడం ఇప్పుడు ఒక ఫ్యాషన్ అయిపోయిందని, కానీ అదే త్యాగాన్ని పాలకులెందుకు చేయరని రైతాంగం ప్రశ్నిస్తోంది. ముఖ్యమంత్రి చెప్పినట్లు ఫ్యూచర్ సిటీ అంత గొప్పదే అయితే, రాష్ట్ర ప్రయోజనాల కోసం నాయకులు తమ సొంత భూములను ఎందుకు దానం చేయకూడదని బాధితులు లేవనెత్తిన ప్రశ్నలు ప్రజల్లో చర్చనీయాంశమవుతున్నాయి. ముఖ్యమంత్రికి, ఆయన మంత్రివర్గానికి వందల ఎకరాల ఆస్తులు ఉన్నప్పుడు, కేవలం ఒకటి రెండు ఎకరాలపై ఆధారపడి బతికే పేద రైతులే ఎందుకు బలి కావాలని వారు నిలదీస్తున్నారు. తాము కోట్లు సంపాదించడానికో, బీరువాల్లో బంగారం నింపుకోవడానికో కాకుండా, పదిమందికి అన్నం పెట్టే ఆత్మగౌరవం కోసం వ్యవసాయం చేస్తున్నామని బాధితులు ఆవేదనగా చెబుతున్నారు. భూమి విలువ కేవలం మార్కెట్ ధరతో ముడిపడి లేదని, అది ఒక సంస్కృతి అని, జీవనాధారమని రైతులు బలంగా నమ్ముతున్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాలను తప్పుపట్టిన కాంగ్రెస్, ఇప్పుడు అదే పంథాను మరింత వేగంగా అమలు చేయడంపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమవుతోంది. అప్పుడు పల్లీ బఠానీల్లా భూములు గుంజుకుంటున్నారని విమర్శించిన వారు, ఇప్పుడు అంతకంటే తక్కువ ధరకు భూములు అప్పగించమని కోరడం హాస్యాస్పదంగా ఉందని రైతులు విమర్శిస్తున్నారు. ఫ్యూచర్ సిటీ కోసం జరుగుతున్న భూసేకరణలో పారదర్శకత లేదని, కేవలం రియల్ ఎస్టేట్ వ్యాపారులకు మేలు చేసేందుకే ఈ ప్రాజెక్టులను ముందుకు తెస్తున్నారని విపక్షాలు సైతం ఆరోపిస్తున్నాయి. సీఎం రేవంత్ రెడ్డి పర్యటన సందర్భంగా రైతులు రాసిన బహిరంగ లేఖలో మరో కీలకమైన అంశం ప్రస్తావనకు వచ్చింది. అభివృద్ధి కోసం త్యాగాలు చేయమనే ముందు, ప్రభుత్వ పెద్దలు తమ సొంత ఆస్తులను ప్రజల కోసం వదులుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. నాయకుల భూములను రైతులకు ఇచ్చి, అక్కడ ఊళ్లు కట్టిస్తే తాము సంతోషంగా తప్పుకుంటామని వారు చెబుతున్నారు. ఒకవైపు కోర్టుల నుంచి స్టే ఆర్డర్లు తెచ్చుకుని తమ భూమిని కాపాడుకోవాలని చూస్తున్న రైతులకు, ప్రభుత్వం నుంచి భరోసా లభించకపోగా బెదిరింపులు వస్తుండటం రాష్ట్రంలో ఉద్రిక్తతలకు దారితీస్తోంది. భూముల బదిలీ ఖాయమని, ఈరోజు కాకపోయినా రేపైనా ఇవ్వాల్సిందేనని సీఎం చేసిన వ్యాఖ్యలు ప్రజాస్వామ్యంలో ఏమాత్రం ఆమోదయోగ్యం కాదని మేధావులు అభిప్రాయపడుతున్నారు. ముఖ్యంగా 2021లో రేవంత్ రెడ్డి స్వయంగా అన్న మాటలను రైతులు ఇప్పుడు అస్త్రాలుగా వాడుతున్నారు. "కన్నతల్లి లాంటి భూమి మీద ఎవరైనా కన్నేస్తే గొడ్డలి పట్టుకుని నరుకుతారు" అన్న ఆయన వ్యాఖ్యలను ఇప్పుడు ప్రభుత్వానికి గుర్తు చేస్తున్నారు. నాడు రైతుల పక్షాన గొడ్డలి పట్టుకుంటామని చెప్పిన కాంగ్రెస్ నాయకులే, నేడు గొడ్డలి పట్టుకుని తమ భూములపైకి వస్తున్నారని బాధితులు వాపోతున్నారు. ఎన్నికలకు ముందు ఒక మాట, అధికారంలోకి వచ్చాక మరో మాట మాట్లాడటం తెలంగాణ రాజకీయాల్లో సర్వసాధారణమైపోయినా, ఈసారి మాత్రం రైతులు తమ ప్రాణాలైనా ఇస్తాం కానీ భూములు ఇవ్వమని తెగేసి చెబుతున్నారు. ఫార్మా సిటీ రద్దు హామీని అమలు చేయకుండా, కొత్త పేర్లతో భూసేకరణ చేయడం ప్రజలను వంచించడమేనని బాధితుల వాదన. ఈ మొత్తం వ్యవహారంలో పాలకుల ద్వంద్వ వైఖరి స్పష్టంగా కనిపిస్తోంది. గత ప్రభుత్వ హయాంలో ఇండస్ట్రీస్ మినిస్టర్‌గా ఉన్న జూపల్లి కృష్ణారావు 90 శాతం భూములు క్లియర్ చేశారని ఇప్పుడు రేవంత్ రెడ్డి చెప్పడం ద్వారా, గత తప్పిదాలను ఇప్పుడు సమర్థించుకుంటున్నట్లుగా ఉంది. అప్పుడు ధరకు భూములు ఇస్తే బాగుండేదని, ఇప్పుడు గజాల ధరలు కూడా రావని చెప్పడం రైతులను భయపెట్టడమేనని బాధితులు అంటున్నారు. కేసీఆర్ హయాంలో భూసేకరణను వ్యతిరేకించినప్పుడు ఉన్న నైతికత, ఇప్పుడు అదే భూములను లాక్కోవడానికి ఎందుకు కనుమరుగైందో సమాధానం చెప్పాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. అభివృద్ధి అనేది ప్రజల కన్నీళ్ల మీద నిర్మించబడకూడదని, రైతుల ఇష్టాయిష్టాలతో సంబంధం లేకుండా బలవంతంగా భూములు తీసుకోవడం రాజ్యాంగ విరుద్ధమని రైతు సంఘాలు హెచ్చరిస్తున్నాయి. ముఖ్యంగా గిరిజన ప్రాంతాల్లో భూసేకరణ చట్టాలను తుంగలో తొక్కడంపై న్యాయపోరాటం చేస్తామని వారు స్పష్టం చేస్తున్నారు. ఫ్యూచర్ సిటీ పేరుతో జరుగుతున్న ఈ భారీ ప్రాజెక్టు వల్ల స్థానిక గ్రామాలు కనుమరుగయ్యే ప్రమాదం ఉందని, వేల కుటుంబాలు రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వాలు మారుతున్నా రైతుల తలరాతలు మారడం లేదని, భూసేకరణ పేరుతో జరిగే దోపిడీ నిరంతరం సాగుతూనే ఉందని ఈ పరిణామాలు రుజువు చేస్తున్నాయి. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన నిర్ణయాన్ని పునరాలోచించుకోకపోతే రానున్న రోజుల్లో పోరాటం ఉధృతం చేస్తామని రైతులు హెచ్చరిస్తున్నారు. పాదయాత్రల ద్వారా సాధించిన అధికారాన్ని, అదే పాదయాత్రలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడానికి ఉపయోగించాలని వారు కోరుతున్నారు. పచ్చని పంట పొలాలను కాంక్రీట్ జంగిల్‌గా మార్చడం కంటే, రైతులకు ఇచ్చిన మాట ప్రకారం వారి భూములు వారిని సాగు చేసుకోనివ్వడమే నిజమైన అభివృద్ధి అని వారు లేఖలో పేర్కొన్నారు. ఈ భూపోరాటం రాబోయే రోజుల్లో రేవంత్ సర్కారుకు పెద్ద సవాలుగా మారే అవకాశం కనిపిస్తోంది.

# కరెంటు సమస్య రానివ్వం



**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ గగనతలం నుంచి నిప్పులు కురిపిస్తున్న భానుడి భగభగలకు రాష్ట్రం అల్లాడిపోతుంటే, ఆ సెగను తట్టుకునేలా విద్యుత్ రంగాన్ని సన్నద్ధం చేస్తూ ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు. ఏప్రిల్ మాసంలోనే రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతున్న నేపథ్యంలో, కరెంటు కష్టాలు అనే మాట వినబడకుండా గ్రిడ్‌ను పటిష్టం చేయడమే లక్ష్యంగా ఆయన అడుగులు వేస్తున్నారు. గురువారం ప్రజాభవన్‌లో ఇంధన శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సుదీర్ఘ సమీక్షలో రాష్ట్ర ప్రజలకు నాణ్యమైన విద్యుత్ అందించడమే ప్రభుత్వ ప్రథమ కర్తవ్యమని ఆయన స్పష్టం చేశారు. ఎండలు ముదురుతున్న వేళ ఎక్కడా సాంకేతిక లోపాలు తలెత్తకుండా యంత్రాంగం నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, వినియోగదారులకు అంతరాయం లేని సరఫరాను ఒక సవాలుగా తీసుకోవాలని ఆయన దిశానిర్దేశం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా సామాన్య ప్రజల నుంచి సాఫ్ట్‌వేర్ ఉద్యోగుల వరకు అందరూ ఏసీలు, కూలర్లపైనే ఆధారపడుతుండటంతో విద్యుత్ డిమాండ్ అనూహ్యంగా పెరిగిపోయింది. నగరాల్లో అపార్ట్‌మెంట్ కల్చర్ పెరగడం, కార్యాలయాల్లో నిరంతరం విద్యుత్ వినియోగం ఉండటంతో పాటు గ్రామాల్లో వ్యవసాయ అవసరాల కోసం పంపుసెట్లు భారీగా నడుస్తున్నాయి. ఈ ఏడాది రికార్డు స్థాయిలో విద్యుత్ వాడకం జరుగుతోందని అధికారులు మంత్రికి వివరించారు. సాధారణ రోజులతో పోలిస్తే వేసవిలో డిమాండ్ సుమారు ఇరవై నుంచి ముప్పై శాతం వరకు అదనంగా పెరిగిందని, దీనివల్ల గ్రిడ్‌పై ఒత్తిడి ఏర్పడుతోందని అధికారులు నివేదించారు. ఈ ఒత్తిడిని అధిగమించేందుకు అవసరమైన అన్ని సాంకేతిక మార్పులను ఇప్పటికే క్షేత్రస్థాయిలో పూర్తి చేసినట్లు భట్టికి వివరించారు. దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాలు విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడుతున్నప్పటికీ, తెలంగాణలో మాత్రం అలాంటి పరిస్థితి రాకూడదని మంత్రి ఆదేశించారు. బహిరంగ మార్కెట్‌లో విద్యుత్ యూనిట్ ధర ఎంత ఉన్నా సరే, ప్రజల అవసరాల కోసం పవర్ ఎక్స్ఛేంజీల ద్వారా అదనపు విద్యుత్‌ను కొనుగోలు చేయాలని భట్టి స్పష్టం చేశారు. ఇందుకోసం ముందస్తుగా నిధుల సర్దుబాటు చేయడం, అవసరమైన ఒప్పందాలను వేగవంతం చేయాలని అధికారులకు సూచించారు. రాష్ట్రంలో ఉత్పత్తి అవుతున్న విద్యుత్ సరిపోని పక్షంలో, జాతీయ గ్రిడ్ నుంచి వాటా పొందేందుకు గల అన్ని మార్గాలను అన్వేషించాలని ఆయన చెప్పారు. విద్యుత్ కొనుగోళ్లలో పారదర్శకత పాటిస్తూనే, సరఫరాలో ఎక్కడా లోటు రాకుండా చూడటం ఇప్పుడున్న అత్యంత ప్రధానమైన బాధ్యత అని ఆయన ఉద్ఘాటించారు. ఆసుపత్రులు, తాగునీటి సరఫరా పథకాల విషయంలో అధికారులు మరింత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని మంత్రి ఆదేశించారు. ఎండల తీవ్రత దృష్ట్యా ఆసుపత్రులలో వెంటిలేటర్లు, ఇతర వైద్య పరికరాలు నిరంతరం పనిచేయాలని, అక్కడ ఒక్క నిమిషం విద్యుత్ నిలిచినా అది ప్రాణాల మీదకు వస్తుందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే మండుతున్న ఎండల్లో ప్రజలకు తాగునీటి కష్టాలు కలగకుండా మిషన్ భగీరథ, స్థానిక మున్సిపల్ పంపింగ్ కేంద్రాలకు నిరంతరం కరెంటు ఉండాలని చెప్పారు. ఈ అత్యవసర సేవలకు ప్రత్యేకమైన ఫీడర్ల ద్వారా సరఫరా జరిగేలా చూడాలని, ఏదైనా అత్యవసర మరమ్మతులు ఉంటే ప్రత్యామ్నాయ మార్గాల ద్వారా విద్యుత్ అందించేలా సిద్ధంగా ఉండాలని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలోని థర్మల్ విద్యుత్ ఉత్పత్తి కేంద్రాలు వాటి పూర్తి సామర్థ్యంతో పనిచేసేలా చర్యలు తీసుకోవాలని జెన్‌కో అధికారులకు మంత్రి భట్టి విక్రమార్క సూచించారు. బొగ్గు నిల్వలు సరిపడా ఉండేలా చూసుకోవాలని, యంత్రాల నిర్వహణలో ఏవైనా లోపాలు ఉంటే వాటిని వెంటనే సరిదిద్దాలని ఆదేశించారు. ముఖ్యంగా కేటీపీఎస్, భద్రాద్రి, సింగరేణి విద్యుత్ కేంద్రాల నుంచి ఉత్పత్తిలో జాప్యం జరగకుండా చూడాలన్నారు. ఎండల వల్ల నీటి లభ్యత తగ్గుతున్నప్పటికీ, అందుబాటులో ఉన్న నీటి వనరులను ఉపయోగించుకుని జల విద్యుత్ ఉత్పత్తిని కూడా సమర్థంగా నిర్వహించాలని చెప్పారు. గరిష్ట డిమాండ్ ఉండే సమయాల్లో జల విద్యుత్ కేంద్రాలు గ్రిడ్‌కు కీలకమైన మద్దతుగా నిలుస్తాయని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేశారు. రాబోయే మే నెలలో ఉష్ణోగ్రతలు మరింత తీవ్రమయ్యే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరిస్తున్న నేపథ్యంలో, విద్యుత్ సంస్థలు అప్రమత్తంగా ఉండాలని మంత్రి కోరారు. ట్రాన్స్‌కో, జెన్‌కో, డిస్కంల మధ్య సరైన సమన్వయం ఉంటేనే వ్యవస్థ సజావుగా నడుస్తుందని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రతి జిల్లాలో ఒక ప్రత్యేక నియంత్రణ గదిని ఏర్పాటు చేసి, ఎక్కడైనా ట్రాన్స్‌ఫార్మర్లు కాలిపోయినా లేదా వైర్లు తెగిపోయినా యుద్ధ ప్రాతిపదికన స్పందించాలని సూచించారు. సిబ్బంది సెలవులను నియంత్రించడమే కాకుండా, క్షేత్రస్థాయిలో లైన్ మెన్లకు అవసరమైన పరికరాలు, వాహనాలను అందుబాటులో ఉంచాలని చెప్పారు. ముందస్తు ప్రణాళికే విజయానికి మార్గమని, అందుకే ప్రతి గంటా పరిస్థితిని పర్యవేక్షించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. తెలంగాణ విద్యుత్ వ్యవస్థ ఎంతటి క్లిష్ట పరిస్థితులనైనా ఎదుర్కొనే శక్తిని కలిగి ఉందని మంత్రి భట్టి ధీమా వ్యక్తం చేశారు. గతంతో పోలిస్తే ఇప్పుడు రాష్ట్రంలో మౌలిక సదుపాయాలు మెరుగుపడ్డాయని, సబ్ స్టేషన్ల సామర్థ్యం పెరిగిందని ఆయన వివరించారు. పారిశ్రామిక రంగానికి, గృహ వినియోగదారులకు, రైతాంగానికి ఎవరికీ ఇబ్బంది కలగకుండా సమతుల్యత పాటిస్తున్నట్లు తెలిపారు. పరిస్థితిని నిశితంగా గమనిస్తూ ఎప్పటికప్పుడు అవసరమైన నిర్ణయాలు తీసుకునే అధికారం అధికారులకు కట్టబెట్టారు. విద్యుత్ పొదుపు విషయంలో కూడా ప్రజల్లో అవగాహన కల్పించాలని, అనవసరంగా లైట్లు, ఏసీలు వాడకుండా చూడటం వల్ల గ్రిడ్ భద్రతకు సహకరించినట్లు అవుతుందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో దాదాపు పదిహేను వేల మెగావాట్ల పైచిలుకు విద్యుత్ డిమాండ్ నమోదవుతున్న తరుణంలో, దానిని అధిగమించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి స్పష్టం చేశారు. విద్యుత్ సరఫరాలో నాణ్యత ముఖ్యం అని, లో వోల్టేజ్ సమస్యలు రాకుండా చూడాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లో రాత్రి వేళల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతే ప్రజలు పడే ఇబ్బందులను ఆయన అధికారులకు వివరించారు. నాణ్యమైన కరెంటు అందించడం అంటే కేవలం సరఫరా చేయడం మాత్రమే కాదు, అది నిరంతరాయంగా, సరైన వోల్టేజ్‌తో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ప్రభుత్వానికి ప్రజల సంక్షేమమే పరమావధి అని, అందుకోసం ఎంతటి వ్యయానికైనా వెనకాడబోమని భట్టి విక్రమార్క భరోసా ఇచ్చారు. ఇంధన రంగంలో వస్తున్న మార్పులను గమనిస్తూ పునరుత్పాదక ఇంధన వనరులను కూడా ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని మంత్రి ఈ సమావేశంలో చర్చించారు. సౌర విద్యుత్ వినియోగాన్ని పెంచడం ద్వారా పగటిపూట డిమాండ్‌ను కొంతవరకు తగ్గించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. ప్రస్తుతం ఎదుర్కొంటున్న వేసవి సవాళ్లను దాటుకుంటూనే, భవిష్యత్తులో విద్యుత్ అవసరాలను తీర్చేలా దీర్ఘకాలిక వ్యూహాలను రూపొందిస్తున్నట్లు తెలిపారు. విద్యుత్ సంస్థలు నష్టాల్లో ఉన్నప్పటికీ, వినియోగదారులకు భారం పడకుండా సమర్థవంతమైన నిర్వహణ ద్వారా ముందుకు సాగాలని ఆయన కోరారు. ప్రతి పైసాను ఆచితూచి ఖర్చు చేస్తూనే గరిష్ట ఫలితాలను సాధించాలని అధికారులకు కర్తవ్య బోధ చేశారు. ఈ కీలక సమావేశంలో ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ పాల్గొని రాష్ట్రంలోని విద్యుత్ నిల్వలు, పంపిణీ ఏర్పాట్లపై సమగ్ర వివరణ ఇచ్చారు. ట్రాన్స్‌కో సీఎండీ కృష్ణభాస్కర్ గారు సరఫరా వ్యవస్థలో తీసుకున్న జాగ్రత్తలను మంత్రికి వివరించగా, జెన్‌కో సీఎండీ హరీశ్ ఉత్పత్తి కేంద్రాల పనితీరును తెలియజేశారు. అలాగే ఎస్పీడీసీఎల్ సీఎండీ జితేష్ వీ పాటిల్ నగరాల్లో పెరుగుతున్న డిమాండ్, క్షేత్రస్థాయి సిబ్బంది సన్నద్ధతపై నివేదిక సమర్పించారు. అధికారులు అందరూ ఏకతాటిపై నిలిచి ఈ వేసవి గండాన్ని గట్టెక్కించాలని, ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగనివ్వబోమని ఈ సందర్భంగా మంత్రికి వారు హామీ ఇచ్చారు.

# కూలిన ట్రాఫిక్ షెల్టర్

**రోడ్డుమధ్య ఆటోలు, నియంత్రణ కోల్పోయిన లారీ..కూలిన ట్రాఫిక్ షెల్టర్**




**మణుగూరు, విశాలభారతి:** మణుగూరు బస్టాండ్ సెంటర్‌లో ఒక ప్రమాద ఘటన చోటుచేసుకుంది. రోడ్డుమధ్యలో ఆటోలు నిర్లక్ష్యంగా నిలిపివేయడం వల్ల ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ నేపథ్యంలో టీడీపీ సెంటర్ వైపు నుంచి ఏటూరునాగారం దిశగా వెళ్తున్న ధాన్యం లోడుతో ఉన్న లారీ నియంత్రణ కోల్పోయింది. దారి లేకపోవడంతో లారీ బస్టాండ్ సెంటర్‌లో ట్రాఫిక్ నియంత్రణ కోసం ఏర్పాటు చేసిన పోలీస్ షెల్టర్‌ను ఢీకొట్టింది. ఈ ఢీకొట్టడంతో షెల్టర్ డివైడర్ మీద పడిపోయింది. ఘటనలో పెద్ద ప్రమాదం తప్పినప్పటికీ, స్థానికులు చెబుతున్నదేమిటంటే, బస్టాండ్ సెంటర్‌లో ఆటోలు రోడ్డుమధ్యలో నిలిపివేయడం వల్ల ఇలాంటి ప్రమాదాలు తరచూ జరుగుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ట్రాఫిక్ నియంత్రణలో పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

# రేవంత్ వర్సెస్ కాంట్రాక్టర్ల 'బిగ్ ఫైట్'..!

**మొదటిపేజీ తరువాయి**

పగుళ్లు ఇప్పుడు లీగల్ నోటీసుల రూపంలో కొత్త మలుపు తిరిగాయి. ముఖ్యంగా అన్నారం బ్యారేజీ నిర్వహణ బాధ్యతలపై ప్రభుత్వం, నిర్మాణ సంస్థల మధ్య మొదలైన 'కోల్డ్ వార్' ఇప్పుడు కోర్టు గడప తొక్కేలా కనిపిస్తోంది. రాష్ట్ర ప్రయోజనాల దృష్ట్యా ప్రాజెక్టును కాపాడాలని రేవంత్ రెడ్డి ప్రభుత్వం చూస్తుంటే, సాంకేతిక అంశాలను అడ్డం పెట్టుకుని కాంట్రాక్ట్ సంస్థలు ఎదురుదాడికి దిగడం రాజకీయ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ పరిణామాలు కేవలం ఇంజనీరింగ్ వైఫల్యాల గురించే కాకుండా, రాష్ట్ర ఖజానాపై పడే అదనపు భారంపై కూడా పెద్ద ఎత్తున చర్చకు దారితీస్తున్నాయి. బ్యారేజీల మరమ్మతుల విషయంలో ప్రభుత్వం తీసుకుంటున్న కఠిన నిర్ణయాలు కాంట్రాక్ట్ సంస్థలకు మింగుడు పడటం లేదు. మేడిగడ్డ తరహాలోనే అన్నారం, సుందిళ్ల బ్యారేజీలు కూడా నాసిరకం పనుల వల్లే దెబ్బతిన్నాయని, కాబట్టి రూపాయి కూడా ప్రభుత్వం నుంచి ఆశించకుండా సంస్థలే వాటిని బాగు చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి స్పష్టం చేశారు. అయితే, అన్నారం బ్యారేజీని నిర్మించిన ఆఫ్కాన్స్‌విజేతపీఈఎస్ కన్సార్టియం మాత్రం తమపై వస్తున్న ఆరోపణలను తోసిపుచ్చుతోంది. గత ప్రభుత్వం నుంచి ప్రస్తుత ప్రభుత్వం వరకు సాగిన ఈ ప్రయాణంలో తాము నిబంధనల ప్రకారమే పని చేశామని అవి వాదిస్తున్నాయి. ఈ క్రమంలోనే ప్రభుత్వానికి లీగల్ నోటీసులు పంపినట్లు జరుగుతున్న ప్రచారం సచివాలయ వర్గాల్లో హాట్ టాపిక్‌గా మారింది. నిర్మాణ సంస్థల వాదన ప్రకారం అన్నారం బ్యారేజీ పనులు 2019 నాటికే పూర్తి స్థాయిలో ముగిశాయి. ఆ సమయంలోనే నీటి పారుదల శాఖకు చెందిన ఉన్నతాధికారులు ప్రాజెక్టును తనిఖీ చేసి, పనులన్నీ నాణ్యతతో కూడి ఉన్నాయని ధృవీకరిస్తూ 'కంప్లీషన్ సర్టిఫికేట్లు' జారీ చేశారు. ఒప్పందం ప్రకారం ఒక ప్రాజెక్టు పూర్తయిన తర్వాత ఉండే డిఫెక్ట్ లయబిలిటీ పీరియడ్ కూడా ఇప్పటికే ముగిసిపోయిందని ఆ సంస్థలు లీగల్ నోటీసులో ప్రధానంగా ప్రస్తావించాయి. పనులు ముగిసిన సమయంలో ఎటువంటి అభ్యంతరాలు వ్యక్తం చేయని ప్రభుత్వం, ఇప్పుడు సమస్యలు తలెత్తగానే పాత ఒప్పందాలను విస్మరించి తమను బాధ్యులను చేయడం తగదని ఆ సంస్థలు గట్టిగా వాదిస్తున్నాయి. ఇది కేవలం సాంకేతిక అంశమే కాకుండా, కాంట్రాక్ట్ చట్టాలకు సంబంధించిన అంశమని గుర్తు చేస్తున్నాయి. ఆర్థిక కోణంలో చూస్తే ఈ వివాదం మరింత జటిలంగా కనిపిస్తోంది. అన్నారం బ్యారేజీ పనులకు సంబంధించి దాదాపు రూ. 176.5 కోట్ల బకాయిలు 2023 ఆగస్టు నుంచి పెండింగ్‌లో ఉన్నాయని నిర్మాణ సంస్థలు లెక్కలు గడుతున్నాయి. కేవలం బకాయిలు చెల్లిస్తే సరిపోదని, వాటికి 2026 ఆగస్టు నుండి 12 శాతం వడ్డీని కూడా కలిపి చెల్లించాల్సి ఉంటుందని నోటీసులో హెచ్చరించడం గమనార్హం. ఇప్పటికే తమకు రావలసిన నిధుల కోసం 12 సార్లు ప్రభుత్వానికి విజ్ఞప్తులు పంపినా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదని, అందుకే తప్పనిసరి పరిస్థితుల్లో న్యాయ పోరాటానికి సిద్ధమవుతున్నామని అవి స్పష్టం చేశాయి. ఈ వడ్డీల భారం రాష్ట్ర ఖజానాపై అదనపు భారం పడేలా చేస్తోందని ఆర్థిక నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఈ విషయంలో వెనక్కి తగ్గేలా కనిపించడం లేదు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ప్రాజెక్టు డిజైన్ల నుంచి నిర్మాణాల వరకు అన్నీ అస్తవ్యస్తంగా జరిగాయని రేవంత్ రెడ్డి ప్రభుత్వం నమ్ముతోంది. ముఖ్యంగా బ్యారేజీలు దెబ్బతిన్న సమయానికి కూడా లయబిలిటీ పీరియడ్ అమలులోనే ఉందని, అధికారులు నిబంధనలకు విరుద్ధంగా సర్టిఫికేట్లు ఇవ్వడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉందని ప్రభుత్వం అనుమానిస్తోంది. అందుకే నాసిరకం పనులకు పాల్పడిన సంస్థలే వాటి బాధ్యత వహించాలని, లేని పక్షంలో వాటిని బ్లాక్ లిస్టులో పెడతామని కూడా హెచ్చరికలు జారీ చేసింది. రాజకీయ ఒత్తిళ్లకు లొంగకుండా పూర్తి స్థాయిలో విచారణ జరిపించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది.



# టీఆర్ఎస్ నాకు రాసిపెట్టి ఉందేమో!

**మొదటిపేజీ తరువాయి**

ఒక గొప్ప అనుభూతిని ఇస్తోందని ఆమె సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న తన మద్దతుదారులకు, తెలంగాణ ప్రజలకు ఆమె ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలియజేశారు. తన భవిష్యత్ కార్యాచరణపై స్పష్టమైన ప్రకటన చేస్తూ అడుగులు ముందుకు వేస్తానని ఆమె ధీమా వ్యక్తం చేశారు. గత రెండు దశాబ్దాలుగా తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని కాపాడటం కోసం తాను పడిన తపనను ఆమె గుర్తు చేసుకున్నారు. మట్టి మనుషుల అస్తిత్వ పరిరక్షణ కోసం తాను చేస్తున్న పోరాటాన్ని ఇకపై కూడా అదే అంకితభావంతో, రెట్టింపు ఉత్సాహంతో కొనసాగిస్తానని కవిత ఈ సందర్భంగా ఘనంగా హామీ ఇచ్చారు. ప్రజాక్షేత్రంలో ఉంటూ వారి సమస్యల పరిష్కారమే పరమావధిగా పనిచేస్తానని పేర్కొన్నారు. పార్టీ పేరు ఎంపిక వెనుక ఉన్న అంతర్గత పరిణామాలను, సాంకేతిక అంశాలను సైతం కవిత ఈ సందర్భంగా వివరించారు. జనవరి 2026లో కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల మేరకు తాము మొత్తం ఐదు పేర్లను ప్రతిపాదిస్తూ దరఖాస్తు చేశామని ఆమె వెల్లడించారు. రాజకీయ పార్టీల నమోదు ప్రక్రియలో భాగంగా అనుసరించాల్సిన అన్ని నియమ నిబంధనలను పాటిస్తూ ఈ అప్లికేషన్ దాఖలు చేసినట్లు ఆమె చెప్పారు. అందులో తాము మూడవ ప్రాధాన్యతగా ఇచ్చిన పేరునే ఈసీ ఖరారు చేయడం నిజంగా ఒక అద్భుతమని ఆమె వ్యాఖ్యానించారు. తాము ఆశించిన పేరు రావడం వెనుక ఏదో ఒక దైవ సంకల్పం ఉండి ఉంటుందని ఆమె భావిస్తున్నారు. కొత్త పార్టీగా తెలంగాణ రక్షణ సేన పేరు రావడం రాష్ట్ర ప్రజలందరికీ గర్వకారణమని కవిత అభిప్రాయపడ్డారు. తెలంగాణ పేరులోని భావోద్వేగం, రక్షణ అనే పదంలోని బాధ్యత కలగలిసి ఈ పార్టీకి ఒక ప్రత్యేక గుర్తింపును ఇస్తాయని ఆమె నమ్ముతున్నారు. ప్రస్తుత రాజకీయ పరిస్థితుల్లో తెలంగాణ ప్రయోజనాలను కాపాడటమే తమ ప్రధాన లక్ష్యమని ఆమె స్పష్టం చేశారు. కేవలం అధికారం కోసమే కాకుండా, రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావడానికి ఈ వేదిక ఉపయోగపడుతుందని ఆమె వివరించారు. సమాజంలోని అన్ని వర్గాల ప్రజలు ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తారని ఆమె ఆశాభావం వ్యక్తం చేశారు. వచ్చే రోజుల్లో ప్రజా సమస్యలపై తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తానని కవిత గట్టిగా చెప్పారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను తెలుసుకుని, వాటి పరిష్కారం కోసం నిరంతరం శ్రమిస్తానని ఆమె పేర్కొన్నారు. ముఖ్యంగా యువత, మహిళలు, రైతుల పక్షాన నిలబడి వారి గొంతుకగా మారడమే తమ పార్టీ ఉద్దేశమని ఆమె వివరించారు. ప్రభుత్వ విధానాల్లో లోపాలను ఎండగడుతూనే, నిర్మాణాత్మకమైన విపక్ష పాత్రను పోషిస్తామని ఆమె భరోసా ఇచ్చారు. రాజకీయాల్లో విలువల కోసం పోరాడే శక్తులన్నీ తమతో కలిసి వస్తాయని ఆమె బలంగా విశ్వసిస్తున్నారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటిచెప్పడంలో తాను ఎప్పుడూ ముందే ఉంటానని కవిత పునరుద్ఘాటించారు. గతంలో తాను చేపట్టిన అనేక కార్యక్రమాలు కేవలం రాజకీయాల కోసమే కాకుండా, తెలంగాణ ఆత్మగౌరవాన్ని నిలబెట్టేవిగా ఉన్నాయని ఆమె గుర్తు చేశారు. అదే స్ఫూర్తిని ఇకపై కూడా కొనసాగిస్తూ, ప్రతి ఇంట్లో తెలంగాణ రక్షణ సేన జెండా ఎగిరేలా చేస్తానని ఆమె శపథం చేశారు. రాజకీయాల్లో గెలుపోటముల కంటే ప్రజల మనసు గెలవడమే ముఖ్యమని ఆమె భావిస్తున్నారు. అందుకే నిరంతరం ప్రజల మధ్య ఉంటూ వారి కష్టసుఖాల్లో పాలుపంచుకుంటానని ఆమె స్పష్టమైన హామీ ఇచ్చారు. ఢిల్లీలోని ఎన్నికల సంఘం కార్యాలయం నుండి వచ్చిన ఈ సానుకూల నిర్ణయం తమ శ్రేణుల్లో కొత్త ఉత్సాహాన్ని నింపిందని కవిత అన్నారు. పార్టీ రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి కావడంతో ఇక పూర్తిస్థాయిలో రంగంలోకి దిగేందుకు సమయం ఆసన్నమైందని ఆమె పేర్కొన్నారు. త్వరలోనే రాష్ట్రవ్యాప్తంగా పర్యటనలు చేపట్టి కార్యకర్తలకు దిశానిర్దేశం చేస్తానని ఆమె వివరించారు. ప్రతి గ్రామంలోనూ పార్టీ కమిటీలను బలోపేతం చేసి, బలమైన గొలుసుకట్టు వ్యవస్థను నిర్మిస్తామని ఆమె చెప్పారు. ఇందుకు సంబంధించిన ప్రణాళికలు ఇప్పటికే సిద్ధమయ్యాయని, అతి త్వరలోనే వాటిని బహిర్గతం చేస్తామని ఆమె వెల్లడించారు. జనవరి 2026 నాటి గణాంకాలను పరిశీలిస్తే, రాష్ట్రంలో కొత్త రాజకీయ ప్రత్యామ్నాయం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నట్లు కనిపిస్తోందని ఆమె విశ్లేషించారు.



# రూ.7,823 కోట్లతో అభివృద్ధి పండుగ

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ అభివృద్ధి ప్రస్థానంలో సరికొత్త అధ్యాయం లిఖించేందుకు దేశ ప్రధాని నరేంద్ర మోదీ భాగ్యనగరానికి విచ్చేస్తున్నారు. రాష్ట్రాభివృద్ధికి పెద్దపీట వేస్తూ కేంద్ర ప్రభుత్వం సంకల్పించిన వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులు త్వరలోనే ప్రజలకు అందుబాటులోకి రానున్నాయి. ఈ పర్యటన ద్వారా అటు మౌలిక సదుపాయాల కల్పనతో పాటు, ఇటు విద్యా రంగంలో కీలకమైన గిరిజన విశ్వవిద్యాలయ నిర్మాణానికి కూడా పునాది పడనుంది. రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ఈ విషయాలను వెల్లడిస్తూ, తెలంగాణ ప్రజల చిరకాల స్వప్నాలు ఒక్కొక్కటిగా సాకారమవుతున్న తీరును వివరించారు. ఈ పర్యటన కేవలం శిలాన్యాసాలకే పరిమితం కాకుండా, రాష్ట్ర పారిశ్రామిక, రవాణా రంగాల ముఖచిత్రాన్ని మార్చే విధంగా ఉండబోతోంది. వచ్చే నెల 10వ తేదీన ప్రధాని మోదీ హైదరాబాద్ పర్యటన ఖరారైంది. ఈ సందర్భంగా మొత్తం 7,823 కోట్ల రూపాయల విలువైన పలు అభివృద్ధి పనులకు ఆయన శ్రీకారం చుట్టనున్నారు. ఇందులో ప్రధానంగా ములుగు జిల్లాలో ఏర్పాటు చేయనున్న సమ్మక్కసారలమ్మ గిరిజన విశ్వవిద్యాలయ క్యాంపస్ నిర్మాణ పనులు త్వరలోనే ప్రారంభం కానున్నాయని కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. గిరిజన ప్రాంతాల్లో ఉన్నత విద్యను చేరువ చేయాలనే లక్ష్యంతో కేంద్రం ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టును చేపట్టింది. విద్యా రంగంలో తెలంగాణకు ఇది ఒక మైలురాయిగా నిలుస్తుందని, భవిష్యత్ తరాలకు విజ్ఞాన గనిగా మారుతుందని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. కేవలం విద్యా రంగానికి మాత్రమే కాకుండా, మౌలిక సదుపాయాల కల్పనకు కూడా ఈ పర్యటనలో ప్రాధాన్యత లభించనుంది. హైదరాబాద్ నగరాభివృద్ధిలో మరో ముందడుగుగా పెట్రోలియం ఉత్పత్తులకు సంబంధించి నిర్మించిన అత్యాధునిక టెర్మినల్‌ను ప్రధాని ప్రారంభించనున్నారు. ఇంధన భద్రత, సరఫరా వ్యవస్థను బలోపేతం చేయడంలో ఈ టెర్మినల్ కీలక పాత్ర పోషిస్తుంది. దీనితో పాటు మహబూబ్‌నగర్ జిల్లా పరిధిలో 3,175 కోట్ల రూపాయల అంచనా వ్యయంతో చేపట్టనున్న జాతీయ రహదారి పనులకు మోదీ వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేస్తారు. రవాణా వ్యవస్థ మెరుగుపడితేనే ఆర్థికాభివృద్ధి సాధ్యమని భావిస్తున్న కేంద్రం, తెలంగాణలోని వివిధ జిల్లాలను అనుసంధానించేలా ఈ భారీ రహదారి ప్రాజెక్టును రూపొందించింది. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే ప్రయాణ సమయం తగ్గడంతో పాటు వాణిజ్య కార్యకలాపాలు ఊపందుకుంటాయి. రైల్వే రంగానికి సంబంధించి కూడా ప్రధాని పర్యటనలో కీలక ప్రకటనలు వెలువడనున్నాయి. హఫీజ్‌పేట, జోగులాంబ గద్వాల వంటి రైల్వే స్టేషన్ల ఆధునీకరణ పనులతో పాటు, కాజీపేట మరియు విజయవాడ మధ్య అత్యంత కీలకమైన మూడో రైల్వే లైన్‌ను ప్రధాని మోదీ ప్రారంభించనున్నారు. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా సుమారు 85 వేల కోట్ల రూపాయల విలువైన రైల్వే ప్రాజెక్టులు వివిధ దశల్లో నిర్మాణంలో ఉండటం గమనార్హం. దీనివల్ల ప్రయాణికుల రద్దీ తగ్గడమే కాకుండా సరుకు రవాణాలో వేగం పెరుగుతుంది. రైల్వే శాఖ తెలంగాణలో మౌలిక వసతుల కల్పన కోసం మునుపెన్నడూ లేని విధంగా భారీగా నిధులను కేటాయించిందని కిషన్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తుచేశారు. హైదరాబాద్ నగరవాసుల రవాణా కష్టాలను తీర్చేందుకు ఎంఎంటీఎస్ రెండో విడత పనులు కూడా వేగంగా సాగుతున్నాయి. ఇప్పటికే హైదరాబాద్‌యాదగిరిగుట్ట మధ్య ఎంఎంటీఎస్ పనులు ప్రారంభమై కొనసాగుతున్నాయని, భవిష్యత్తులో నగరం చుట్టుపక్కల ప్రాంతాలకు ప్రయాణం మరింత సులభతరం అవుతుందని మంత్రి వివరించారు. మరోవైపు వరంగల్‌లో ప్రతిష్ఠాత్మకమైన కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌ను అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దుతున్నట్లు ఆయన తెలిపారు. తెలంగాణలో పారిశ్రామిక వేగంతో పాటు ఉపాధి అవకాశాలను పెంచడమే లక్ష్యంగా ఈ పార్కు నిర్మాణం జరుగుతోంది. రాబోయే రోజుల్లో దక్షిణ భారతదేశంలోనే వరంగల్ ఒక భారీ వస్త్ర పరిశ్రమల హబ్‌గా అవతరించబోతోందని కిషన్ రెడ్డి విశ్వాసం వ్యక్తం చేశారు. వస్త్ర పరిశ్రమపై కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని, 2030 నాటికి దేశం నుంచి 9 లక్షల కోట్ల రూపాయల విలువైన టెక్స్‌టైల్ ఉత్పత్తుల ఎగుమతే లక్ష్యంగా ప్రణాళికలు రూపొందించినట్లు కిషన్ రెడ్డి చెప్పారు. ఇందులో తెలంగాణ వాటా గణనీయంగా ఉండాలని కేంద్రం ఆశిస్తోంది. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా స్థానిక కళాకారులకు, కార్మికులకు పెద్దపీట వేస్తూ అంతర్జాతీయ మార్కెట్లను అందిపుచ్చుకునేలా ప్రోత్సాహకాలు అందిస్తున్నామన్నారు. ఈ లక్ష్య సాధనలో రాష్ట్రంలోని మెగా టెక్స్‌టైల్ పార్కులు వెన్నెముకగా నిలుస్తాయని ఆయన వివరించారు. ప్రధాని పర్యటన సందర్భంగా ఈ రంగంలో రాబోయే పెట్టుబడుల గురించి మరింత స్పష్టత వచ్చే అవకాశం కనిపిస్తోంది. నరేంద్ర మోదీ మూడోసారి ప్రధానమంత్రి బాధ్యతలు స్వీకరించిన తర్వాత తొలిసారిగా తెలంగాణకు వస్తున్నందున, ఈ పర్యటనను ఘనంగా నిర్వహించాలని బీజేపీ శ్రేణులు భావిస్తున్నాయి. ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా భారీ ఏర్పాట్లు చేస్తున్నామని, పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేయాలని కిషన్ రెడ్డి పిలుపునిచ్చారు. ఈ అభివృద్ధి పనుల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరూ సహకరించాలని ఆయన కోరారు. రాష్ట్ర పురోభివృద్ధిలో ఇదొక కీలక ఘట్టమని, ప్రజలందరూ ప్రధాని ఇచ్చే సందేశాన్ని వినేందుకు తరలిరావాలని ఆయన సూచించారు. హైదరాబాద్‌లో జరిగే సభకు సంబంధించి ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేసినట్లు తెలుస్తోంది. దేశ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ఫార్మా, పరిశోధన, సాంకేతిక రంగాల్లో తెలంగాణ మరింత వేగంగా ముందుకు వెళ్లాల్సిన అవసరం ఉందని మంత్రి అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా హైదరాబాద్ నగరానికి ఉన్న గ్లోబల్ గుర్తింపును వాడుకుంటూ కొత్త ఆవిష్కరణలకు వేదికగా మార్చాలని కేంద్రం భావిస్తోంది. పరిశోధన రంగంలో నిమగ్నమైన యువతకు అవసరమైన అన్ని రకాల సహాయ సహకారాలను కేంద్ర ప్రభుత్వం అందిస్తుందని ఆయన హామీ ఇచ్చారు. సాంకేతికత ద్వారా సామాన్యుడి జీవితాల్లో మార్పు తీసుకురావాలనేదే మోదీ ప్రభుత్వ లక్ష్యమని, ఇందులో భాగంగానే డిజిటల్ ఇండియా వంటి పథకాలు సత్ఫలితాలను ఇస్తున్నాయని కిషన్ రెడ్డి ఈ సందర్భంగా విశ్లేషించారు. రాజకీయ సంస్కరణల గురించి మాట్లాడుతూ కిషన్ రెడ్డి ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. దేశంలో డీలిమిటేషన్ ప్రక్రియ సకాలంలో జరిగి ఉంటే ఈపాటికే ఒక సరికొత్త రాజకీయ తరం తెరపైకి వచ్చేదని ఆయన అన్నారు.



# ట్రంప్‌కు పుతిన్ వార్నింగ్

**విశాలభారతి, అంతర్జాతీయం:**

ఒకవేళ అమెరికా లేదా ఇజ్రాయెల్ మరోసారి ఇరాన్‌పై సైనిక చర్యకు దిగితే, దాని పర్యవసానాలు ఊహించని విధంగా ఉంటాయని పుతిన్ కుండబద్దలు కొట్టినట్లు సమాచారం. క్రెమ్లిన్ ప్రతినిధి యూరి ఉషాకోవ్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ సంభాషణలో ప్రధానంగా ఇరాన్ భద్రత, ఉక్రెయిన్ సంక్షోభంపై లోతైన చర్చలు జరిగాయి. యుద్ధం కారణంగా ఇప్పటికే అతలాకుతలమైన పశ్చిమాసియాలో శాంతి నెలకొనాలంటే సంయమనం పాటించాలని పుతిన్ సూచించారు. ఇరాన్‌పై దాడులు జరిగితే తాము మౌనంగా ఉండబోమనే సంకేతాలను రష్యా స్పష్టంగా పంపింది. ఈ క్రమంలోనే ఇరాన్ వద్ద ఉన్న అణు నిల్వల అంశం కూడా చర్చకు వచ్చింది. అణు పదార్థాల నిర్వహణలో రష్యా సహాయం తీసుకునేలా పుతిన్ కొన్ని ప్రత్యేక ప్రతిపాదనలను ట్రంప్ ముందు ఉంచినట్లు తెలుస్తోంది. ఈ ఫోన్ కాల్ రష్యా చొరవతోనే జరగడం గమనార్హం. ఉక్రెయిన్‌లో రష్యా సైన్యం సాధిస్తున్న పురోగతిని పుతిన్ ఈ సందర్భంగా వివరించారు. ఐరోపా దేశాల మద్దతుతో జెలెన్‌స్కీ ప్రభుత్వం అనవసరంగా యుద్ధాన్ని పొడిగిస్తోందని ఇద్దరు నేతలు ఒకే అభిప్రాయానికి వచ్చారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో యుద్ధం ఎవరికీ ప్రయోజనం చేకూర్చదని, శాంతి చర్చల ద్వారానే పరిష్కారం సాధ్యమని వారు చర్చించుకున్నారు. ట్రంప్ ఇటీవల ప్రకటించిన కాల్పుల విరమణ పొడిగింపు నిర్ణయాన్ని పుతిన్ మనస్ఫూర్తిగా స్వాగతించారు. ఇది ఉద్రిక్తతలను తగ్గించడానికి ఒక సానుకూల అడుగు అని ఆయన కొనియాడారు. రక్షణ రంగంతో పాటు ఆర్థిక, ఇంధన రంగాల్లో పరస్పర సహకారంపై కూడా ఇరువురు నేతలు దృష్టి సారించారు. ప్రపంచ ఇంధన మార్కెట్లో నెలకొన్న ఒడిదుడుకులను దృష్టిలో ఉంచుకుని, భవిష్యత్తులో వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేసుకోవాలని నిర్ణయించారు. ఉక్రెయిన్ యుద్ధం వల్ల దెబ్బతిన్న అంతర్జాతీయ సరఫరా గొలుసులను పునరుద్ధరించడానికి అమెరికారష్యా మధ్య సయోధ్య అత్యవసరమని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ చర్చలు కేవలం ద్వైపాక్షిక సంబంధాలకే పరిమితం కాకుండా, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై కూడా సానుకూల ప్రభావం చూపే అవకాశం ఉందని ఆశిస్తున్నారు. ఇటీవల అమెరికాలో వైట్ హౌస్ పత్రికా ప్రతినిధుల సమావేశంలో చోటుచేసుకున్న కాల్పుల ఘటనపై పుతిన్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ట్రంప్‌పై జరిగిన దాడి ప్రయత్నాన్ని ఆయన ఖండిస్తూ, అగ్రరాజ్యాధినేతకు తన సంఘీభావాన్ని ప్రకటించారు. ఇలాంటి హింసాత్మక ఘటనలు ప్రజాస్వామ్యానికి ముప్పు అని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. సంక్షోభ సమయాల్లో ఒకరికొకరు అండగా ఉండటం ద్వారానే ప్రపంచంలో శాంతిని కాపాడగలమని పుతిన్ వ్యాఖ్యానించారు. ఈ వ్యక్తిగత ఆత్మీయత ఇద్దరు అగ్రనేతల మధ్య పెరుగుతున్న సాన్నిహిత్యాన్ని ప్రతిబింబిస్తోంది. అమెరికా అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన నాటి నుండి ట్రంప్ ఉక్రెయిన్ యుద్ధాన్ని ముగించడమే తన ప్రథమ ప్రాధాన్యమని చెబుతున్నారు. పుతిన్‌తో సంభాషణలో కూడా ఇదే విషయాన్ని ఆయన పునరుద్ఘాటించారు. తనకు ఇరాన్ విషయంలో సహకరించే ముందు, ఉక్రెయిన్ సంక్షోభానికి ఒక ముగింపు పలకడం అవసరమని ట్రంప్ స్పష్టం చేశారు. యుద్ధం ముగిస్తేనే రష్యాతో ఇతర రంగాల్లో పూర్తిస్థాయిలో సహకరించగలమని ఆయన తెలిపారు. మే నెలలో రష్యా జరుపుకునే విజయ దినోత్సవాల సందర్భంగా తాత్కాలికంగా కాల్పుల విరమణ పాటించాలని పుతిన్ ప్రతిపాదించగా, ట్రంప్ దానికి సానుకూలత వ్యక్తం చేయడం విశేషం. ఇరాన్ వద్ద ఉన్న సుసంపన్న యురేనియం నిల్వలు ఇప్పుడు ప్రపంచానికి పెద్ద సవాలుగా మారాయి. ఈ అణు పదార్థాల నిర్వహణలో రష్యా ఒక 'మూడో పక్షం'గా బాధ్యత తీసుకోవడానికి సిద్ధంగా ఉందని పుతిన్ భరోసా ఇచ్చారు. దీనివల్ల ఇరాన్ అణు సామర్థ్యం దుర్వినియోగం కాకుండా చూడవచ్చని ఆయన ప్రతిపాదించారు. ట్రంప్ ఈ ప్రతిపాదనను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. ఒకవేళ రష్యా మధ్యవర్తిత్వం సఫలమైతే, పశ్చిమాసియాలో దశాబ్దాలుగా నలుగుతున్న అణు వివాదానికి ఒక శాశ్వత పరిష్కారం దొరికే అవకాశం ఉంటుంది. ఇది ప్రపంచవ్యాప్తంగా అణు వ్యాప్తి నిరోధక చర్యలకు పెద్ద ఊపునిస్తుంది. గత ఫిబ్రవరిలో ఇజ్రాయెల్‌అమెరికా సంయుక్తంగా జరిపిన దాడుల వల్ల ఇరాన్ తీవ్రంగా దెబ్బతిన్న విషయం తెలిసిందే. ఆ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ ఖమేనీతో పాటు అనేకమంది కీలక నేతలు ప్రాణాలు కోల్పోయారు. ఫలితంగా గల్ఫ్ ప్రాంతం యుద్ధ భూమిగా మారింది. ఐదు వారాల పాటు సాగిన దాడుల వల్ల ఇరాన్ ఇంధన, పారిశ్రామిక రంగాలు కుప్పకూలాయి. ఆ సమయంలోనే ట్రంప్ రంగ ప్రవేశం చేసి కాల్పుల విరమణను నిరవధికంగా పొడిగించారు. ఇరాన్‌కు తన తప్పులను సరిదిద్దుకోవడానికి, శాంతి చర్చలకు సిద్ధం కావడానికి ఆయన సమయం ఇచ్చారు. అయితే పరిస్థితులు అనుకున్నంత సులభంగా మారడం లేదు. ఇప్పటికే ఇస్లామాబాద్ కేంద్రంగా జరిగిన శాంతి చర్చలు విఫలమవ్వడం అంతర్జాతీయ వర్గాలను నిరాశకు గురిచేసింది. అమెరికా రెండో విడత చర్చలకు ఆహ్వానించినప్పటికీ, ఇరాన్ దానికి ససేమిరా అంది. తమపై ఉన్న ఆంక్షలను పూర్తిగా ఎత్తివేస్తేనే చర్చల మేజా వద్దకు వస్తామని ఇరాన్ కఠిన షరతులు విధిస్తోంది. ఈ నేపథ్యంలో రష్యా చేస్తున్న మధ్యవర్తిత్వ ప్రయత్నాలు ఇప్పుడు కీలకంగా మారాయి. పుతిన్ చెప్పినట్లుగా అణు నిల్వల నిర్వహణ బాధ్యతను రష్యా తీసుకుంటే, ఇరాన్ కూడా కొంత మెత్తబడే అవకాశం ఉందని దౌత్యవేత్తలు అంచనా వేస్తున్నారు. ప్రస్తుత తరం కోరుకుంటున్న వేగవంతమైన దౌత్యం, ఫలితాల దిశగా ట్రంప్ అడుగులు వేస్తున్నారు. రష్యాకు ఉక్రెయిన్ విషయంలో కొంత వెసులుబాటు కల్పించి, బదులుగా ఇరాన్ అణు సమస్యను పరిష్కరించుకోవాలనేది ట్రంప్ వ్యూహంగా కనిపిస్తోంది. ఈ రకమైన 'గివ్ అండ్ టేక్' విధానం వల్ల యుద్ధం నుండి ఉపశమనం లభిస్తుందని ఆయన నమ్ముతున్నారు. అయితే ఈ ప్రతిపాదనలను అమలు చేయడం అంత తేలికైన పని కాదు. ఇరాన్ లోపల ఉన్న రాజకీయ సమీకరణలు, ఇజ్రాయెల్ భద్రతా ప్రయోజనాలు ఈ ఒప్పందానికి పెద్ద అడ్డంకులుగా మారే ప్రమాదం ఉంది. ఏది ఏమైనా, ప్రపంచంలోని ఇద్దరు శక్తివంతమైన నేతలు ఫోన్ లో చర్చలు జరపడం ఒక సానుకూల పరిణామం. యుద్ధం వల్ల పెరిగిన చమురు ధరలు, ప్రపంచవ్యాప్త ద్రవ్యోల్బణం తగ్గాలంటే ఈ ప్రాంతాల్లో శాంతి అత్యవసరం. పుతిన్ ఇచ్చిన హెచ్చరికను ట్రంప్ ఎంతవరకు పరిగణనలోకి తీసుకుంటారో వేచి చూడాలి. మే నెలలో జరగబోయే విజయ దినోత్సవాల నాటికి ఉక్రెయిన్ లో తుపాకులు మూగబోతే, అది ట్రంప్‌పుతిన్ దౌత్యానికి దక్కిన అతిపెద్ద విజయంగా చరిత్రలో నిలిచిపోతుంది. పశ్చిమాసియా భవిష్యత్తు ఇప్పుడు ఈ ఇద్దరు నేతల తదుపరి అడుగులపైనే ఆధారపడి ఉంది.





# కేటీఆర్, హరీశ్ రావు ఫోన్లు హ్యాక్

**విశాలభారతి, స్టేట్ బ్యూరో:**

తెలంగాణ రాజకీయాల్లో ఫోన్ ట్యాపింగ్ వ్యవహారం మరోసారి ప్రకంపనలు సృష్టిస్తోంది. బీఆర్ఎస్ కీలక నేతలు కేటీఆర్, హరీశ్‌రావుల వ్యక్తిగత భద్రత మరియు గోప్యతకు భంగం కలిగించేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.ఎస్.ప్రవీణ్ కుమార్ సంచలన ఆరోపణలు చేశారు. గురువారం హైదరాబాద్‌లోని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో ప్రజాస్వామ్య విలువలని కాలరాస్తున్నారని ధ్వజమెత్తారు. ముఖ్యంగా ప్రతిపక్ష నేతల ఫోన్లను హ్యాక్ చేయడమే కాకుండా, వారి నివాసాల వద్ద ఉన్న సీసీ కెమెరాలను కూడా ప్రభుత్వం తన ఆధీనంలోకి తీసుకుంటోందని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుత ప్రభుత్వం బెంగళూరు నుంచి ప్రైవేటు హ్యాకర్లను రప్పించి మరీ ఈ అక్రమాలకు పాల్పడుతోందని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే సాంకేతికతను దుర్వినియోగం చేస్తున్నారని, దీనిపై తక్షణమే ప్రత్యేక విచారణ బృందంతో (సిట్) దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు. ఐపీఎస్ అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగిపోకూడదని, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇచ్చే రాజ్యాంగ విరుద్ధమైన ఆదేశాలను పాటించవద్దని ఆయన గట్టిగా సూచించారు. గతంలో జరిగిన సంఘటనలను గుర్తు చేస్తూ, చట్టాన్ని అతిక్రమించే అధికారులకు భవిష్యత్తులో చేదు అనుభవాలు తప్పవని ఆయన హెచ్చరించారు. రాష్ట్రంలో రైతాంగం పరిస్థితి అత్యంత దయనీయంగా మారిందని, అన్నదాతలు కన్నీరు పెడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆర్ఎస్పీ విమర్శించారు. ఒకవేళ కేసీఆర్ గనుక ముఖ్యమంత్రిగా ఉండి ఉంటే, రాష్ట్ర ప్రయోజనాల కోసం ఢిల్లీ పాలకుల మెడలు వంచి నిధులు తీసుకువచ్చేవారని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుత పాలనలో అభివృద్ధి కుంటుపడిందని, కేవలం రాజకీయ కక్ష సాధింపు చర్యలకే ప్రాధాన్యత ఇస్తున్నారని దుయ్యబట్టారు. ఫోన్ ట్యాపింగ్ కేసు పేరుతో బీఆర్ఎస్ అగ్రనేతలను ఎలాగైనా ఇరికించాలని ప్రభుత్వం కుట్రలు పన్నుతోందని ఆయన తీవ్రంగా పరిగణించారు. కేసీఆర్, కేటీఆర్, హరీశ్‌రావుల పేర్లను చార్జ్‌షీట్‌లో చేర్చాలని పోలీసు అధికారులపై ముఖ్యమంత్రి కార్యాలయం నుంచి తీవ్రమైన ఒత్తిడి వస్తోందని ఆయన ఆరోపించారు. ఇప్పటికే వందలాది మంది సాక్షులను విచారించినా, ఇప్పటివరకు పక్కా ఆధారాలతో చార్జ్‌షీట్ దాఖలు చేయకపోవడమే ఇందుకు నిదర్శనమని ఆయన విశ్లేషించారు. దర్యాప్తు సంస్థలను అడ్డం పెట్టుకుని ప్రతిపక్షాన్ని నిర్వీర్యం చేయాలని చూడటం సరికాదని హితవు పలికారు. టెక్నికల్ ఎవిడెన్స్ ఆధారంగా కాకుండా, కేవలం బెదిరింపులతో వాంగ్మూలాలు సేకరించడం దారుణమని ఆయన ఈ సందర్భంగా మండిపడ్డారు. ఫోన్ ట్యాపింగ్ అనేది సాధారణంగా దేశ భద్రత కోసం చట్టబద్ధంగా జరిగే ప్రక్రియ అని, ఏ ప్రభుత్వం అధికారంలో ఉన్నా నిబంధనల ప్రకారం అది జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు. అయితే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం దీనిని ఒక రాజకీయ అస్త్రంగా మార్చుకుందని విమర్శించారు. రిటైర్డ్ అధికారి ప్రభాకర్ రావును ఒక కరుడుగట్టిన నేరస్తుడిలా జైల్లో ఉంచి వేధించారని, ఇది అధికారుల మనోస్థైర్యాన్ని దెబ్బతీసే చర్య అని ఆవేదన వ్యక్తం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న పోలీసు యంత్రాంగం వల్ల శాఖకే చెడ్డపేరు వస్తోందని ఆయన వ్యాఖ్యానించారు. మరోవైపు, సంధ్య శ్రీధర్ రావు వంటి వ్యక్తులపై ఉన్న కేసులను అడ్డం పెట్టుకుని, వారి ద్వారా బీఆర్ఎస్ నేతలపై అబద్ధపు సాక్ష్యాలు చెప్పించే ప్రయత్నం జరుగుతోందని ప్రవీణ్ కుమార్ ఆరోపించారు. ఎమ్మెల్సీ నవీన్ రావు పేరును ఈ వ్యవహారంలోకి లాగాలని చూస్తున్నారని, అదేవిధంగా ఒక సీనియర్ జర్నలిస్టును కూడా బెదిరిస్తున్నారని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. హరీశ్‌రావు పేరు చెబితేనే బెయిల్ వచ్చేలా చూస్తామని ఒత్తిడి తెస్తున్నారని, ఇలాంటి అప్రజాస్వామిక చర్యలు గతంలో ఎన్నడూ చూడలేదని ఆయన నిప్పులు చెరిగారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నివాసం గోడలకు నోటీసులు అంటించడం వంటి చర్యలు ఆయనను అవమానపరచడమేనని ఆర్ఎస్పీ అన్నారు. ఫోన్ ట్యాపింగ్ విచారణ అనేది అత్యంత రహస్యంగా జరగాల్సిన ప్రక్రియ అని, కానీ ఇక్కడ ప్రతి విషయాన్ని లీక్ చేస్తూ రాజకీయ లబ్ధి పొందుతున్నారని విమర్శించారు. బాధ్యతాయుతమైన హోంమంత్రి పదవిలో ఉన్న ముఖ్యమంత్రి, తన శాఖను కేవలం ప్రత్యర్థులపై వేధింపులకు వాడుకుంటున్నారని మండిపడ్డారు. పోలీసు విభాగం ఈ రాజకీయ క్రీడలో బలవుతోందని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. అక్రమ కేసులు మోపడం వల్ల కలిగే పరిణామాలను వివరిస్తూ, ఇస్రో శాస్త్రవేత్త నంబీ నారాయణన్ కేసును ఆయన ఉదాహరణగా చూపారు. తప్పుడు ఆరోపణలతో ఒక మేధావి జీవితాన్ని నాశనం చేసినందుకు, ఆనాడు విచారణ చేసిన అధికారులు నేడు కోర్టుల చుట్టూ తిరుగుతున్నారని గుర్తు చేశారు. రేపు ఈ ప్రభుత్వ అధికారులకు కూడా అదే పరిస్థితి ఎదురవుతుందని హెచ్చరించారు. క్రిశాంక్ వంటి యువ నాయకులపై అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపడం ద్వారా గొంతు నొక్కాలని చూస్తున్నారని, కానీ బీఆర్ఎస్ శ్రేణులు దేనికీ భయపడవని స్పష్టం చేశారు. కేటీఆర్, హరీశ్‌రావుల ఇళ్ల వద్ద నిఘా పెట్టడంపై ఆయన తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ప్రైవేటు వ్యక్తులతో సీసీ కెమెరాలను హ్యాక్ చేయించడం అనేది తీవ్రమైన నేరమని, ఇది వ్యక్తిగత స్వేచ్ఛను హరించడమేనని ఆరోపించారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ప్రతిపక్ష నేతల కదలికలను గమనించడం ద్వారా ప్రభుత్వం ఏం సాధించాలనుకుంటోందని ఆయన ప్రశ్నించారు.



రిటైర్డ్ పోలీస్ సిబ్బందితో సైబరాబాద్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్

## యూనిఫాం రెండో చర్మం, సేవే మొదటి ధర్మం సీపీ రమేష్



సమావేశంలో మాట్లాడుతున్న సైబరాబాద్ సిపి రమేష్

**సైబరాబాద్విశాలభారతి:** 'ప్రజల కన్నీరు తుడిచిన ప్రతి పోలీసు పదవీ విరమణ రోజు గర్వపడాలి. యూనిఫాం మనకు రెండో చర్మం లాంటిది' అని సైబరాబాద్ సీపీ డాక్టర్ ఎం. రమేష్ అన్నారు. గురువారం కమిషనరేట్ ఆడిటోరియంలో ఏడుగురు పోలీసు సిబ్బంది పదవీ విరమణ సందర్భంగా వారిని ఘనంగా సన్మానించారు. పెన్షన్ పత్రాలు అందజేసి, పూలమాలలు, శాలువాలతో ఆత్మీయంగా వీడ్కోలు పలికారు. సీపీ మాట్లాడుతూ, విధి నిర్వహణలో పోలీసుల త్యాగాల వెనుక కుటుంబ సభ్యుల సహకారం మరువలేనిదన్నారు. రిటైర్ అయిన తర్వాత ఆరోగ్యంపై దృష్టి పెట్టి రోజూ వ్యాయామం చేయాలని సూచించారు. అనుభవజ్ఞులైన మాజీ అధికారులు అవసరమైనప్పుడు శాఖకు సలహాలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా డీసీపీగా పదోన్నతి పొందిన ఎస్‌బీ ఏడీసీపీ రవికుమార్‌ను సీపీ అభినందించారు. పదవీ విరమణ చేసిన ట్రాఫిక్2 డీసీపీ రంజన్ రతన్ కుమార్ మాట్లాడుతూ, కానిస్టేబుల్ కుమారుడిగా కెరీర్ మొదలుపెట్టి డీసీపీ స్థాయికి చేరడం గర్వంగా ఉందన్నారు. శారీరక శ్రమతో పాటు హ్యూమన్ ఇంటెలిజెన్స్, మేధోపరమైన కృషి శాఖకు కీలకమని తెలిపారు. రిటైర్ అయిన వారు డీసీపీ రంజన్ రతన్ కుమార్, ఎస్ఐ పి. వెంకట్ రెడ్డి, ఏఆర్ ఎస్ఐలు కె. మురళీధర్, ఎన్. కృష్ణ, ఏఎస్ఐ వి. వెంకట సూర్యనారాయణ రాజు, డి. రాములు, బార్బర్ జి. అశోక్. వీరంతా సైబరాబాద్ పరిధిలో సుదీర్ఘ సేవలు అందించారు. కార్యక్రమంలో డీసీపీలు టి. అన్నపూర్ణ, ముత్యం రెడ్డి, వై.వి.ఎస్. సుధీంద్ర, టి. సాయి మనోహర్, సృజన కర్ణం, ఏడీసీపీ రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.

## గాంధీభవన్‌లో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశం

**సంస్థ బలోపేతంపై దిశానిర్దేశం .. గిగ్ వర్కర్ న్యాయ అభియాన్‌లో చురుకైన పాత్రకు పిలుపు**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** గాంధీభవన్ లో తెలంగాణ రాష్ట్ర యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి అధ్యక్షతన రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సమావేశం జరిగింది. రాష్ట్ర సహ ఇంచార్జ్లు రోషిణి జైస్వాల్, భవ్య గార్లతో కలిసి జిల్లాల వారీగా కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించి, రాబోయే కార్యాచరణపై దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా శివచరణ్ రెడ్డి మాట్లాడుతూ.. యూత్ కాంగ్రెస్ ఆధ్వర్యంలో ఇందిరా పార్క్ వద్ద నిర్వహించిన మహాధర్నా విజయాన్ని ప్రస్తావిస్తూ, అది సమిష్టి కృషి ఫలితమని అన్నారు. అదే స్ఫూర్తితో మే నెలాఖరులోగా గ్రామ, మండల, డివిజన్ స్థాయిలో కమిటీలను పూర్తి చేసి యూత్ కాంగ్రెస్‌ను బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. అలాగే ప్రతి ఒక్కరు "With IYC" యాప్‌పై అవగాహన పెంపొందించుకోవాలని సూచించారు. రాహుల్ గాంధీ పిలుపు మేరకు "గిగ్ వర్కర్ న్యాయ అభియాన్" కార్యక్రమంలో చురుకుగా పాల్గొని గిగ్ వర్కర్లను విస్తృతంగా నమోదు చేయాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. చురుకుగా పనిచేసే వారికి భవిష్యత్తులో తగిన అవకాశాలు కల్పిస్తామని హామీ ఇస్తూ, సమావేశానికి ముందు ఇటీవల మరణించిన యూత్ కాంగ్రెస్ కుటుంబ సభ్యులకు నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి గుర్రం శ్యామ్ చరణ్ రెడ్డి, పాలడుగు నాగార్జునతో పాటు వివిధ జిల్లాల అధ్యక్షులు, మండల అధ్యక్షులు తదితరులు పాల్గొన్నారు.

## అంగన్వాడీ టీచర్లకు 49 స్మార్ట్ ఫోన్ల పంపిణీ

- బాలల భద్రతపై అవగాహన, CMRF చెక్కుల పంపిణీ
- కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు
- ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా




**విశాలభారతి, కరకగూడెం:** మండలంలోని రైతు వేదికలో అంగన్వాడీ టీచర్లకు 49 స్మార్ట్ ఫోన్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా చైల్డ్ సేఫ్టీ అండ్ ప్రొటెక్షన్, స్టే అవే ఫ్రమ్ డ్రగ్స్, సైబర్ నేరాలపై జాగ్రత్తలు, టీనేజ్ ప్రెగ్నెన్సీలు మరియు ఎలొప్మెంట్ కేసుల నివారణ వంటి కీలక అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించి అంగన్వాడీ సిబ్బందికి మార్గదర్శకాలు అందించారు. అలాగే ఈ కార్యక్రమంలో 9 మంది లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలు గ్రామ స్థాయిలో బాలల అభివృద్ధికి పునాది వంటివని తెలిపారు. చిన్నారుల శారీరక, మానసిక వికాసం మాత్రమే కాకుండా, వారి భద్రత మరియు సంరక్షణలో అంగన్వాడీ టీచర్ల పాత్ర అత్యంత కీలకమని అన్నారు. ప్రభుత్వం అందిస్తున్న స్మార్ట్ ఫోన్ల ద్వారా పిల్లల వివరాలను సమయానికి నమోదు చేయడం, పోషకాహార పర్యవేక్షణ, గర్భిణీ స్త్రీల ఆరోగ్య సమాచారాన్ని ట్రాక్ చేయడం వంటి సేవలు మరింత సమర్థవంతంగా అందించవచ్చని పేర్కొన్నారు. యువతలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగం సమాజానికి పెద్ద ముప్పుగా మారుతోందని, దీనిని అరికట్టేందుకు గ్రామ స్థాయిలోనే అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సైబర్ నేరాల నుండి పిల్లలను రక్షించేందుకు తల్లిదండ్రులకు, విద్యార్థులకు సరైన మార్గనిర్దేశం చేయాలని కోరారు. టీనేజ్ ప్రెగ్నెన్సీలు మరియు ఎలొప్మెంట్ కేసులు సమాజంలో ఆందోళనకర విషయాలని, వాటి నివారణకు సమష్టి కృషి అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఎమ్మార్వో వట్టం కాంతయ్య, ఎంపీడీవో డి.వి. కుమార్, ఐసీడీఎస్ సూపర్వైజర్ స్ఫూర్తి, ఆర్ఐ, జిపిఓ, జిపి సెక్రటరీ, మండల అధ్యక్షులు ఇక్బాల్ హుస్సేన్, సర్పంచులు, ఉపసర్పంచులు, వార్డు సభ్యులు, ఎర్ర సురేష్, తొలెం నాగేశ్వరావు, రాందాస్ నాయక్, కృష్ణ, మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## పదిలో అద్భుత ప్రతిభ కనబరిచిన ఎక్సలెంట్ విద్యార్థులు

- కష్టపడి చదివే విద్యార్థులే భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహిస్తారు
- ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు

**మణుగూరు, విశాలభారతి :** పదవ తరగతి 2026 పరీక్ష ఫలితాలలో విశిష్ట ప్రతిభ కనబరిచి అత్యధిక మార్కులు సాధించిన ఎక్సలెంట్ గ్రూప్ ఆఫ్ స్కూల్ విద్యార్థులను గురువారం నాడు స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు విద్యార్థులను ఘనంగా అభినందించి, వారి భవిష్యత్తు విద్యాభ్యాసానికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి చదివే విద్యార్థులే భవిష్యత్తులో ఉన్నత స్థానాలను అధిరోహిస్తారని అన్నారు. పట్టుదల, క్రమశిక్షణ మరియు లక్ష్యసాధన పట్ల నిబద్ధత ఉంటే విజయాన్ని సాధించడం సులభమని పేర్కొన్నారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అందిస్తున్న మార్గనిర్దేశం విద్యార్థుల విజయానికి బలమైన పునాదిగా నిలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎక్సలెంట్ గ్రూప్ ఆఫ్ స్కూల్ చైర్మన్ & ఎండి యూసఫ్ షరీఫ్, కరస్పాండెంట్ మహమ్మద్ ఖాదర్, డైరెక్టర్ జానీ మియా ఖాన్ యాకూబ్ షరీఫ్, అశ్వాపురం ప్రిన్సిపాల్ లెనిన్ విజయ్ కుమార్, బయ్యారం ప్రిన్సిపాల్ సురేష్, నరేందర్ మరియు విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు. విద్యార్థుల విజయంతో పాఠశాలకు, తల్లిదండ్రులకు మరియు ఉపాధ్యాయులకు గర్వకారణమని ఆయన అభినందనలు తెలియజేశారు.



# పత్రికా స్వేచ్ఛలో దిగజారి పోయాం

**మొదటిపేజీ తరువాయి**

ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి. రిపోర్ట్స్ సాన్స్ ఫ్రాంటియర్స్ సంస్థ విడుదల చేసిన ఈ నివేదిక కేవలం భారతదేశానికే పరిమితం కాలేదు. ప్రపంచ వ్యాప్తంగా గత పాతికేళ్లలో ఎన్నడూ లేనంతగా పత్రికా స్వేచ్ఛ సగటు స్కోరు భారీగా తగ్గిపోయింది. ఈ సూచీ చరిత్రలోనే మొదటిసారిగా ప్రపంచంలోని సగానికి పైగా దేశాలు పత్రికా రంగంలో అత్యంత క్లిష్టమైన లేదా తీవ్రమైన పరిస్థితులను ఎదుర్కొంటున్నాయని ఈ సంస్థ పేర్కొన్నది. అనేక దేశాల్లో ప్రభుత్వాలు సమాచారాన్ని నియంత్రించడానికి ప్రయత్నిస్తున్నాయని, ఇది అంతర్జాతీయంగా పౌర హక్కులకు భంగం కలిగిస్తోందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు వార్త అంటే నమ్మకం, కానీ నేడు అది ప్రచార సాధనంగా మారిపోయింది. ప్రపంచ వ్యాప్తంగా పత్రికా స్వేచ్ఛను గౌరవిస్తున్న దేశాల్లో నార్వే, నెదర్లాండ్స్, ఎస్టోనియా, డెన్మార్క్ , స్వీడన్ దేశాలు తొలి ఐదు స్థానాల్లో నిలిచాయి. ఈ దేశాల్లో జర్నలిస్టులకు పూర్తి భద్రత ఉండటమే కాకుండా, పారదర్శకమైన పాలన కొనసాగుతోంది. మరోవైపు సౌదీ అరేబియా, ఇరాన్, చైనా, ఉత్తర కొరియా వంటి దేశాలు జాబితాలో చివరి వరుసలో ఉండటం వారి నియంతృత్వ ధోరణిని సూచిస్తోంది. భారతదేశం వంటి అభివృద్ధి చెందుతున్న దేశం, ఇలాంటి నియంతృత్వ దేశాల సరసన చేరడానికి సిద్ధమవుతోందా అనే అనుమానం కలగడం సహజం. స్వేచ్ఛాయుత వాతావరణం లేని చోట నిజాలు సమాధి అవుతాయనడంలో సందేహం లేదు. అనేక ప్రాంతాల్లో స్వల్ప మార్పులు ఉన్నప్పటికీ, వందకు పైగా దేశాల స్కోర్లు గణనీయంగా తగ్గిపోవడం గర్హనీయం. కేవలం ఆసియా ఖండంలోనే కాకుండా అమెరికా ఖండాల్లో కూడా పరిస్థితులు దారుణంగా ఉన్నాయని నివేదిక వెల్లడించింది. స్వయంగా అమెరికా తన ర్యాంకులో



ఏడు పాయింట్లు కోల్పోవడం ప్రపంచానికి పెద్ద షాక్ అని చెప్పాలి. లాటిన్ అమెరికా దేశాల్లో జర్నలిస్టులపై హింస పెరిగిపోవడం, అణచివేత చర్యలు నిత్యకృత్యం కావడం వంటి అంశాలు కలవరపెడుతున్నాయి. అగ్ర రాజ్యాలే ఈ దారిలో నడుస్తుంటే, ఇక వర్ధమాన దేశాల పరిస్థితి వర్ణనాతీతంగా మారుతోంది. ఇది కేవలం మీడియా సమస్య కాదు, మొత్తం మానవ సమాజానికి పొంచి ఉన్న ప్రమాదం. భారతదేశంలో పత్రికా రంగం పతనం కావడానికి రాజకీయ కారణాలు ప్రధానంగా కనిపిస్తున్నాయి. ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న తీరు, మీడియా సంస్థలను తన గుప్పెట్లో ఉంచుకోవాలనే తపన వల్ల పత్రికలు స్వతంత్రంగా వ్యవహరించలేకపోతున్నాయి. ప్రభుత్వ వైఫల్యాలను ఎత్తిచూపే ధైర్యం చేసే జర్నలిస్టులపై అక్రమ కేసులు బనాయించడం, వేధింపులకు గురిచేయడం వంటివి పరిపాటిగా మారాయి. సోషల్ మీడియాలో సైతం స్వేచ్ఛను హరించేలా కొత్త నిబంధనలు తీసుకురావడం వల్ల సామాన్యుల గొంతు కూడా నొక్కుతున్నారు. పాలకుల మెప్పు కోసం పాకులాడే మీడియా వల్ల ప్రజలు తప్పుడు సమాచారాన్ని నిజమని నమ్మే ప్రమాదం పొంచి ఉంది. మీడియా యాజమాన్యం మొత్తం కొద్దిమంది వ్యాపారవేత్తల చేతుల్లో కేంద్రీకృతమై ఉండటం ఈ పరిస్థితికి మరో ప్రధాన కారణం. పెద్ద కార్పొరేట్ సంస్థలు మీడియాను కొనుగోలు చేసి, తమ వ్యాపార ప్రయోజనాల కోసం రాజకీయ పక్షాలతో చేతులు కలుపుతున్నాయి. దీనివల్ల మీడియా సంస్థలు ప్రజా పక్షం వహించాల్సింది పోయి, రాజకీయ పార్టీల అనుబంధ సంస్థల్లా మారిపోతున్నాయి. ఒక వార్త ప్రాముఖ్యతను బట్టి కాకుండా, అది ఏ పార్టీకి మేలు చేస్తుందో చూసి ప్రసారం చేసే స్థాయికి మీడియా దిగజారిపోయింది. ఇలాంటి కేంద్రీకృత వ్యవస్థలో స్వతంత్ర పాత్రికేయానికి తావు లేకుండా పోతోంది. ఇది ప్రజాస్వామ్య మూలాలకే గొడ్డలిపెట్టు. రిపోర్టర్స్ విత్‌ఔట్ బోర్డర్స్ నివేదిక ప్రకారం భారతదేశంలో జర్నలిస్టులపై దాడులు గణనీయంగా పెరిగాయి. క్షేత్రస్థాయిలో పనిచేసే విలేకరులకు భద్రత కరువైంది. అవినీతిని వెలికితీసే ప్రయత్నం చేసే వారిని భయభ్రాంతులకు గురిచేయడం లేదా భౌతిక దాడులకు పాల్పడటం సర్వసాధారణమైపోయింది. పోలీసు వ్యవస్థను కూడా ప్రభుత్వాలు తమకు అనుకూలంగా వాడుకుంటూ, నిజాయితీ గల పాత్రికేయులను జైలు పాలు చేస్తున్నాయి. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో పనిచేయడం జర్నలిస్టులకు కత్తి మీద సాములా మారింది. స్వేచ్ఛ లేని పత్రికా రంగం ప్రాణం లేని శరీరం వంటిదని మనం గుర్తించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రస్తుత తరానికి సమాచారం ఎంతో వేగంగా అందుతోంది కానీ, అందులో ఎంత నిజం ఉందో తెలియని గందరగోళం నెలకొంది. గతంలో వార్తా పత్రికలలో వచ్చే వార్తలకు ఒక విలువ ఉండేది, ఒక బాధ్యత ఉండేది. కానీ నేడు రేటింగ్స్ కోసం, క్లిక్కుల కోసం వాస్తవాలను వక్రీకరించడం అలవాటైపోయింది. ఒక వర్గం మీడియా కేవలం ఒక అజెండాను మాత్రమే ప్రజలపై రుద్దుతోంది. దీనివల్ల సమాజంలో విద్వేషాలు పెరగడమే కాకుండా, అసలైన సమస్యలు పక్కదారి పడుతున్నాయి. నిరుద్యోగం, ద్రవ్యోల్బణం వంటి ప్రజల ప్రాథమిక సమస్యల కంటే అనవసరమైన అంశాలే చర్చల్లో ప్రాధాన్యత సంతరించుకుంటున్నాయి. నివేదికలోని లెక్కలు చూస్తుంటే భారతదేశం తన ప్రజాస్వామ్య స్ఫూర్తిని కోల్పోతోందా అనే భయం కలుగుతోంది. ప్రపంచ స్థాయి వేదికలపై భారత్ ఒక శక్తివంతమైన దేశంగా కనిపిస్తున్నా, పత్రికా స్వేచ్ఛ విషయంలో 157వ స్థానంలో ఉండటం గర్వించదగ్గ విషయం కాదు. ప్రజాస్వామ్యం పరిఢవిల్లాలంటే పత్రికలకు పూర్తి స్వేచ్ఛ ఉండాలి. పాలకులు చేసే తప్పులను ఎండగట్టే దమ్ము మీడియాకు ఉండాలి. కానీ ప్రస్తుత పరిస్థితులు చూస్తుంటే మీడియా స్వయం విమర్శ చేసుకోవాల్సిన సమయం ఆసన్నమైందని అనిపిస్తోంది. కేవలం అధికార పక్షాన్ని సమర్థించడమే మీడియా పని కాదు, ప్రజలకు జవాబుదారీగా ఉండటమే దాని పరమార్థం.

## అక్రమ వసూళ్లకు కేంద్రంగా మారిన ఓపెన్ ఇంటర్ పరీక్ష ప్రాక్టికల్స్ సెంటర్

- పరీక్ష సెంటర్‌లో ఓపెన్ ఇంటర్ ప్రాక్టికల్స్ పేరుతో అక్రమ వసూళ్లు – విద్యార్థులపై దౌర్జన్యం
- పరీక్ష సెంటర్‌లో విద్యార్థుల నుంచి రూ.200–300 వరకు వసూలు
- పరీక్ష సెంటర్‌లో "డబ్బు ఇస్తేనే చూపిస్తాం" అంటూ యూనిజిలేటర్ల బెదిరింపులు
- పరీక్ష సెంటర్‌లో పేద విద్యార్థులపై అదనపు భారం
- ఆటో ఛార్జీలకే తెచ్చిన డబ్బులు కూడా వసూలు
- పరీక్ష సెంటర్‌లో ఒక్క రోజులోనే వేలల్లో అక్రమ వసూళ్లు — యాజమాన్యంపై ఆరోపణలు
- పరీక్ష సెంటర్‌లో ఘటనపై తక్షణ చర్యలు తీసుకోవాలని విద్యార్థులు డిమాండ్




**మహబూబాబాద్ జిల్లా విశాలభారతి:**

విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దాల్సిన పరీక్షా కేంద్రం... ఇప్పుడు అక్రమ వసూళ్లకు అడ్డాగా మారిందనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని అనంతారం మోడల్ స్కూల్‌లో నిర్వహిస్తున్న ఓపెన్ ఇంటర్ ప్రాక్టికల్ పరీక్షల సందర్భంగా విద్యార్థుల వద్ద నుంచి బలవంతపు డబ్బు వసూలు చేస్తున్నట్టు తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి.

**నుంచి 300 రూపాయల వసూళ్లు – బెదిరింపుల మధ్య విద్యార్థులు.**

ప్రాక్టికల్ పరీక్షలు రాస్తున్న ప్రతి విద్యార్థి వద్ద నుంచి రూ.200 నుంచి రూ.300 వరకు డబ్బు వసూలు చేస్తున్నారని బాధితులు చెబుతున్నారు. "డబ్బు ఇస్తేనే ప్రాక్టికల్ పరీక్ష చూపిస్తాం, లేదంటే పరీక్షలో సహకారం ఉండదు" అంటూ యూనిజిలేటర్లు, సిబ్బంది విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేస్తున్నారని ఆరోపిస్తున్నారు.

**నిరుపేదలపై అదనపు భారం**

పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఆటో ఛార్జీలు కూడా కష్టంగా సమకూర్చుకుని పరీక్షలకు వస్తుండగా, ఇలాంటి అక్రమ వసూళ్లు వారి మీద మరింత భారంగా మారాయి. తినడానికి కూడా సరిపోని పరిస్థితుల్లో ఉన్న విద్యార్థుల వద్ద నుంచి డబ్బులు తీసుకోవడం ఎంతవరకు సమంజసం అని తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు.

**ఒక రోజుకే వేలల్లో వసూళ్లు**

ఒక్కో సెంటర్‌లో 70 నుంచి 80 మంది విద్యార్థులు పరీక్షలు రాస్తుండటంతో, ఒక్క రోజులోనే సుమారు రూ.15,000 నుంచి రూ.20,000 వరకు అక్రమంగా వసూలవుతున్నట్టు అంచనా. ఇదే పరిస్థితి కొనసాగితే మొత్తం పరీక్షల వ్యవధిలో భారీ మొత్తాలు వసూలు చేసే ప్రమాదం ఉందని విద్యార్థులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**ప్రత్యేక గదిలో వసూళ్లు – ఉపాధ్యాయులపై ఆరోపణలు**

అదే పాఠశాలకు చెందిన కొంతమంది ఉపాధ్యాయులు ప్రత్యేక గదిలోకి విద్యార్థులను పిలిచి డబ్బులు వసూలు చేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. "అందరూ ఇస్తేనే అందరికీ చూపిస్తాం" అంటూ ఒత్తిడి తెస్తున్నారని విద్యార్థులు చెబుతున్నారు.

**విద్యాశాఖ ఎక్కడ? – చర్యల కోసం డిమాండ్**

ఈ ఘటనపై జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే స్పందించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థులు, తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. అక్రమ వసూళ్లకు పాల్పడుతున్న వారిని సస్పెండ్ చేసి, విద్యార్థులకు న్యాయం చేయాలని కోరుతున్నారు.

**విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలు ఆపాలి**

పరీక్షలు నిష్పక్షపాతంగా నిర్వహించాల్సిన బాధ్యత ఉన్న సిబ్బంది ఇలాంటి చర్యలకు పాల్పడటం తీవ్ర ఆందోళనకు గురిచేస్తోంది. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడే ఇలాంటి ఘటనలపై ప్రభుత్వం, విద్యాశాఖ కఠినంగా స్పందించాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

## మద్యం ప్రియులకు సిండికేట్ షాక్

- 8:30 కి వైన్ షాప్ లు బంద్ 24/7 బెల్ట్ షాపులు ఫుల్
- పట్టించుకోని సంబంధిత శాఖ అధికారులు
- ఎమ్మార్పీ రేట్ల కంటే అధిక ధరలకు బెల్ట్ షాప్ నిర్వాహకులు
- మద్యం ప్రియుల జేబులు చిల్లు
- నిబంధనలు పాటించని వైన్ షాప్ నిర్వాహకులు
- చర్యలు తీసుకోవాలని మద్యం ప్రియుల డిమాండ్



**విశాలభారతి, కారకగూడెం :** మద్యం ప్రియులకు సిండికేట్ షాక్ ఇస్తుంది. ప్రభుత్వ నియమా నిబంధనల ప్రకారం ఉదయం 10:00 నుండి రాత్రి 10 గంటల వరకు తెరచి ఉంచాల్సిన వైన్ షాపులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఏజెన్సీ ఏరియా రావడంతో 8:30 నుంచి 9 గంటలకి చేయిస్తున్నారు. దీంతో మందు బాబులకు మందు దొరకాలంటే బెల్టు షాపులపై ఆధారపడాల్సిన పరిస్థితి ఏర్పడుతుంది బెల్ట్ షాపు నిర్వాహకులు ఎంఆర్పి జర కంటే ఎంఆర్పి ధర కంటే 20 నుంచి 30 రూపాయలు బ్రాండ్ ను బట్టి మద్యం ప్రియుల వద్ద వసూలు చేస్తూ వైన్ షాప్ నిర్వాహకులు బెల్ట్ షాప్ నిర్వాహకులకు పరోక్షంగా లాభం చేకూరుస్తున్నారని మందుబాబులు వాపోతున్నారు.

**పట్టించుకోని అధికారులు వెనుక అసలు లెక్క**

కరకగూడెం, పినపాక లాంటి ఏజెన్సీ మండలాల్లో బెల్ట్ షాపుల సమస్య జటిలంగా ఉండటానికి 5 కారణాల కన్నా ఎక్కువే ఉన్నాయి.

**1. "మామూళ్ల" సిస్టమ్ ఎలా నడుస్తుంది?**

**నెలవారీ సెటిల్మెంట్:** ఒక్కో బెల్ట్ షాప్ నుండి ఎక్సైజ్, పోలీస్, లోకల్ లీడర్‌కి నెలకి ₹5వేల నుండి ₹20వేల దాకా వెళ్తుంది అనే టాక్.

**రైడ్ ఇన్ఫర్మేషన్ లీక్:** పై నుండి రైడ్ ఆర్డర్ వస్తే కింద స్థాయి సిబ్బంది ముందే ఫోన్ చేసి చెప్తారు. అందుకే రైడ్ చేసినా షాపులు ఖాళీగా ఉంటాయి.

**కేసు వీక్ చేయడం:** పట్టుకున్నా సీజ్ చేసిన మందు లెక్క తక్కువ చూపించడం, పంచనామా సరిగ్గా రాయకపోవడం చేస్తే కోర్టులో కేసు నిలబడదు.

**2. వైన్ షాప్ ఓనర్ + బెల్ట్ షాప్ లింక్**

వైన్ షాప్ లైసెన్స్ తీసుకునేవాడు కోట్లలో పెట్టుబడి పెడతాడు. 2 ఏళ్ల లైసెన్స్ పీరియడ్‌లో ఆ డబ్బు వెనక్కి రావాలంటే కేవలం షాప్ అమ్మకాలు సరిపోవు.

**సొల్యూషన్:** మండలంలో 3040 బెల్ట్ షాపులు పెట్టించి వాటికి సప్లై చేస్తాడు

**లాభం:** వైన్ షాప్‌లో Quarter MRP ₹160 అయితే, బెల్ట్ షాప్‌కి ₹170కి ఇచ్చి వాడు ₹200కి అమ్ముకుంటాడు. ఇద్దరికీ లాభం.

**రిస్క్ కవర్:** ఎక్సైజ్ వాళ్లకి నెలవారీ ఇవ్వడం వల్ల కేసు అయినా "మేనేజ్" అయిపోతుంది.

**3. 8:30కే బంద్ చేయించడం వెనుక లాజిక్**

భద్రాద్రి ఏజెన్సీలో 8:30 తర్వాత వైన్ షాప్ తీసి ఉంచితే గొడవలు, యాక్సిడెంట్లు ఎక్కువ అని రిపోర్ట్. అందుకే SP/కలెక్టర్ ఆర్డర్ తో ముందే మూసేయిస్తారు.

**కానీ దీని సైడ్ ఎఫెక్ట్:** బెల్ట్ షాపులకు డిమాండ్ 3 రెట్లు పెరిగింది. 8:30 తర్వాత మందు కావాలంటే రేటు ఎంతైనా ఇచ్చి కొనేస్తారు.

**4. ఎందుకు ప్రూఫ్ దొరకదు?**

**బిల్లులు ఉండవు:** బెల్ట్ షాప్‌లో క్యాష్ మాత్రమే. UPI కూడా పెట్టరు

**స్టాక్ దాయడం:** మందు బాటిళ్లు బియ్యం బస్తాల్లో, గడ్డివాములో దాస్తారు

**మొబైల్ షాపులు:** కొందరు బైక్ మీద, ఆటోలో తిరుగుతూ అమ్ముతారు. అడ్రస్ ఫిక్స్‌డ్ ఉండదు

**బినామీ పేర్లు:** షాప్ నడిపేది ఒకడు, దొరికేది పనోడు. అసలు ఓనర్ పేరు బయటికి రాదు

## చీమలపాడు,ఆర్ కొత్తగూడెం ఇసుకరాపు సమస్యల్ని పరిష్కరించాలి

- పాత కమిటీకి హైకోర్టు ఇచ్చిన హోర్డర్‌ని రద్దు చేయాలి
- నూతనంగా ఎన్నుకున్న కమిటీలకు అనుమతి ఇవ్వాలి
- కలెక్టర్ ఆఫీస్ ఎదుట కొత్త సొసైటీ సభ్యుల ధర్నా
- సీపీ ఐ ఎం ఎల్ మాస్ లైన్ పార్టీ రాష్ట్ర సెక్రటేరియట్ సభ్యులు కేట్టెల రంగారెడ్డి

**చర్ల, విశాలభారతి:**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలం చీమలపాడు ఆరు కొత్తగూడెం ఇసుక సొసైటీ కమిటీలు సమయం ముగ్గేయడంతో మహాజనసభల ద్వారా నూతన కమిటీ ఎన్నిక ఉన్నప్పుడు ఎన్ని కే అధికారుల సమక్షంలో జరిగినప్పటికీ ఉన్నత అధికారులు ఈ రాంపుల విషయంలో కాలయాపన చేస్తూ సొసైటీ సభ్యుల మధ్య గొడవలకు కారణమయ్యారని ఆయన




విమర్శించారు. ఈ కాలయాపన ఆధారం చేసుకుని పాత కంపెనీ వారు కోర్టుని తప్పు దోవ పట్టించి ఇసుక ఆన్లైన్ పెట్టే కోర్టు ద్వారా ఆర్డర్ ని తెచ్చుకున్నారని ఆయన అన్నారు. ఇది ఇసుక నిబంధనలకు పిశాచటానికి విరుద్ధమైన విషం అని ఆరోపించారు. వాస్తవానికి ఈ సమస్య అధికారులు సకాలంలో స్పందించి ఉంటే ఇంతకాలం ఆగాల్సిన అవసరం లేదని ఆయన పేర్కొన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు అక్రమార్కులతో జోడి కాకుండా వారి బాధ్యతలను వారు నెరవేస్తూ సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనియెడల ఆ తర్వాత జరిగే పరిణామాలకు అధికారులే బాధ్యత వహించాల్సి వస్తుందని హెచ్చరించారు ఇప్పటికే ఆరు కొత్తగూడెం లాంటి ఇసుక సొసైటీలో ఇరు వర్గాలు కొట్టుకొని చేతులు పగలగొట్టుకొని ఉన్నారని ఆయన గుర్తు చేశారు. ఇలాంటి పరిణామాలు ఎక్కడ జరగకుండా చూడాలని అందుకు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ పార్టీ భద్రాద్రి, కొత్తగూడెం జిల్లా కార్యదర్శి ముద్దా బిక్షం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సెక్రటేరియట్ సభ్యులు జాటోత్ కృష్ణ, కల్లూరు కిషోర్, వెంకటేశ్వర్లు, సాయన్న, మునిగేలా శివ ప్రశాంత్, చర్ల మండలం పార్టీ మండల కార్యదర్శి పాలెం చుక్కయ్య, శ్రీ సిర్రాజు సొసైటీ అధ్యక్షురాలు ఇర్పా సామ్రాజ్యం, ఆర కొత్తగూడెం సొసైటీ అధ్యక్షురాలు అశ్విని, సుజాత, నాగమణి, నాగలక్ష్మి ,స్వప్న, పార్వతి, శాంతకుమారి,సరిత ,సత్యవతి, చిట్టెమ్మ, సమ్మక్క, తదితరులు పాల్గొన్నారు.

## రామగుండం నగరానికి మంచి ఫీడ్ బ్యాక్ ఇవ్వాలి

**మేయర్ మహంకాళి స్వామి**



**విశాలభారతి, గోదావరిఖని:** స్వచ్ఛ సర్వేక్షణ్ లో రామగుండం నగరానికి మంచి ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని మేయర్ మహంకాళి స్వామి కోరారు. వార్డు సందర్శనలో భాగంగా గురువారం 49 వ డివిజన్ మార్కండేయ కాలనీలో డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య, స్థానిక కార్పొరేటర్ సాగి సంతోష్ రావు తో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎం ఎల్ ఏ సూచనల మేరకు రామగుండం నగరాన్ని అందంగా తీర్చిదిద్దడంలో భాగంగా స్వచ్ఛతపై దృష్టి సారించి కాలువల్లో పూడికతీత పనులు చేపట్టడంతో పాటు బహిరంగ ప్రదేశాల్లో చెత్త వేయకుండా ఇంటింటా అవగాహన కల్పిస్తున్నామని అన్నారు. వర్షా కాలంలో వరద ప్రభావానికి గురైన గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఈ దఫా ముందుగానే కాలువ పూడికతీత పనులు చేపట్టడం జరిగిందని అన్నారు. ఈ కాలువ పూడిక తీత పనులకు నగర పాలక సంస్థపై అదనపు భారం పడకుండా మునిసిపల్ వాహనాలను, మునిసిపల్ సిబ్బంది సేవలనే ఉపయోగించుకుంటున్నట్లు తెలిపారు. శానిటేషన్ లో మార్పు కనిపిస్తున్నందున స్వచ్ఛ సర్వేక్షణ్ లో రామగుండం నగరం ఉత్తమ ర్యాంక్ సాధించేందుకు మంచి ఫీడ్ బ్యాక్ ఇవ్వాలని కోరారు. డిప్యూటీ మేయర్ పాతపెల్లి ఎల్లయ్య మాట్లాడుతూ వర్షాకాలంలో అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవడంలో భాగంగా ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక చేపట్టి స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ చేపట్టడం అభినందనీయమని అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆదేశాల మేరకు , ఎం ఎల్ ఏ రాజ్ ఠాకూర్ సూచనలతో గత నెల రోజులుగా పలు డివిజన్లలో మేయర్ మహంకాళి స్వామి నేతృత్వంలో కాలువ పూడిక తీత కార్యక్రమం విజయవంతంగా కొనసాగుతున్నదని అన్నారు. ఈ కార్యక్రమంలో పలువురు కార్పొరేటర్లతో పాటు నగర పాలక సంస్థ ఎస్ ఇ గురువీర, ఇ ఇ పివి రామన్, డి ఇ. ఆఫ్తాబ్, ఎ ఇ మీర్, టి పి ఎస్ నవీన్, సూపరింటెండెంట్ పబ్బాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మేడే సందర్భంగా శ్రమశక్తి అవార్డుకు చిలుకు స్వామి ఎంపిక



**ఆలేరు, విశాలభారతి:** ఆలేరు మండలం షారాజీపేట గ్రామానికి చెందిన చిలుకు స్వామి శ్రమశక్తి అవార్డుకు ఎంపికయ్యారు. గత 14 సంవత్సరాలుగా రైల్వే ఇంజనీరింగ్ విభాగంలో పనిచేస్తూ విశేష సేవలు అందిస్తున్నారు. అదేవిధంగా సికింద్రాబాద్ డివిజనల్ అసిస్టెంట్ సెక్రటరీగా 42 వేల మంది కార్మికులకు సేవలందిస్తూ కార్మిక సంక్షేమానికి కృషి చేస్తున్నారు. కార్మికుల దినోత్సవం మేడే సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి, రాష్ట్ర మంత్రి గడ్డం వివేక్ చేతుల మీదుగా ఆయన ఈ ప్రతిష్టాత్మక శ్రమశక్తి అవార్డును అందుకోనున్నారు. ఈ సందర్భంగా చిలుకు స్వామిని షారాజీపేట గ్రామానికి చెందిన ప్రముఖులు కంతి మహేందర్, రచ్చ రామ నరసయ్య, మోరిగాడి అశోక్, సిరమైన వెంకటేష్ యాదవ్ తదితరులు అభినందించారు.

## ఇందిరమ్మ ఇండ్ల సమీక్షలో పాల్గొన్న ఎంపీ గడ్డం వంశీకృష్ణ




**విశాలభారతి, పెద్దపల్లి:** హైదరాబాద్‌లోని తెలంగాణ రాష్ట్ర హౌసింగ్ కార్పొరేషన్ కార్యాలయం, హిమాయత్ నగర్‌లో నిర్వహించిన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల పురోగతి పై సమీక్ష సమావేశంలో పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పాల్గొన్నారు. ఈ సమావేశానికి రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అధ్యక్షత వహించారు.సమీక్షలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనుల వేగవంతం, అర్హులైన లబ్ధిదారులకు త్వరితగతిన మంజూరు, భూమి సమస్యలు, పరిపాలనా ఆటంకాలు, ఫీల్డ్ స్థాయి అమలు తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. పనులు ఆలస్యం కాకుండా అధికారులు సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. సమావేశంలో రాష్ట్ర మంత్రులు జూపల్లి కృష్ణారావు, అడ్లూరి లక్ష్మణ్ కుమార్, దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎమ్మెల్యే మకాన్ సింగ్ రాజ్ ఠాగూర్, ఎమ్మెల్యే విప్ విజయ రమణారావు, ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం, రెవెన్యూ శాఖ స్పెషల్ సెక్రటరీ లోకేష్ కుమార్, హౌసింగ్ కార్పొరేషన్ ఎండీ వీపీ గౌతమ్ మరియు ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎంపీ గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ, ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో అర్హులైన ప్రతి కుటుంబానికి ఇందిరమ్మ ఇల్లు అందేలా సమగ్ర కార్యాచరణ అవసరమని సూచించారు. అధికారులు ఫీల్డ్ స్థాయిలో పర్యవేక్షణ బలోపేతం చేసి, పనులు వేగవంతంగా పూర్తి చేయాలని కోరారు.

## 100శాతం ఉత్తీర్ణతతో అమ్మనబోలు విద్యార్థుల విజయం



వల్లాల మహేశ్వరి 559/600.
స్కూల్ 1st. మోటకొండూర్
మండలం 2nd టాపర్



బక్క సమీర.
524/600
స్కూల్ 2nd టాపర్



సింగనబోయిన స్వప్న.
515/600
స్కూల్ 3rd టాపర్

**మోటకొండూర్,విశాలభారతి:** మోటకొండూరు మండలం అమ్మనబోలు ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ఈరోజు ప్రకటించిన పదవ తరగతి వార్షిక ఫలితాల్లో 100 శాతం ఉత్తీర్ణత సాధించి జయకేతనం ఎగురవేశారు. పాఠశాల ప్రథమ స్థానంలో వల్లాల మహేశ్వరి 559 మార్కులతో నిలిచి, మండల స్థాయిలో ద్వితీయ స్థానం సాధించింది. బక్క సమీరా 524 మార్కులతో అమ్మనబోలు ద్వితీయ స్థానం, సింగనబోయిన స్వప్న 515 మార్కులతో తృతీయ స్థానం పొందారు. ముఖ్యంగా విద్యార్థులందరూ సైన్స్ సబ్జెక్టులో A1 గ్రేడ్ సాధించడం విశేషం. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు శ్రీమతి శైలాజ రాణి విద్యార్థులకు అభినందనలు తెలియజేస్తూ, ప్రైవేట్ పాఠశాలలు, హాస్టళ్లకు కాకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించి వారి భవిష్యత్తును ఉన్నతంగా తీర్చిదిద్దాలని గ్రామస్థులకు విజ్ఞప్తి చేశారు. అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల శ్రమ, విద్యార్థుల కృషి ఫలితంగా ఈ విజయాలు సాధ్యమయ్యాయని ఎంపీసీ చైర్పర్సన్ భార్గవి తెలిపారు. అధిక ఫీజులు వసూలు చేసే ప్రైవేట్ పాఠశాలల కంటే ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించడంతో గ్రామస్తులు, తల్లిదండ్రులు సంతోషం వ్యక్తం చేస్తూ విద్యార్థులు, ఉపాధ్యాయులను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేశ్వర్ రావు, వడ్డేపల్లి సుదర్శన్, నర్సిరెడ్డి, ప్రేమలత, శ్రీధర్, శ్రీదేవి, పద్మ, గోపాల్ తదితరులు పాల్గొని విద్యార్థులను అభినందించారు.

## ఘనంగా ఎమ్మెల్యే పాయం దంపతుల వివాహ వార్షికోత్సవ వేడుకలు

**విశాలభారతి:** కరకగూడెం మండల పర్యటనలో భాగంగా పినపాక నియోజకవర్గ శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు మరియు వారి సతీమణి ప్రమీల వివాహ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు సయ్యద్ ఇక్బాల్ హుస్సేన్ ఘనంగా వేడుకలను నిర్వహించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే తో కేక్ కట్ చేయించి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమం ఆనందోత్సాహాల మధ్య నిర్వహించబడగా, వివిధ శాఖల అధికారులు, మండల పార్టీ నాయకులు, కార్యకర్తలు, సర్పంచులు, మహిళలు పాల్గొని ఎమ్మెల్యే కి తమ శుభాకాంక్షలు తెలిపారు.




# పాఠశాలల్లో మౌలిక సదుపాయాలు కల్పించాలి

- విద్యా కార్యక్రమాల అమలుపై కీలక ఆదేశాలు
- రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా

**మహబూబాబాద్, విశాలభారతి:**




గురువారం, హైదరాబాదు నుంచి విద్యా శాఖ సంచాలకులు నవీన్ నికోలస్ తో కలిసి రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి యోగితా రాణా అన్ని జిల్లాల కలెక్టర్లతో 99 రోజుల కార్యక్రమంలో భాగంగా నిర్వహించే విద్య వారోత్సవాలు, పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పన, విద్యా కార్యక్రమాల అమలు, తదితర అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో రాష్ట్ర విద్యా శాఖ కార్యదర్శి మాట్లాడుతూ.. 2026 2027 విద్యా సంవత్సరంలో రాష్ట్రంలోని 2700 ప్రభుత్వ పాఠశాలలలో ప్రీ ప్రైమరీ తరగతులు ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్, మరుగుదొడ్లు, తదితర సౌకర్యం లేని పాఠశాలలలో పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇంటర్, పదో తరగతిలో ఫెయిల్ అయిన ప్రభుత్వ విద్యా సంస్థల విద్యార్థులకు అడ్వాన్సుడ్ సప్లిమెంటరీ పరీక్షలకు ప్రత్యేక తరగతులు నిర్వహించాలన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా విద్యా శాఖ ఆధ్వర్యంలో మే 11వ తేదీ నుంచి వారోత్సవాలను నిర్వహించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలలో అవసరమైన మౌలిక వసతుల కల్పనకు సంబంధిత ప్రజాప్రతినిధులు, అధికారులతో శంకుస్థాపనలు చేయించాలన్నారు. విద్యార్థులు, వారి తల్లిదండ్రులను, ప్రజాప్రతినిధులను, అధికారులను భాగస్వాములు చేస్తూ విద్యా శిబిరాలు, వర్క్ షాప్ లు, బడిబాట, తదితర కార్యక్రమాలను షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలన్నారు. విద్యా వారోత్సవాల కార్యక్రమాలకు సంబంధించిన ఫోటోలు, వార్తలను ప్రజల్లోకి తీసుకెళ్లేలా పెద్ద ఎత్తున ప్రచారం కల్పించాలన్నారు. మరుగుదొడ్లు, మూత్రశాలలు, విద్యుత్, తాగునీటి కొరత ఉన్న పాఠశాలల్లో యు డి ఐ ఎస్ ఈ (యూడైస్) పోర్టల్ ప్రకారం తక్షణమే పనులు పూర్తి చేయాలని, ఎప్పటికప్పుడు పోర్టల్ లో నివేదికలను సరిగా నమోదు చేయాలన్నారు. కేజీబీవీలలో పది, ఇంటర్ సప్లిమెంటరీ విద్యార్థులు అందరూ ఉత్తీర్ణులయ్యేలా రెమెడియల్ కోచింగ్ నిర్వహించాలన్నారు. విద్యార్థుల కోసం వేసవి క్యాంపులు నిర్వహించి, సప్లిమెంటరీ కోచింగ్ ఇవ్వాలన్నారు. అనంతరం విద్యా శాఖ సంచాలకులు మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంలో భాగంగా మే 11 నుంచి 16 వరకు అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. నియోజకవర్గ స్థాయిలో సర్పంచులు, వార్డు సభ్యులు, పాఠశాల విద్య కమిటీలతో వర్క్‌షాప్ నిర్వహించాలన్నారు. బడిబాట అండ్ పిటిఎం ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్ కింద విద్యార్థుల నమోదుకు విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. బడిబాటపై ర్యాలీలు చేపట్టి, అవగాహన పెంపొందించాలన్నారు. డ్రాపౌట్ అయిన విద్యార్థులపై ప్రత్యేక దృష్టి సారించి, తిరిగి బడిలో చేర్పించాలన్నారు. జిల్లాలో పాఠశాల విద్యను బలోపేతం చేయడానికి, ముఖ్యంగా 10వ తరగతి, ఇంటర్మీడియట్ 1వ, 2వ సంవత్సరం డ్రాపౌట్ విద్యార్థులను తిరిగి బడిలో చేర్పించడానికి జిల్లా విద్యా శాఖ ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించాలన్నారు. బాలబాలికల భద్రత, సాంస్కృతిక కార్యక్రమాలు, చేతి కళలు వంటి కార్యక్రమాలను నిర్వహించి, విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి, ప్రోత్సహించాలన్నారు. వీసీ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ.. విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి, నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు, తల్లిదండ్రులు సమన్వయంతో కృషి చేయాలని తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ఇంటర్మీడియేట్ అధికారి మధార్, విద్యాశాఖ అధికారులు, ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## డిపోలో ఇద్దరు సీనియర్ ఉద్యోగులకు ఘన వీడ్కోలు

- డిపో మేనేజర్ కళ్యాణి ఆధ్వర్యంలో ఘన వీడ్కోలు
- 38 ఏళ్ల సేవల అనంతరం పాపిరెడ్డి రిటైర్మెంట్
- 35 సంవత్సరాల సేవతో నర్సయ్యకు గౌరవ వీడ్కోలు
- ముఖ్య అతిథిగా హాజరైన డిప్యూటీ రీజినల్ మేనేజర్ మహేష్
- పెద్ద సంఖ్యలో హాజరైన సిబ్బంది, బంధుమిత్రులు

**మహబూబాబాద్, విశాలభారతి:**




మహబూబాబాద్ ఆర్టీసీ డిపోలో దీర్ఘకాలంగా సేవలందించిన ఇద్దరు సీనియర్ ఉద్యోగులకు ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా 38 సంవత్సరాల పాటు వివిధ హోదాల్లో సేవలందించిన టి. పాపిరెడ్డి (ఏఎంఎఫ్) మరియు 35 సంవత్సరాలుగా విధులు నిర్వహించి ఏడీసీగా పదోన్నతి పొందిన కే.నర్సయ్య (ఎస్.డబ్ల్యూ) ఈరోజు ఉద్యోగ విరమణ పొందారు. డిపో మేనేజర్ వి. కళ్యాణి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి డిప్యూటీ రీజినల్ మేనేజర్ (ఎం) మహేష్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. రిటైర్ అవుతున్న ఉద్యోగులను శాలువాలు, పూలమాలలతో సన్మానించి, సంస్థ తరఫున రిటైర్మెంట్ బెనిఫిట్స్ మరియు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో వివిధ డిపోల నుంచి వచ్చిన ఏఎంఎఫ్‌లు, ఆఫీస్ సూపరింటెండెంట్ శ్రీమన్నారాయణ, ట్రాఫిక్ ఇన్‌చార్జ్ ఎం.ఆర్. రెడ్డి, డిపో ఏడీసీలు, భద్రతా విభాగం ఇన్‌చార్జ్ పి.ఎం. రెడ్డి, కండక్టర్లు, డ్రైవర్లు, మెకానికల్ సిబ్బంది, రిటైర్డ్ ఉద్యోగులు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పాపిరెడ్డి, నర్సయ్యలు సంస్థ అభివృద్ధికి చేసిన సేవలను కొనియాడుతూ, వారి భవిష్యత్ జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షించారు

## వేసవి క్రీడా శిబిరాన్ని సందర్శించిన దేశి రాం నాయక్



- కొత్తగూడ మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో సమ్మర్ క్యాంప్ సందర్శన
- కబడ్డీ నుంచి బాస్కెట్బాల్ వరకు శిక్షణపై సూచనలు
- రాష్ట్రస్థాయి విజేతలకు అభినందనలు తెలిపిన అధికారులు
- క్రీడల ద్వారా శారీరక, మానసిక వికాసం అవసరం – దేశి రాం నాయక్

**మహబూబాబాద్, విశాలభారతి:**

కొత్తగూడ మోడల్ స్పోర్ట్స్ స్కూల్‌లో నిర్వహిస్తున్న వేసవి క్రీడా శిబిరాన్ని గురువారం గిరిజన సంక్షేమ శాఖ ఉప సంచాలకులు దేశి రాం నాయక్ సందర్శించారు. ఈ సందర్భంగా శిబిరంలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమాలను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడి వారి ప్రతిభను అభినందించారు. ఈ సమ్మర్ క్యాంపులో కబడ్డీ, వాలీబాల్, కోకో, అథ్లెటిక్స్, హ్యాండ్ బాల్, బాస్కెట్బాల్ వంటి వివిధ క్రీడలపై శిక్షణ అందిస్తున్న ఉపాధ్యాయులకు ఆయన సూచనలు, సలహాలు అందించారు. విద్యార్థులలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు మరింత శ్రద్ధ వహించాలని సూచించారు. అలాగే పాఠశాల నుండి రాష్ట్రస్థాయి క్రీడా పోటీల్లో పాల్గొని మొదటి స్థానాన్ని సాధించిన విద్యార్థులను దేశి రాం నాయక్ ప్రత్యేకంగా అభినందించి, భవిష్యత్తులో ఇంకా ఉన్నత స్థాయికి చేరుకోవాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఏటీడీవో కొత్తగూడ ఆర్. భాస్కర్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, డిప్యూటీ డీఈవో డి సారయ్య, స్పోర్ట్స్ ఆఫీసర్ కొమ్మాలు, సీనియర్ ఉపాధ్యాయులు బి దేవిలాల్ మరియు వ్యాయామ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

## నాటు కోళ్ల పెంపకం సందర్శన




**విశాలభారతి:**

కరకగూడెం మండల పశువైద్యాధికారి వాసంతి మరియు మండల కోఆర్డినేటర్ పగుట్ల వెంకటేశ్వరరావు తాటిగూడెం, లక్ష్మీపురం లో ఏర్పాటు చేసిన నాటు కోళ్ల షెడ్లను సందర్శించారు.పశువైద్యాధికారి వాసంతి గారు కోళ్ల రక్షణకు తగిన జాగ్రత్తలు,సూచనలు రైతులకు ఇవ్వడం జరిగింది.కోళ్ల బలానికి మందులను డాక్టర్ వాసంతి రైతులకు అందచేశారు.కోనేరు సంస్థ ఆధ్వర్యంలో చేస్తున్న సమీకృత వ్యవసాయం పద్ధతి చాలా అద్భుతంగా ఉందని,చిన్న సన్నకారు రైతుల ఆదాయం పెంచే లక్ష్యం అనేది చాలా బావుంది అని డాక్టర్ వాసంతి కోనేరు సంస్థను అభినందించారు.

## పదవ తరగతి ఫలితాలలో విద్యార్థుల ఉత్తమ ప్రతిభ



**మహబూబాబాద్, విశాలభారతి:** పదవ తరగతి ఫలితాలలో మహబూబాబాద్, దామరవంచ, మరిపెడ(బాలుర), కొత్తగూడ, కేసముద్రం (బాలికలు) గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో చదువుతున్న 340 విద్యార్థులకు గాను 340 మంది విద్యార్థులు ఉత్తీర్ణులై 100శాతం ఉత్తీర్ణత సాధించారని ఆర్. సి. ఓ. పి.రత్న కుమారి నేడు ఒక ప్రకటనలో తెలిపారు.

## గండి వెంకటమ్మకు ఎమ్మెల్యే రామచంద్రనాయక్ నివాళి



**మరిపెడ, విశాలభారతి:** మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామానికి చెందిన టీవీ 5 రిపోర్టర్ విష్ణు తల్లి గండి వెంకటమ్మ మరణం పట్ల డోర్నకల్ శాసనసభ్యులు, ప్రభుత్వ విప్ డాక్టర్ రామచంద్రనాయక్ తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన వారి నివాసానికి వెళ్లి పూలమాల సమర్పించి నివాళులర్పించారు. అనంతరం విష్ణు కుటుంబ సభ్యులను పరామర్శించి, ఈ విషాద సమయంలో ధైర్యంగా ఉండాలని సూచించారు. కుటుంబానికి ఎల్లప్పుడూ తాను అండగా ఉంటానని హామీ ఇచ్చారు. గండి వెంకటమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించిన ఎమ్మెల్యే, ఆమె కుటుంబానికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, కార్యకర్తలు పాల్గొని వెంకటమ్మకు నివాళులు అర్పించారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన మాజీ మంత్రి



**మరిపెడ, విశాలభారతి:** మహబూబాబాద్ జిల్లా మరిపెడ మున్సిపాలిటీ పరిధిలోని 5వ వార్డు మాజీ కౌన్సిలర్ పానుగోతు సుజాత వెంకన్న కుమార్తె సంగీత, ప్రణీత్‌ల వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ వివాహం వంటికొమ్ము లక్ష్మారెడ్డి గార్డెన్స్‌లో ఆచార సంప్రదాయాలతో నిర్వహించబడింది. ఈ శుభకార్యానికి ముఖ్య అతిథిగా హాజరైన మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి దాంపత్య జీవితం సుఖసంతోషాలతో నిండాలని ఆకాంక్షిస్తూ హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు. కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా ముచ్చటించి, ఈ వేడుకలో పాల్గొనడం తనకు ఆనందంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీకి చెందిన ప్రముఖ నాయకులు బొడ శ్రీను నాయక్, భూక్య రామ్మూర్తి నాయక్, యాకుబ్ పాషా, బొమ్మకంటి వెంకట్ గౌడ్ తదితరులు పాల్గొని వధూవరులను అభినందించారు. స్థానిక ప్రజలు, బంధుమిత్రులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ వివాహాన్ని మరింత వైభవంగా తీర్చిదిద్దారు.

## చట్టబద్ధంగా పిల్లలను దత్తత ఇవ్వడం జరుగుతుంది

**అలివేలు మత్స్యగిరి ఐసీడియస్ జిల్లా అధికారి**




**చౌటుప్పల్ విశాలభారతి:** పట్టణ కేంద్రంలోని ప్రజా పాలన,ప్రగతి ప్రణాళిక 99వ రోజు కార్యాచరణ ప్రణాళికలో భాగంగా మహిళా శిశు దివ్యాంగుల మరియు వయోవృధుల సంక్షేమ శాఖ యాదాద్రి భువనగిరి జిల్లా అధికారి అలివేలు మత్స్యగిరి ఆధ్వర్యంలో చౌటుప్పల్ బస్ స్టాండ్ వద్ద దత్తత సహాయ కేంద్రాన్ని ఏర్పాటు చేయడం జరిగింది.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..పిల్లల సురక్షితమైన భవిష్యత్తుకు చట్ట బద్ధమైన దత్తతే మార్గం అని వారు తెలిపారు.పిల్లలను ప్రభుత్వం చట్ట బద్ధంగా దత్తత ఇవ్వడం జరుగుతుందని ఈ సందర్భంగా వారు తెలిపారు.అనంతరం ఏరియా ఆసుపత్రిలో ఉయ్యాల ను ఏర్పాటు చేసి దత్తత పైన అవగాహన కల్పించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐసీడియస్ సూపర్వైజర్ శోభారాణి శ్రీకాంత్,నర్సింహరాజు మరియు తదితరులు పాల్గొన్నారు.

## నాగారం స్టేడియంలో రేపటి నుండి విలువిద్య శిక్షణ తరగతులు

**ఆర్మూర్,విశాల భారతి:** నాగారంలోని రాజారాం స్టేడియంలో రేపటి నుంచి ఖేలో ఇండియా విలువిద్య శిక్షణ శిబిరం వీలు విద్య శిక్షకుడు మద్దుల మురళి గురువారం ఒక ప్రకటన తెలిపారు,రేపటి నుండి వేసవి విలువిద్య శిక్షణ శిబిరము ఉదయం 6 గంటల నుండి 9 గంటల వరకు ఖేలో ఇండియా ఆర్చరీ ట్రైనింగ్ సెంటర్లో ఉచితంగా కోచింగ్ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. వేసవిలో విద్యార్థులకు ఒక మంచి సువర్ణ అవకాశమని చదువుతో పాటు ఆటలు కూడా భాగమేనని సారీ రా ఉల్లాసానికి ఒక విధమైన మంచి వ్యాయామం అన్నారు, విద్యార్థుల యొక్క తల్లిదండ్రులు పిల్లలకు దీనిపైన అవగాహన కల్పించి ఈ యొక్క క్రీడలకు పిల్లలకు అవకాశం కల్పించాలి,ఈ స్టేడియంలో విద్యార్థులు అందరూ ముందు వరుసలో ఉండి ఈ చక్కటి అవకాశాన్ని వినియోగించుకోవాలి, విలువిద్య క్రీడాకారులు https://satgasc.telangana.gov.inలింకు ద్వారా ఓపెన్ చేసుకొని రిజిస్ట్రేషన్ చేసుకోగలరని అంతర్జాతీయ విలువిద్య క్రీడాకారుడు మద్దుల మురళి ఒక ప్రకటనలో తెలిపారు.

**మరిన్ని వివరాలకు సంప్రదించండిమద్దుల మురళి అంతర్జాతీయ విలువిద్య క్రీడాకారుడు.**
**ఫోన్ నెంబర్:9848919480**



# ప్రజాపాలనలో సామాజిక న్యాయం ఎక్కడ?

- ఎమ్మెల్యే తీరుపై సొంత పార్టీలోనే అసహనం!
- కురవి ఆలయ చైర్మన్ ఎంపికపై జిల్లాలో రాజకీయ ఉద్రిక్తతలు
- ఒకే వర్గానికి వరుసగా అవకాశాలు... ఇతరుల్లో అసంతృప్తి వెల్లువ
- మూడోసారి కూడా అదే వ్యక్తికే పదవి? పార్టీ లోపలే వ్యతిరేక స్వరాలు

**కురవి విశాలభారతి:**

చారిత్రాత్మక కురవి శ్రీ వీరభద్రస్వామి పుణ్యక్షేత్రం చైర్మన్ పదవి ఎంపిక ఇప్పుడు జిల్లా రాజకీయాల్లో హాట్ టాపిక్ గా మారింది. ప్రజాపాలనలో కష్టపడిన వారికే పదవులు దక్కుతాయని నూతన ప్రభుత్వం చెబుతున్నా, కురవి విషయంలో మాత్రం అందుకు విరుద్ధంగా జరుగుతోందని విమర్శలు వస్తున్నాయి. ముఖ్యంగా సామాజిక న్యాయం కొరవడిందన్న ఆవేదన కార్యకర్తల్లో వ్యక్తమవుతోంది.

**ఒకే సామాజిక వర్గానికి పెద్దపీట?**

నూతన ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి ఆలయ చైర్మన్ పదవిని కేవలం ఒకే సామాజిక వర్గానికి కట్టబెడుతుండటంపై స్థానిక ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ విమర్శల పాల వుతున్నారు. జిల్లా లోని డోర్నకల్ నియోజకవర్గంలో అన్ని వర్గాల వారు పార్టీ కోసం పనిచేస్తుంటే, పదవుల పంపకంలో మాత్రం ఒకే వర్గానికి ప్రాధాన్యత ఇవ్వ డంపై ఇతర సామాజిక వర్గాల్లో అసంతృప్తి జ్వాలలు ఎగిసిపడుతు న్నాయి.

**గత పాలనే మెరుగన్న విమర్శలు!**

గత ప్రభుత్వ హయాంలో మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్ హయాంలో దళితులకు మినహా, దాదాపు అన్ని ఇతర ప్రధాన సామాజిక వర్గాలకు దేవస్థాన కమిటీలో అవకాశం కల్పించారని స్థానికులు గుర్తు చేస్తున్నారు. కానీ ప్రస్తుతం సామాజిక సమతుల్యత దెబ్బ తిందని, ఒకరికే పదేపదే అవకాశం ఇవ్వడం వెనుక మర్మమేమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.



**అభివృద్ధి శూన్యం.. ఎక్కడ వేసిన గొంగళి అక్కడే!**

ఇప్పటికే రెండుసార్లు సదరు వ్యక్తికే చైర్మన్ పదవి కట్టబెట్టినప్పటికీ, ఆలయ అభివృద్ధిలో ఎలాంటి పురోగతి లేదని భక్తులు, స్థానికులు మండిపడుతున్నారు. భక్తులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో గానీ, ఆలయ ప్రాశస్త్యాన్ని పెంచడంలో గానీ ప్రస్తుత పాలన విఫలమైందని, 'ఎక్కడ వేసిన గొంగళి అక్కడే' అన్న చందంగా కురవి ఆలయ అభివృద్ధి మారిందని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

**మూడోసారి కూడా 'ఆయన'కేనా?**

కాగా, ఇప్పుడు మూడవసారి కూడా అదే వ్యక్తికి చైర్మన్ పీఠాన్ని అప్పగించేందుకు తెరవెనుక ప్రయత్నాలు ముమ్మరంగా సాగుతున్నట్లు సమాచారం. ఈ పరిణామం గనుక నిజమైతే ఎమ్మెల్యే రామచంద్రు నాయక్ తీవ్ర విమర్శలను ఎదుర్కోవాల్సి వస్తుందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. పార్టీ కోసం రాత్రింబవళ్లు కష్టపడిన మిగతా ఆశావాహుల పరిస్థితి ఏమిటన్న ప్రశ్న తలెత్తుతోంది.

**సామాజిక న్యాయం జరిగేనా?**

సొంత పార్టీలోని ఆశావాహులే ఇప్పుడు అసహనంతో రగిలిపోతున్నారు. తమను కాదని మళ్లీ ఒకరికే పదవి ఇస్తే పార్టీకి నష్టం తప్పదని హెచ్చరిస్తున్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే స్పందించి, పాత పద్ధతులకు స్వస్తి పలికి, సామాజిక న్యాయం పాటిస్తూ పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసే కొత్త వారికి అవకాశం కల్పించాలని కురవి ప్రాంత వాసులు కోరుకుంటున్నారు.

## వడ్లు కొనుగోలులో నిర్లక్ష్యం,రైతులను మోసం చేస్తున్న ప్రభుతం.. బీజేపీ ఆగ్రహం



**మూటకొండూర్, విశాలభారతి:** మూటకొండూర్ మండల శాఖ అధ్యక్షులు యెల్లంల శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని ఐకెపి సెంటర్‌ను గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రభుత్వం వడ్లు సగానికి పైగా కొనుగోలు చేశామని చెప్పడం పూర్తిగా తప్పుడు ప్రచారమని, తెలంగాణ రైతాంగాన్ని మోసం చేయడమే జరుగుతోందని ఆయన తీవ్రంగా విమర్శించారు. సందర్శనలో భాగంగా ఎక్కడి వడ్లు అక్కడే పేరుకుపోయి ఉండడం గమనించామని, వాటిని పట్టించుకునే పరిస్థితి లేదని అన్నారు. మండలంలోని ఐకెపి సెంటర్లలో ఒకటి రెండు లారీలకు మాత్రమే వడ్లు తరలించగా, మిగతా వడ్లు అలాగే నిల్వ ఉండటం వల్ల రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. వెంటనే అధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకొని అన్ని వడ్లను త్వరితగతిన తరలించేలా చర్యలు చేపట్టాలని బీజేపీ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి క) జిల కార్యదర్శి, పీసరి తిరుమలరెడ్డి, చిర్రా రవీందర్, అనంతర పాండురంగారెడ్డి, పాశం కృష్ణారెడ్డి, గాజుల బాలరాజ్, మల్గా అశోక్, సీస సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## సాహిత్య కీర్తి శిఖరాల్లో ఇద్దరు మహనీయులు

**ఘనంగా సత్కరించిన రచయితల సంఘం**



**ఆలేరు, విశాలభారతి:** ఆలేరు మండల కేంద్రంలోని వి.ఆర్ కళాశాలలో గురువారం జిల్లా రచయితల సంఘం, అనుబంధ సంఘాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన అభినందన సభ ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ప్రముఖ కవులు ప్రజాకవి డా. నందిని సిధారెడ్డి, డా. ఏనుగు నర్సింహారెడ్డిని యువకవి, రచయిత భైరపాక స్వామి ఘనంగా సత్కరించారు. ఇటీవల డా. నందిని సిధారెడ్డి రచించిన అనిమేష దీర్ఘకావ్యానికి కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించగా, డా. ఏనుగు నర్సింహారెడ్డికి ఐఏఎస్ హోదా లభించిన నేపథ్యంలో ఈ అభినందన సభను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా భైరపాక స్వామి మాట్లాడుతూ, విలువలతో కూడిన సాహిత్యాన్ని సృష్టించడం వీరి ప్రత్యేకత అని కొనియాడారు. సాహిత్యంతో పాటు మనుషుల పట్ల అపారమైన ప్రేమ కలిగిన మహోన్నత వ్యక్తిత్వాలని ప్రశంసించారు. ఇద్దరూ సాహిత్య ప్రపంచంలో సూర్యచంద్రుల వంటి వారని పేర్కొంటూ, వారి రచనలు రానున్న తరాలకు ఆదర్శంగా నిలుస్తాయని అన్నారు. కార్యక్రమానికి డా. పోరెడ్డి రంగయ్య అధ్యక్షత వహించగా, కవులు డా. లింగంపల్లి రామచంద్ర, ఎస్. హరగోపాల్, పాటల రచయిత అభినయ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డిని కలిసిన ఏసీపీ శ్రీశైలం

**ఏసీపీగా పదోన్నతి పొందటం పట్ల హర్షం**



**నిజామాబాద్, విశాలభారతి:** స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ గా విధులు నిర్వహిస్తున్న పుప్పాల శ్రీశైలం ఇటీవల ఏసీపీగా పదోన్నతి పొందిన నేపథ్యంలో బుధవారం సాయంత్రం నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం ఎమ్మెల్యే డా.ఆర్. భూపతి రెడ్డిని కలిశారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. ఏసీపీగా పదోన్నతి పొందిన సదరు అధికారిని ఎమ్మెల్యే అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

## జర్నలిస్ట్ గండి విష్ణుగౌడ్‌ను పరామర్శించిన మాజీ మంత్రి



**మరిపెడ, విశాలభారతి:** డోర్నకల్ నియోజకవర్గంలోని మరిపెడ మండలం ఎల్లంపేట గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. గ్రామానికి చెందిన టీవీ రిపోర్టర్ గండి విష్ణుగౌడ్ మాతృమూర్తి వెంకటమ్మ ఇటీవల కన్నుమూయడంతో, కుటుంబ సభ్యులు తీవ్ర దుఃఖంలో మునిగిపోయారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ గురువారం ఎల్లంపేట గ్రామానికి చేరుకొని, వెంకటమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘన నివాళులు అర్పించారు. అనంతరం గండి విష్ణుగౌడ్, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ధైర్యం చెప్పారు. ఇలాంటి కఠిన సమయాల్లో ధైర్యంగా ఉండాలని, వెంకటమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ఆకాంక్షించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ గండి రాధమ్మ, బొడ శ్రీను నాయక్, మాజీ పిఎసియస్ వైస్ చైర్మన్ గండి మహేష్ గౌడ్, అంబారిష, కసనబోయిన వెంకన్న, నెలుకుర్తి ప్రతాప్ రెడ్డి, బొమ్మకంటి వెంకట్ గౌడ్ తదితర ప్రముఖులు పాల్గొని తమ సంతాపాన్ని తెలియజేశారు. గ్రామ ప్రజలు పెద్ద ఎత్తున హాజరై, వెంకటమ్మ మరణం పట్ల తమ దుఃఖాన్ని వ్యక్తం చేశారు. ఆమె సేవలను స్మరించుకుంటూ, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

## ఎంపీడీఓలతో ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి సమీక్షా సమావేశం

- సంక్షేమ పథకాలు.. క్షేత్రస్థాయి అంశాల పై సమీక్ష
- గృహ నిర్మాణం ఇందిరమ్మ ఇళ్లు,పథకాల అమలు తీరుపై సమీక్ష



**నిజామాబాద్, విశాలభారతి:** నిజామాబాద్ రూరల్ నియోజకవర్గంలోని అన్ని మండలాల ఎంపీడీఓ లతో ఎమ్మెల్యే డా.ఆర్.భూపతి రెడ్డి గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ మేరకు ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో జెడ్పీ సీఈఓ సాయగౌడ్ నేతృత్వంలో అన్ని మండలాల ఎంపీడీఓ లతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్సీ,ఎస్టీ, మైనారిటీ సంక్షేమ శాఖల సబ్సిడీలు, పథకాల అమలు తీరు, గృహ నిర్మాణం,ఇందిరమ్మ ఇళ్లు, తదితర అంశాల పై సుదీర్ఘంగా చర్చించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేసే ప్రతి పథకం చివరి లబ్ధిదారుడి చెంతకి చేరేలా అధికారులు క్షేత్రస్థాయిలో సమన్వయంతో ముందుకు సాగాలని సూచించారు. అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ ఫలాలు అందేలా అధికారులు ఎలాంటి అలసత్వం లేకుండా ప్రత్యేక చొరవ చూపాలన్నారు. ఇందిరమ్మ ఇళ్ల విషయంలో అర్హులైన వారిని గుర్తించి వంద శాతం గ్రౌండింగ్ చేయాలని ఆదేశించారు. అదేవిధంగా ఎంపీడీఓ కార్యాలయాలు శిథిలావస్థలో ఉన్నాయని ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా వాటిని పరిశీలించి ప్రతిపాదనను ప్రభుత్వానికి నివేదించాలని జెడ్పీ సీఈఓ కు ఎమ్మెల్యే సూచించారు.

## ప్రత్యేక పూజలు నిర్వహించిన ఎమ్మెల్యే దంపతులు



**విశాలభారతి, అంతర్గం:** రామగుండం నియోజకవర్గం శాసనసభ్యులు ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ వారి సతీమణి మనాలి ఠాకూర్ గురువారం అంతర్గం మండలం పరిధిలోని నూతన దారి మైసమ్మ ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని దర్శించుకుని రాష్ట్ర ప్రజల సుఖశాంతులు, అభివృద్ధి, రామగుండం నియోజకవర్గ ప్రజల ఆయురారోగ్యాల కోసం ప్రార్థనలు చేశారు. ఆలయ అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని ఎమ్మెల్యే తెలిపారు.స్థానిక ప్రజలు, ఆలయ కమిటీ సభ్యులు, నాయకులు ఎమ్మెల్యే దంపతులకు ఘన స్వాగతం పలికారు. భక్తిశ్రద్ధలతో సాగిన ఈ కార్యక్రమంలో పలువురు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## సింగరేణి అధికారులతో ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ సమీక్ష సమావేశం



**విశాలభారతి, గోదావరిఖని:** రామగుండం నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం మరియు సింగరేణి పరిధిలో కొనసాగుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపై బుధవారం సాయంత్రం రామగుండం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ముఖ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆర్జీ 1 జీఎం లలిత్ కుమార్‌తో పాటు సింగరేణి సంస్థకు చెందిన పలువురు అధికారులు పాల్గొన్నారు.ఈ సందర్భంగా రామగుండం ఎమ్మెల్యే ఎం.ఎస్. రాజ్ ఠాకూర్ నియోజకవర్గ ప్రజలకు సంబంధించిన పలు సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ముఖ్యంగా సింగరేణి కార్మికుల సంక్షేమం, కాలనీల్లో మౌలిక వసతుల అభివృద్ధి, రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు.అలాగే ప్రజలకు ఇబ్బందులు కలగకుండా పెండింగ్‌లో ఉన్న పనులను వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే అధికారులను ఆదేశించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలని అయన కోరారు.

## స్వీయ జనగణన నమోదు కార్యక్రమం

**మహబూబాబాద్, విశాలభారతి:**



మహబూబాబాద్ జిల్లాలో స్వీయ జనగణన ఇండ్ల వివరాల ప్రాథమిక నమోదు కార్యక్రమం చురుకుగా కొనసాగుతోంది. ప్రభుత్వ సూచనలు, జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఈ కార్యక్రమాన్ని విస్తృతంగా అమలు చేస్తున్నారు. ప్రజాప్రతినిధులు, స్వయం సహాయక సంఘాలు, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, పోలీస్, వైద్య ఆరోగ్య శాఖలు, కలెక్టరేట్‌లోని అన్ని విభాగాల వారు ఇందులో చురుకుగా పాల్గొంటున్నారు. పాల్గొనే వారు తమ వివరాలను నమోదు చేసుకొని ఐడీలను పొందుతున్నారు. మే 11 నుంచి ప్రారంభమయ్యే ప్రధాన జనగణన కార్యక్రమం సాఫీగా జరిగేలా ముందస్తుగా స్వీయ జనగణన వివరాలను నమోదు చేసుకునే ప్రక్రియను చేపట్టారు. దీని ద్వారా ప్రజలు సులభంగా తమ సమాచారాన్ని నమోదు చేసుకునే వీలుంటుందని అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమం విజయవంతం కావడానికి అదనపు కలెక్టర్ (అదనపు గణాంక అధికారి) కె. అనిల్ కుమార్, ముఖ్య ప్రణాళిక అధికారి శ్రీనివాసరావు, డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ తిరుపతిరావు ఆధ్వర్యంలో వైద్య ఆరోగ్య శాఖ, మెడికల్ కాలేజ్ ప్రధాన విద్యాసంస్థలలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. కార్యక్రమ అమలులో సమన్వయం, అవగాహనపై చర్చించారు. అదేవిధంగా మహబూబాబాద్ జిల్లా పౌర సంబంధాల శాఖ కార్యాలయంలో ప్రింట్ మరియు ఎలక్ట్రానిక్ మీడియా ప్రతినిధుల కోసం స్వీయ జనగణన నమోదు కార్యక్రమం నిర్వహించారు. జర్నలిస్టులు స్వచ్ఛందంగా పాల్గొని తమ వివరాలను నమోదు చేసుకున్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని అదనపు కలెక్టర్ కె. అనిల్ కుమార్ సూచించారు. ఈ కార్యక్రమంలో డిపిఆర్ఓ రాజేంద్రప్రసాద్‌తో పాటు సీనియర్ జర్నలిస్టులు మట్టూరి నాగేశ్వరరావు, డివై గిరి, అయోధ్య రామయ్య, ఆకుల రమేష్, సత్యనారాయణ, శ్రీనివాస చారి తదితరులు పాల్గొని తమ వివరాలను నమోదు చేసుకొని ఐడీలు పొందారు.

## నేతన్న భరోసా చెక్కు అందజేత



**తిరుమలగిరి, విశాలభారతి :**

ప్రభుత్వం చేనేత కార్మికులకు అందిస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి అని సూర్యాపేట జిల్లా చేనేత జౌళి శాఖ సహాయ అభివృద్ధి అధికారి ఎస్.అరవింద్ కోరారు. గురువారం రోజు తిరుమలగిరి లోని స్థానిక చేనేత సహకార సంఘంలో చేనేత కార్మికులకు నేతన్న భరోసా మొదటి త్రైమాసికంనకు చెందిన చెక్కును వారికి అందచేసి మాట్లాడారు. ఈ సందర్భముగా తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాజకీయ విభాగ రాష్ట్ర కార్యదర్శి వంగరి బ్రహ్మం మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలోని చేనేత కార్మికులకు చేనేత భరోసా నిధులు విడుదల చేసిన సందర్భంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వానికి,ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి, చేనేత జౌళి శాఖ మాత్యులు తుమ్మల నాగేశ్వర రావుకి, నిరంతరం చేనేత కార్మికుల అభివృద్ధి కొరకు ప్రభుత్వం కల్పించిన చేనేత పథకాలు కార్మికులకు చేరుటకు అటు రాష్ట్ర ప్రభుత్వంతో ఇటు అధికారులతోనూ నిత్యం సమన్వయపరుస్తూ నిధులను విడుదల చేయిస్తూ పద్మశాలి సమాజానికి చేనేత వర్గాలకు అండగా ఉంటూ కంటికి రెప్పలా కాపాడుకుంటున్న తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కమర్తపు మురళికి సూర్యాపేట జిల్లా పక్షాన తిరుమలగిరి మండల చేనేత కార్మిక సంఘం పక్షాన హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. చేనేత సంఘం డైరెక్టర్లు గజ్జెల ఉపేందర్,మద్దూరి కృష్ణ మూర్తి మండలము లోని వివిధ గ్రామాలకు చెందిన చేనేత కార్మికులు వెంగలి మధు.ఎనగందుల రవి. వంగరి ఉపేందర్,మంచే అంబదాస్, వీరబత్తిని మల్లయ్య, వంగరి సోమయ్య, వంగరి సోమకృష్ణ. దుస్సా రామ్మూర్తి.రాపోలు కొండయ్య, వంగరి రమేష్, వంగరి సూర్యనారాయణ,మద్దూరి వెంకన్న.మద్దూరి శేఖర్ అమృతం రాజు, తదితరులు పాల్గొన్నారు.

## వడదెబ్బపై అప్రమత్తంగా ఉండాలి



**వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి**

**మరిపెడ, విశాలభారతి:**

మరిపెడ మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గురువారం వైద్యాధికారి డాక్టర్ గుగులోతు రవి ఆధ్వర్యంలో వైద్య సిబ్బందితో నెలవారీ సమీక్షా సమావేశం నిర్వహించారు. పీహెచ్‌సీ ఆవరణలోని చెట్ల నీడన జరిగిన ఈ సమావేశంలో ప్రజారోగ్య పరిరక్షణ, సీజనల్ వ్యాధుల నివారణ, గర్భిణీల సంరక్షణ తదితర అంశాలపై సమగ్రంగా చర్చించారు. ఈ సందర్భంగా డాక్టర్ గుగులోతు రవి మాట్లాడుతూ... పీహెచ్‌సీ పరిధిలో నమోదైన గర్భిణీ స్త్రీల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, వారికి అవసరమైన పరీక్షలు, మందులు, పోషకాహార సూచనలు అందించాలని సిబ్బందిని ఆదేశించారు. చిన్నారులకు నిర్దేశిత షెడ్యూల్ ప్రకారం టీకాలు పూర్తి చేయడంతో పాటు, మహిళల్లో గర్భాశయ క్యాన్సర్ నివారణకు ఉపయోగపడే హెచ్‌పీవీ వ్యాక్సిన్‌పై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. అదేవిధంగా ఎన్‌సీడీ, టీబీ బాధితులకు నాణ్యమైన వైద్య సేవలు అందేలా ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని తెలిపారు. గ్రామాల్లో ఆరోగ్య సమస్యలపై ముందస్తు గుర్తింపు, చికిత్స అందించడంలో ఏఎన్ఎంలు కీలక పాత్ర పోషించాలని అన్నారు.ప్రస్తుతం మండలంలో ఎండలు తీవ్రరూపం దాల్చుతున్న నేపథ్యంలో ప్రజలు వడదెబ్బ బారిన పడకుండా జాగ్రత్తలు తీసుకునేలా క్షేత్రస్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఏఎన్ఎంలకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ముఖ్యంగా వృద్ధులు, చిన్నపిల్లలు, గర్భిణీలు మధ్యాహ్న సమయంలో బయటకు రాకుండా చూడాలని, ఎక్కువగా నీరు, మజ్జిగ, ఓఆర్ఎస్ ద్రావణాలు తీసుకోవాలని ప్రజలకు తెలియజేయాలని సూచించారు.ఈ సమావేశంలో డాక్టర్ స్వామి, డాక్టర్ కిరణ్ సాగర్, సీహెచ్‌వో కమల, పబ్లిక్ హెల్త్ నర్సింగ్ ఆఫీసర్, సూపర్వైజర్లు ఆచార్యులు, లక్ష్మికుమారి, పల్లె దవాఖాన సిబ్బంది, ఏఎన్ఎంలు పాల్గొన్నారు.

## పది ఫలితాల్లో ఇచ్చోడ నంబర్ వన్







**ఆదిలాబాద్, విశాలభారతి:** వినయం విద్యా విజ్ఞానం విధేయత ప్రగతి ప్రభంజనం విజయానికి చిరునామాగా,పట్టుదలకు ప్రతి రూపంగానిలుస్తూ స్థానిక ఇచ్చోడ లో ప్రగతి పాఠశాల విద్యార్థులు బుధవారం ప్రకటించిన పదో తరగతి ఫలితాల్లో అద్భుత ప్రతిభను కనబరిచారు. కే వైభవి.600మార్కులకు గాను 560 మార్కులు సాధించి పాఠశాలలో ప్రథమ స్థానంలో నిలిచింది...మరో విద్యార్థిని...టీ. అక్షర ద్వితీయ స్థానంలో నిలిచింది. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ సురకంటి వనమాల, పాఠశాల ప్రిన్సిపాల్ కె.ప్రవీణ్ ఉత్తమ ప్రతిభను కనబరిచిన విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు.అనంతరం పాఠశాల కరస్పాండెంట్ మాట్లాడుతూ... ఈ విజయం విద్యార్థుల క్రమశిక్షణ, పట్టుదల, నిరంతర కృషికి, మరియుఉపాధ్యాయుల నిబద్ధత, తల్లిదండ్రుల విశ్వాసానికి దక్కిన ప్రతిఫలమని కొనియాడారు. భవిష్యత్తులోకూడా ప్రతి విద్యార్థి ఉన్నత లక్ష్యాలను సాధించి సమాజానికి ఆదర్శంగా నిలవాలని, దేశ ప్రగతినిమార్చే మేధావులుగా ఎదగాలని ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## అంగన్వాడి చిన్నారుల దాహార్తికి చెక్

**తాగునీటి సమస్య తీర్చిన సర్పంచ్ తేజావత్ నాగ నాయక్**

**మరిపెడ, విశాలభారతి:** మరిపెడ మండల పరిధిలోని వాల్య తండా గ్రామపంచాయతీ పరిధిలో ఉన్న అంగన్వాడీ కేంద్రంలో చిన్నారులు ఎదుర్కొంటున్న తాగునీటి సమస్యకు గ్రామ సర్పంచ్ తేజావత్ నాగ నాయక్ శాశ్వత పరిష్కారం చూపించారు.అంగన్వాడీ కేంద్రం వద్ద ఉన్న చేతిపంపు (హ్యాండ్ బోర్) ఐదు సంవత్సరాల క్రితమే భూగర్భజలం అందక ఎండిపోవడంతో అక్కడి చిన్నారులు, అంగన్వాడీ సిబ్బంది తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి కోసం ఇతర ప్రాంతాలపై ఆధారపడాల్సిన పరిస్థితి నెలకొంది. విషయం తెలుసుకున్న సర్పంచ్ తేజావత్ నాగ నాయక్ వెంటనే స్పందించి చిన్నారుల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేపట్టారు.మిషన్ భగీరథ పైపులైన్ నుండి ప్రత్యేకంగా నల్లా కనెక్షన్ ఏర్పాటు చేసి అంగన్వాడీ కేంద్రానికి నేరుగా తాగునీరు అందేలా చర్యలు తీసుకున్నారు. దీంతో ఎన్నో రోజులుగా వేధిస్తున్న తాగునీటి కష్టాలు తొలగిపోగా, అంగన్వాడీ కేంద్రంలో పిల్లలకు పరిశుభ్రమైన మంచినీరు అందుబాటులోకి వచ్చింది. త్రాగునీటి సమస్య తీరడంతో చిన్నారులు ఆనందం వ్యక్తం చేయగా, అంగన్వాడీ టీచర్లు, గ్రామస్థులు సర్పంచ్ తేజావత్ నాగ నాయక్‌ను అభినందించారు. చిన్నారుల ఆరోగ్యం, సౌకర్యాల విషయంలో సర్పంచ్ చూపిన చొరవ ప్రశంసనీయమని పలువురు పేర్కొన్నారు.గ్రామాభివృద్ధితో పాటు బాలల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్న సర్పంచ్ తేజావత్ నాగ నాయక్ సేవలు గ్రామంలో చర్చనీయాంశంగా మారాయి.



# హైడ్రా హామీలు నీటిమూటలేనా?



కబ్జాకు గురైన ఈదులకుంట వద్ద సిపిఐ పార్టీ నాయకుల నిరసన



కబ్జాకు గురైన చెరువు వద్ద నిరసన తెలియజేస్తున్న సిపిఐ నాయకులు

**చెరువు మాయం చేసి సెల్లార్ తవ్వుతున్నా చర్యలేవి: సీపీఐ ఫైర్**

**శేరిలింగంపల్లి-విశాలభారతి:**

'హైడ్రా కమిషనర్ స్వయంగా వచ్చి ఇది ఈదులకుంట చెరువు, డెవలప్ చేస్తామని చెప్పారు. ఆ మాటలు నీటిమూటలు అయ్యాయి. చెరువు ఎక్కడికి పోయిందో తెలియదు కానీ, అదే చోట సెల్లార్ మాత్రం దర్జాగా తవ్వుతున్నారు' అంటూ సీపీఐ రాష్ట్ర నాయకులు పానుగంటి పర్వతాలు, టి. రామకృష్ణ హైడ్రా కమిషనర్ తీరుపై ధ్వజమెత్తారు. ఆయన చర్యలపై తాము ఏమాత్రం సంతృప్తిగా లేమని కుండబద్దలు కొట్టారు. ఖానామెట్ చెరువు పరిధిలోని సర్వే నంబర్ 7కు చెందిన ఐదు ఎకరాల 16 గుంటల భూమిని కూకట్‌పల్లికి మార్చి, సర్వే నంబర్లను 1001, 1002, 1003గా మార్చిడి చేసి అక్రమ నిర్మాణాలకు సెల్లార్ తవ్వకాలు జరుగుతున్నాయని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ, 'హామీ ఇచ్చిన చెరువునే కాపాడలేని హైడ్రా, ఇక నగరాన్ని ఎలా కాపాడుతుంది? పేదల గుడిసెలు కూల్చడానికి చూపే శ్రద్ధలో పదోవంతు కూడా ధనవంతుల కబ్జాలపై చూపడం లేదు' అని నిప్పులు చెరిగారు. శేరిలింగంపల్లి మండలంలోని భూములకు కోట్ల విలువ ఉండటంతో బిల్డర్లు రికార్డులు తారుమారు చేసి చెరువులను మింగేస్తున్నారని, అధికారులు కుమ్మక్కై నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. 'ఖమ్మం జిల్లా వెలగమట్లలో పేదల పూరిళ్లను రాత్రికి రాత్రే నేలమట్టం చేసిన హైడ్రా, ఇక్కడ మాత్రం గుడ్డి గుర్రాలకు పళ్లు తోముతోంది' అని ఎద్దేవా చేశారు. హైడ్రా కమిషనర్ వెంటనే స్పందించి కబ్జాదారులపై క్రిమినల్ కేసులు పెట్టి, సెల్లార్‌తో సహా అక్రమ కట్టడాలు కూల్చివేసి భూములను స్వాధీనం చేసుకోవాలని డిమాండ్ చేశారు. 'హామీలు కాదు, చేతలు కావాలి. చర్యలు తీసుకునే వరకు సీపీఐ ఆధ్వర్యంలో ఉద్యమం ఉధృతం చేస్తాం' అని హెచ్చరించారు. జిల్లా కలెక్టర్, హైడ్రా అధికారులకు ఫిర్యాదు చేస్తామని, స్పందన లేకపోతే హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం వేస్తామని టి. రామకృష్ణ తెలిపారు. నిరసనలో సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి కె. చందు యాదవ్, జిల్లా సమితి సభ్యులు కె. వెంకటస్వామి, నాయకులు తుపాకుల రాములు, కాసిం, వెంకటేష్, జెట్టి శ్రీను, తిరుపతయ్య, కిరణ్, బాలస్వామి, అజయ్ తదితరులు పాల్గొన్నారు.

## జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్‌ను కలిసిన కాంగ్రెస్ నాయకులు



**రాజేంద్రనగర్, విశాలభారతి :** రాజేంద్రనగర్ నియోజకవర్గం గండిపేట్ మండలం పరిధిలోని హైదర్షాకోట్ (డివిజన్ 123) ప్రాంతంలో కొనసాగుతున్న పలు పెండింగ్ సమస్యలపై కాంగ్రెస్ పార్టీ నాయకులు ఈరోజు జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిహెచ్ఎంసి 121, 122, 123 డివిజన్ల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పూలపల్లి కృష్ణారెడ్డి, వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్ తలారి ప్రేమ్ కుమార్లు ప్రాంతంలోని వివిధ కాలనీల్లో ఉన్న సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. వెస్ట్రన్ కాలనీ రోడ్ల దుస్థితి, పర్మహేష్ హోటల్ నుంచి జెండా వరకు రోడ్ల మరమ్మత్తులు, జాలండ్ స్కూల్ నుంచి టీఆర్‌కే హోటల్ వరకు మరియు కేంద్ర విహార్ జెండా నుంచి ఎస్ఎంపి స్కూల్ లైన్ వరకు రోడ్ల సమస్యలు, అలాగే డివిజన్ 123లో పలు కాలనీల్లో తాగునీటి, డ్రైనేజ్ సమస్యలను వివరించారు. అదేవిధంగా గంధం గూడ వెంకటేశ్వర కాలనీ, సాయి వాల్మీకి కాలనీల్లో ఉన్న సమస్యలు మరియు హైదర్షాకోట్ అంబేద్కర్ భవన్‌లో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని వినతిపత్రం సమర్పించారు. ఈ విషయాలపై స్పందించిన జిహెచ్ఎంసి డిప్యూటీ కమిషనర్ సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీసీ సెల్ నాయకుడు అంకం శ్రీనివాస్, ఈ బ్లాక్ అధ్యక్షుడు దప్పు నవీన్ కుమార్, మాజీ కార్పొరేటర్ లత సురేష్ గౌడ్ తదితర కాంగ్రెస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు

## హయత్ నగర్‌లో బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం

- **మోదీ సభ విజయవంతానికి ప్రతి బూత్ నుంచి 25 మంది హాజరు కావాలి**
- **కళ్లెం నవజీవన్ రెడ్డి పిలుపు**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** ఉమ్మడి హయత్ నగర్ డివిజన్ పరిధిలో బీజేపీ బూత్ స్థాయి కార్యకర్తల సమావేశం నిర్వహించబడింది. మే 10న భారత ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలంగాణ పర్యటన నేపథ్యంలో పరేడ్ గ్రౌండ్స్‌లో జరగనున్న భారీ బహిరంగ సభ ఏర్పాట్లపై ఈ సమావేశం జరిగింది. హయత్ నగర్ డివిజన్ బీజేపీ అధ్యక్షులు గంగాని శ్రీనివాస్ ఆధ్వర్యంలో ఈ సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో హయత్ నగర్ తాజా మాజీ కార్పొరేటర్ కళ్లెం నవజీవన్ రెడ్డి పాల్గొని కార్యకర్తలను ఉద్దేశించి ప్రసంగించారు. మూడవసారి దేశ ప్రధానిగా బాధ్యతలు స్వీకరించిన అనంతరం తెలంగాణకు వస్తున్న నరేంద్ర మోదీకి ఘన స్వాగతం పలకడం ప్రతి కార్యకర్త బాధ్యత అని పేర్కొన్నారు. ఈ పర్యటనలో భాగంగా దాదాపు రూ.8000 కోట్ల విలువైన పలు కేంద్ర ప్రభుత్వ ప్రాజెక్టులను జాతికి అంకితం చేయనున్నారని తెలిపారు. పరేడ్ గ్రౌండ్స్‌లో నిర్వహించనున్న సభను విజయవంతం చేయడానికి ప్రతి బూత్ నుంచి కనీసం 25 మంది కార్యకర్తలు తప్పనిసరిగా హాజరుకావాలని పిలుపునిచ్చారు. పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్త సమిష్టిగా కృషి చేయాలని, భారీ ఎత్తున పాల్గొని సభను విజయవంతం చేద్దామని సూచించారు. ఈ కార్యక్రమంలో హయత్ నగర్ ప్రబారి కొత్త రవీందర్ గౌడ్, రాష్ట్ర నాయకురాలు పద్మ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఉగాది ఎల్లప్ప, జిల్లా ఎస్సీ మోర్చా ప్రధాన కార్యదర్శి పారంద మహేష్, డివిజన్ ప్రధాన కార్యదర్శి గోవింద చారి, వివిధ బూత్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## టీఆర్ఎస్పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం ఆమోదం

- **తెలంగాణ రాజకీయాల్లో చారిత్రాత్మక మలుపు**
- **సామాజిక తెలంగాణ సాధన లక్ష్యంగా ముందుకు టీఆర్ఎస్**

**విశాలభారతీ, అబ్దుల్లాపూర్మెట్ :** తెలంగాణ రాజకీయాల్లో ఒక కీలక పరిణామంగా 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్) పార్టీకి కేంద్ర ఎన్నికల సంఘం అధికారిక ఆమోదం లభించింది. ఈ విషయాన్ని టీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు కప్పాటి పాండురంగా రెడ్డి, మేడ్చల్ నాయకుడు రామిడి వెంకట్ రెడ్డి, జిల్లా రైతు విభాగం అధ్యక్షుడు మంచిరెడ్డి విజయ్ కిరణ్ రెడ్డి తెలిపారు. ఇటీవల మేడ్చల్‌లోని అద్వయ కన్వెన్షన్‌లో నిర్వహించిన సభలో జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత పార్టీ ఆవిర్భావాన్ని ప్రకటించిన విషయం తెలిసిందే. ఆ ప్రకటనకు ఇప్పుడు చట్టబద్ధత లభించిందని నాయకులు పేర్కొన్నారు. బంజారాహిల్స్‌లోని కవిత నివాసంలో కేంద్ర ఎన్నికల సంఘం అధికారులు స్వయంగా వచ్చి పార్టీకి ఆమోద పత్రాన్ని అందజేయడం విశేషమని తెలిపారు. సబ్బండ వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా టీఆర్ఎస్ పార్టీ "పాంచజన్యం" పేరుతో ఐదు ప్రధాన అంశాలతో ముందుకు సాగనుందని వెల్లడించారు. అందులో కేజీ నుంచి పీజీ వరకు ఉచిత నాణ్యమైన విద్య, పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం, రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్, వ్యవసాయానికి సంపూర్ణ మద్దతు, సింగిల్ నోటిఫికేషన్ ద్వారా 4 లక్షల ఉద్యోగాల భర్తీ, యువతకు రూ.2 లక్షల నుంచి రూ.20 కోట్ల వరకు స్వయం ఉపాధి రుణాలు, అన్ని వర్గాలకు సమాన న్యాయం వంటి అంశాలు ఉన్నాయి. ఈ చారిత్రాత్మక నిర్ణయానికి ఆమోదం తెలిపిన కేంద్ర ఎన్నికల సంఘానికి నాయకులు కృతజ్ఞతలు తెలిపారు. ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు పుట్టిన ఈ టీఆర్ఎస్ పార్టీ తెలంగాణ భవిష్యత్తును పునర్నిర్మించడంలో కీలక పాత్ర పోషిస్తుందని వారు ఆశాభావం వ్యక్తం చేశారు.



## ఎన్‌జీఓస్ కాలనీ వివేకానంద పార్క్ అభివృద్ధికి ఎమ్మెల్యే హామీ

**పార్క్‌ను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దుతామని దేవిరెడ్డి సుధీర్ రెడ్డి భరోసా**

**విశాల భారతి, అబ్దుల్లాపూర్మెట్ మండలం :**

అబ్దుల్లాపూర్మెట్ మండలం, బి.ఎన్.రెడ్డి నగర్ డివిజన్ పరిధిలోని ఎన్‌జీఓస్ కాలనీలో ఉన్న స్వామి వివేకానంద పార్క్ అభివృద్ధికి ఎల్.బి.నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి హామీ ఇచ్చారు. వాకర్స్ అసోసియేషన్ కమిటీ సభ్యుల విజ్ఞప్తి మేరకు ఈరోజు ఆయన పార్క్‌ను సందర్శించి, సభ్యులతో కలిసి పర్యటించారు. ఈ సందర్భంగా పార్క్‌లో నెలకొన్న పలు సమస్యలను అసోసియేషన్ సభ్యులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ముఖ్యంగా యోగ షెడ్ నిర్మాణం, అసోసియేషన్ భవనానికి రంగులు వేయడం, టాయిలెట్ల మరమ్మతులు, మహిళల కోసం ప్రత్యేక టాయిలెట్లు ఏర్పాటు, ఓవర్ హెడ్ ట్యాంక్ నిర్మాణం, వాకింగ్ ట్రాక్ పునర్నిర్మాణం, ఓపెన్ జిమ్ అభివృద్ధి, మంచినీటి సదుపాయం, నూతన బోర్ కనెక్షన్ కల్పన వంటి అంశాలను వివరించారు. అలాగే పార్క్‌లో చెత్త పేరుకుపోవడం, అనాధ కుక్కలు విపరీతంగా సంచరిస్తుండడం వంటి సమస్యలను ప్రస్తావిస్తూ, కుక్కలు లోపలికి రాకుండా పార్క్ చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని, గోడలకు స్టిక్కర్లు అంటించకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ సమస్యలపై స్పందించిన ఎమ్మెల్యే సుధీర్ రెడ్డి , పార్క్ అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలు త్వరితగతిన చేపడతామని తెలిపారు. టాయిలెట్లు, ఫెన్సింగ్, వాకింగ్ ట్రాక్, బోర్ కనెక్షన్ వంటి అంశాలపై సంబంధిత అధికారులకు తగు ఆదేశాలు జారీ చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే యోగ షెడ్ నిర్మాణానికి కటిక రెడ్డి అరవింద్ రెడ్డి ముందుకు రావడం



అభినందనీయమని అన్నారు. ఈ కార్యక్రమంలో బి.ఎన్.రెడ్డి నగర్ భారస పార్టీ అధ్యక్షులు కటికరెడ్డి అరవింద్ రెడ్డి, మాధవరం నరసింహారావు, మనోజ్, భాస్కర్, వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మంచి రెడ్డి వెంకట్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ జైపాల్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి జగన్ రెడ్డి, ఉపాధ్యక్షులు మోహన్ రెడ్డి, వెంకట్ రెడ్డి, నారాయణ, జాయింట్ సెక్రటరీ రవీందర్ రెడ్డి, రవిశంకర్, వీరాస్వామి, ఆర్గనైజింగ్ సెక్రటరీ రామకృష్ణారెడ్డి, రామ్ రెడ్డి, అడ్వైజర్స్ మధుసూదన్ రెడ్డి, కృష్ణారెడ్డి, కార్యవర్గ సభ్యులు జంగారెడ్డి, జంగయ్య, సుధాకర్ రెడ్డి, సభ్యులు తిరుమల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయ విద్యార్థి ప్రజా సంఘాల ప్రెస్ మీట్



**దేవరుప్పల, విశాలభారతి:**

మండల కేంద్రంలోని బాల యేసు ఇంగ్లీష్ మీడియం ప్రైవేట్ పాఠశాల కరస్పాండెంట్ జేసురాజు ప్రవర్తనను ఖండిస్తూ ఉపాధ్యాయ, విద్యార్థి, ప్రజా సంఘాలు సంయుక్తంగా గురువారం ప్రెస్ మీట్ నిర్వహించాయి, లీగల్ నోటీసులు పంపించి ఉపాధ్యాయ సంఘాలను, విలేకరులను, బెదిరించడం సరైనది కాదని సంబంధిత అధికారులకు అధికారులపై దాడి చేసిన ఘటనపై పోలీసులు కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సంఘాల నాయకులు మాట్లాడుతూ, సెలవు రోజుల్లో పాఠశాల నిర్వహణపై ఫిర్యాదుల నేపథ్యంలో పరిశీలనకు వెళ్లిన మండల విద్యాశాఖ అధికారి కళావతి సిఆర్ పి యాకస్వామి పై కరస్పాండెంట్ దాడి చేయడం తీవ్రంగా ఖండించదగినదని అన్నారు. అధికారులపై దాడి చేసి ఫోన్లు లాక్కోవడం బెదిరింపులకు పాల్పడడం చట్ట విరుద్ధమని పేర్కొన్నారు. ఈ విషయాన్ని వెలుగులోకి తీసుకొచ్చిన విలేకరులకు అండగా నిలిచిన ఉపాధ్యాయ సంఘాల నాయకులకు లీగల్ నోటీసులు పంపడం ద్వారా భయపెట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా సెలవు రోజుల్లో పాఠశాల నడపడం, అధిక ఫీజులు వసూలు చేయడం, వంటి ఆరోపణలపై సమగ్ర దర్యాప్తు జరపాలని కోరారు. అడ్మిషన్, ట్యూషన్, ఎగ్జామ్, బస్సు డెవలప్మెంట్ ఫీజుల పేర్లతో తల్లిదండ్రులపై అధిక భారం మోపుతున్నారని, విద్యార్థి సంఘాలు ఆరోపించాయి. అలాగే ప్రైవేటు పుస్తకాలు, యూనిఫామ్ పేరుతో కూడా భారీగా వసూళ్లు జరుగుతున్నాయని, తెలిపారు. పాఠశాల గుర్తింపు సెక్షన్ పరిమితులు, పదవ తరగతి విద్యార్థులను రెసిడెన్షియల్ అనుమతులు, ఉపాధ్యాయుల విద్య అర్హత, బస్సు డ్రైవర్ల లైసెన్సులు, అటెండర్లు విద్యార్థులకు అందిస్తున్న సౌకర్యాలపై సమగ్ర విచారణ జరిపి నిబంధనలు ఉల్లంఘించిన పక్షంలో గుర్తింపును రద్దు చేయాలని కోరుతూ, కరస్పాండెంట్ జేసురాజు ప్రవర్తనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. పోలీసులు వెంటనే చర్యలు తీసుకోకపోతే జిల్లా రాష్ట్ర స్థాయిలో ఐక్య పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరించారు. ఉపాధ్యాయ సంఘాలు విలేకరులకు పంపిన లీగల్ నోటీసులకు దేశరతుగా వెనక్కి తీసుకోవాలని చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు సింగారపు రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి మబ్బు ఉదయ్, ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి సుమ, ఎమ్మార్పీఎస్ అధ్యక్షుడు పైసా రాజశేఖర్, తాండ్ర అఖిల్, సందెన రవీందర్, పడమటింటి నరసింహా, బిర్రు నాగేశ్వర్, ఎండి షరీఫ్,ఇ రాంరెడ్డి, గైని శంకరయ్య,సుర్జిత్, చిత్రాల శ్రీనివాస్, సూర్యప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ నేరాలకు దారులు వేసిన బ్యాంక్ అధికారులు

**సైబరాబాద్, విశాలభారతి:** సైబర్ నేరగాళ్లకు సహకరించి అక్రమంగా కరెంట్ ఖాతాలు తెరిచిన 7 మంది బ్యాంక్ అధికారులను సైబరాబాద్ సైబర్ క్రైమ్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. 'ఆపరేషన్ క్రాక్‌డౌన్' పేరుతో ప్రత్యేక ఆపరేషన్ చేపట్టి 5 కేసుల్లో చర్యలు తీసుకున్నట్లు డీసీపీ టి. సాయి మనోహర్ బుధవారం తెలిపారు. దర్యాప్తులో బ్యాంక్ ఉద్యోగులు, ఫీల్డ్ ఆఫీసర్లు సైబర్ నేరగాళ్లు, ఖాతా సరఫరాదారులతో కుమ్మక్కై నిబంధనలు పాటించకుండా కరెంట్ ఖాతాలు తెరిచారని వెల్లడైంది. కమీషన్లకు ఆశపడి కేవైసీ నిబంధనలు, వెరిఫికేషన్ విధానాలను పట్టించుకోలేదు. ఈ ఖాతాల ద్వారా భారీ సైబర్ మోసాలకు పాల్పడ్డారు. అరెస్టైన వారిలో ఇండియన్ బ్యాంక్ హైదరాబాద్ అసిస్టెంట్ మేనేజర్ అనుష (30), కూకట్‌పల్లి బ్రాంచ్ మేనేజర్ ముడావత్ దినేష్ చౌహాన్ (34), బ్యాంక్ ఆఫ్ మహారాష్ట్ర మాజీ మేనేజర్ నదీష్ సాంబార్ (32), బంధన్ బ్యాంక్ మాజీ ఫీల్డ్ ఆఫీసర్ రేణికుంట మహేష్ (37), ఇండస్‌ఇండ్ బ్యాంక్ జేఎన్‌టీయూ బ్రాంచ్ ఫీల్డ్ ఆఫీసర్ రెడ్డి హరీష్, సేల్స్ మేనేజర్ ఎన్. రవి, హైదరాబాద్ అసిస్టెంట్ బ్యాంక్ మేనేజర్ గోనెల సాయి వెంకట్ (29) ఉన్నారు.

## ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



**ఆర్మూర్ ,విశాలభారతి:** నందిపేట్ మండలంలోని బజార్ కొత్తూర్ గ్రామంలో గురువారం సర్పంచ్ గోపు ముత్తెన్న ఆధ్వర్యంలో గ్రామీణ ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు. గత కొంతకాలంగా ఎండలు మండిపోవడంతో ఉపాధిహామీ కూలీలు వడదెబ్బ నుండి రక్షించడానికి మజ్జిగ ప్యాకెట్ లను పంపిణీ చేయడం జరిగిందని తెలిపారు. వడదెబ్బ నుండి కాపాడుకోవడానికి తగు సూచనలు పాటించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ లక్ష్మీనారాయణ, పంచాయతీ సెక్రెటరీ శివ కుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ మోహన్ గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన మీడియా అక్రిడిటేషన్ కమిటీ సమావేశం నిర్వహణ



**భద్రాద్రి ప్రతినిధి, విశాలభారతి:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో నూతన మీడియా అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో జిల్లా కలెక్టర్ అంకిత్ అధ్యక్షతన గురువారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, అర్హత కలిగిన జర్నలిస్టులకు పారదర్శకంగా అక్రిడిటేషన్ కార్డులు జారీ చేయాలని సూచించారు. ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జారీ ప్రక్రియను కచ్చితంగా అమలు చేయాలని, ముఖ్యంగా జి.ఓ. నెం. 252లో పేర్కొన్న నియమ నిబంధనలను కట్టుదిట్టంగా పాటించాలని అధికారులకు ఆదేశించారు. అక్రిడిటేషన్ ప్రక్రియలో ఎలాంటి పొరపాట్లు లేకుండా, నిజాయితీతో పరిశీలన చేపట్టి అర్హులైన వారికి మాత్రమే కార్డులు జారీ చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. మీడియా ప్రతినిధుల సేవలను గౌరవిస్తూ, వారికి అవసరమైన సౌకర్యాలు అందించే దిశగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ సమావేశంలో సంబంధిత శాఖల అధికారులు, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## యువకుడు అనుమానాస్పదంగా గల్లంతు

- **అబ్దుల్లాపూర్మెట్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు**
- **దర్యాప్తు కొనసాగుతోంది: ఇన్స్పెక్టర్ అశోక్ రెడ్డి**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** అబ్దుల్లాపూర్మెట్ మండల పరిధిలో ఓ యువకుడు అనుమానాస్పదంగా గల్లంతైన ఘటన కలకలం రేపుతోంది. ఈ విషయాన్ని అబ్దుల్లాపూర్మెట్ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... రామోజీ ఫిల్మ్ సిటీ సమీపంలోని సహారా క్వార్టర్స్, అనాజ్‌పూర్ గ్రామానికి చెందిన పొడుగు ఈశ్వరమ్మ (50) అనే మహిళ ఫిర్యాదు చేశారు. ఆమె కుమారుడు పొడుగు యేసు కుమార్ (24), ప్రైవేట్ ఉద్యోగి, ఈ నెల 21వ తేదీన ఉదయం విధులకు వెళ్లి సాయంత్రం ఇంటికి తిరిగి వచ్చాడు. రాత్రి భోజనం అనంతరం నిద్రపోయిన యేసు కుమార్, మరుసటి రోజు ఉదయం లేచినప్పుడు ఇంట్లో కనిపించకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళనకు గురయ్యారు. కుటుంబ సభ్యులు అతని మొబైల్‌కు పలుమార్లు కాల్ చేసినప్పటికీ స్పందన రాకపోవడంతో గల్లంతైనట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు ఇన్స్పెక్టర్ అశోక్ రెడ్డి తెలిపారు. యువకుడి గల్లంతుపై అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతున్నదని, ఎవరికైనా సంబంధిత సమాచారం ఉంటే సమీప పోలీస్ స్టేషన్‌కు తెలియజేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

## పిజెఆర్ స్టేడియంలో సమ్మర్ క్యాంప్ ప్రారంభం

- **చదువుతో పాటు క్రీడలూ ముఖ్యమన్న గాంధీ**



విజేతలకు బహుమతులు అందజేస్తున్న గాంధీ సీఎంసి కమిషనర్ సృజన

**శేరిలింగంపల్లి విశాలభారతి:** పీజేఆర్ స్టేడియంలో సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ సమ్మర్ కోచింగ్ క్యాంప్ 2026ను పీఏసీ చైర్మన్ ఆరెకపూడి గాంధీ గురువారం ప్రారంభించారు. ఏప్రిల్ 25 నుంచి మే 31 వరకు క్యాంప్ జరుగుతుంది. చదువు, సంపాదనతో పాటు శారీరక దారుఢ్యం, మానసిక ఉల్లాసం ముఖ్యం. గోపిచంద్, సింధు లాంటి వారు ఈ క్యాంపులోనే శిక్షణ తీసుకుని అంతర్జాతీయ పతకాలు సాధించారు. వారిని ఆదర్శంగా తీసుకోండి' అని విద్యార్థులకు గాంధీ పిలుపునిచ్చారు. పిల్లల నైపుణ్యాన్ని గుర్తించి ప్రోత్సహించాలని తల్లిదండ్రులకు సూచించారు. ఎండ తీవ్రత దృష్ట్యా జాగ్రత్తలు తీసుకోవాలని నిర్వాహకులను ఆదేశించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సృజన, అడిషనల్ కమిషనర్ స్పోర్ట్స్ సుభద్ర, జోనల్ కమిషనర్ నారాయణ్ అమిత్ మాలెంపాటి, మియాపూర్ డీసీ శశిరేఖ, శేరిలింగంపల్లి డీసీ సేవా ఇస్లావత్, సీనియర్ నాయకులు రఘునాథ్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## జిన్నాం జనమ్మ దశదినకర్మ కార్యక్రమం నిర్వహణ

- **బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు, ప్రముఖులు**



**విశాలభారతి, అబ్దుల్లాపూర్మెట్ :** గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ డైరెక్టర్, ప్రగతి ఫ్రూట్ ట్రేడర్స్ అసోసియేషన్ అధ్యక్షులు జిన్నాం వెంకటేష్ గుప్తా మాతృమూర్తి జిన్నాం జనమ్మ దశదినకర్మ కార్యక్రమం ఘనంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు హాజరై వారి చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు , గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రామ్ నరసింహ గౌడ్ పాల్గొని, మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. జిన్నాం జనమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు, బంధువులు, స్నేహితులు, మార్కెట్ కమిటీ సభ్యులు పాల్గొని తమ సంతాపాన్ని వ్యక్తం చేశారు.

## అంబర్ నగర్ బస్తిలో పాదయాత్ర

**సికింద్రాబాద్, విశాలభారతి :** అంబర్ నగర్ బస్తి కమిటీ ఆధ్వర్యంలో సీతారామాంజనేయ స్వామి దేవాలయం తదితర వీధులలో బిజెపి నాయకులు పర్యటించారు. బస్తీ అధ్యక్షలు నాగరాజు తో కలిసి డివిజన్ బిజెపి అధ్యక్షులు సాయి ప్రసాద్ గౌడ్ పాదయాత్ర నిర్వహించడం జరిగింది. గత కొద్ది రోజులుగా సిసి రోడ్డు నిర్మాణ పనుల కొరకు రోడ్డు వేయుటకు తవ్విన అనంతరం మురుగునీటి పైపులైను వేయు సమయంలో త్రాగునీటి పైపులు పగిలి నీరు కారుతున్నందున పలు లీకేజ్ లను వెంటనే మరమ్మతు చేసి సిమెంటు రోడ్డు వేయవలసిందిగా జిహెచ్ఎంసి, జలమండలి అధికారులకు సాయి ప్రసాద్ గౌడ్ తెలియజేశారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రవి ప్రసాద్ గౌడ్, ప్రమోద్, అజయ్,వినోద్, పాక మూర్తి, సోను తదితర బస్తీ వాసులు పాల్గొనడం జరిగింది.



# నర్సాపూర్‌లో సఖి సెంటర్, రెడ్డిపల్లి అంగన్వాడి కేంద్రం తనిఖీ

**విశాలభారతి, మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా నర్సాపూర్ పరిధిలో నిర్వహిస్తున్న సఖి కేంద్రం, రెడ్డిపల్లి అంగన్వాడి సెంటర్‌ను మహిళా, శిశు అభివృద్ధి మంత్రిత్వ శాఖ అదనపు కార్యదర్శి, నోడల్ అధికారి వల్లేటి ప్రేమ్ చంద్ తనిఖీ చేశారు. సఖి సెంటర్‌లో బాధితులకు అత్యుత్తమ సేవలు అందించాలని సూచించారు. మెదక్ జిల్లాలో అంగన్వాడీల పనితీరు ఆదర్శంగా ఉందని అభిప్రాయపడ్డారు. సఖి కేంద్రంలో రిజిస్టర్లను పరిశీలిస్తూ క్లిష్టమైన కేసులపై వివరాలు తెలుసుకున్నారు. మహిళలు పనిచేసే చోట ఎదురయ్యే ఇబ్బందులు, మహిళలపై లైంగిక దాడి చట్టాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. తర్వాత రెడ్డిపల్లి అంగన్వాడి కేంద్రాన్ని సందర్శించి గర్భిణులు, బాలింతలకు పోషక విలువలున్న ఆహారం గురించి పూర్తి అవగాహన కల్పించాలని తెలిపారు. పోషణ్ అభియాన్ కార్యక్రమంలో తల్లి, బిడ్డలకు సమగ్ర పోషకాహారం అందించాల్సిన అవసరాన్ని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి హేమ భార్గవి, సంబంధిత సిడిపిఓలు, అంగన్వాడి టీచర్లు పాల్గొన్నారు.

# పది ఫలితాల్లో కాకతీయ ప్రభంజనం




**విశాలభారతి, సిద్దిపేట ప్రతినిధి :** తెలంగాణ రాష్ట్రంలో నిన్నటి రోజున వెలువడిన పదవ తరగతి ఫలితాల్లో సిద్దిపేట జిల్లా కేంద్రంలోని కాకతీయ విద్యార్థులు ప్రభంజనం సృష్టించారు. ప్రతి సంవత్సరం ఎప్పటిలాగే 100% ఉత్తీర్ణత సాధించడంతోపాటు, అత్యుత్తమ మార్కులు సాధించి,ఔరా! అనిపించారు. కాకతీయ హైస్కూల్ ఎస్.ఎస్.సి 202526 స్కూల్ టాపర్ గా 559 మార్కులు కె. మహేష్‌కుమార్ సాధించగా, 545 హర్షిత్ కుమార్, 543 ఏ.రోహన్ కుమార్ సాధించడం జరిగింది. అలాగే కాకతీయ పాఠశాలలో 100% విద్యార్థులలో 50 % శాతానికి పైగా 500 కు పైగా మార్పులు సాధించి, సత్తా చాటారు. ఈ సందర్భంగా బీ_స్మాట్ (బడ్జెట్ స్కూల్స్ మేనేజ్మెంట్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ)స్టేట్ జనరల్ సెక్రెటరీ జగ్గు మల్లారెడ్డి అభినందన సభలో పాల్గొని మాట్లాడారు. చిన్ననాటి నుండి విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధిస్తూ.. జన్మనిచ్చిన తల్లిదండ్రులకు చదువు నేర్పిన పాఠశాలకు, ఉపాధ్యాయులకు కీర్తి ప్రతిష్టలు తీసుకురావాలని పిలుపునిచ్చారు.అలాగే పదవ తరగతి విద్యార్థి జీవితంలో మొదటి మైలురాయిగా పరిగణించాలన్నారు. అనంతరం ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు అభినందనలు తెలియజేశారు. గొప్ప గొప్ప మహనీయుల చరిత్రలను తెలుసుకొని వారి అడుగుజాడల్లో పయనించి, సమాజంలో దిశా నిర్దేశకులుగా ఎదగాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల ప్రిన్సిపల్ తదితరులు పాల్గొన్నారు.

# అంబిటస్ స్కూల్ టాపర్‌కు సన్మానం

**రాందేని వర్షశ్రీని అభినందించిన పాఠశాల యాజమాన్యం**

**విశాలభారతి, సిద్దిపేట ప్రతినిధి :** పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబర్చి స్కూల్ టాపర్‌గా నిల్చిన విద్యార్థినిని రాందేని వర్షశ్రీ ని పాఠశాల యాజమాన్యం గురువారం అభినందించారు. సిద్దిపేట రూరల్ మండలం చింతమడక గ్రామానికి చెందిన రాందేని గణేష్‌సత్తవ్వ దంపతులు పట్టణంలోని రాంనగర్‌లో గత కొన్నేళ్లుగా నివాసం ఉంటున్నారు. వీరి చిన్న కూతురు రాందేని వర్షశ్రీ జిల్లా కేంద్రం సిద్దిపేటలోని అంబిటస్ పాఠశాలలో పదవ తరగతి పూర్తి చేసింది. బుధవారం వెలువడిన పది ఫలితాల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చి 600 మార్కులకు గాను 588 మార్కులు సాధించి వర్షశ్రీ స్కూల్ టాపర్‌గా నిలిచింది. దీంతో పాఠశాల యాజమాన్యం ఎడ్ల జ్యోతిరెడ్డి, ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డిలు విద్యార్థినిని పాఠశాలలో గురువారం శాలువాతో సన్మానించి, అభినందించారు. అదేవిదంగా పాఠశాలలో 550కి పైగా 35మంది, 500 మార్కులకు పైగా 76మంది విద్యార్థులు సాధించినట్లు పాఠశాల ప్రిన్సిపల్ జ్యోతి తెలిపారు. సహకరించిన పాఠశాల ఉపాధ్యాయులు, తల్లిదండ్రులను, విద్యార్థులను అభినందించారు. స్కూల్ ఫస్ట్ వచ్చేలా తనకు సహకరించిన పాఠశాల యాజమాన్యం, ఉపాధ్యాయులకు వర్షశ్రీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ విజయ్‌భాస్కర్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# హత్య కేసులో నిందితుడికి జీవిత ఖైదు

**5 వేల రూపాయల జరిమానా**

**సమర్థవంతమైన దర్యాప్తుతో శిక్ష ఖరారు: జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు,**

**విశాలభారతి,మెదక్ ప్రతినిధి :** మెదక్ జిల్లా మనోహరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో 2023 నవంబర్ 19న జరిగిన హత్య కేసులో నిందితుడు సూరజ్‌కు జిల్లా ప్రధాన న్యాయమూర్తి శ్రీమతి నీలిమ జీవిత ఖైదుతో పాటు రూ.5,000 జరిమానా విధించినట్లు జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు. గీత ప్యానల్ ప్రాడక్ట్ కంపెనీలో పనిచేస్తున్న సూరజ్, రజిని దేవి అక్కడే నివసిస్తూ జీవనం సాగించేవారు. వీరి మధ్య కొంతకాలంగా వ్యక్తిగత విభేదాలు నెలకొన్నాయి. ఈ క్రమంలో 2023 నవంబర్ 19న ఆవేశానికి లోనైన సూరజ్, రజిని దేవిని చీరతో గొంతు బిగించి హత్య చేసి పారిపోయాడు. ఈ ఘటనపై కంపెనీ ప్రతినిధి ఫిర్యాదు మేరకు మనోహరాబాద్ ఎస్సై కరుణాకర్ రెడ్డి కేసు నమోదు చేశారు. అప్పటి తూప్రాన్ సీఐ శ్రీధర్ సంఘటనపై సమగ్ర దర్యాప్తు చేపట్టి, అన్ని సాక్ష్యాధారాలను సేకరించి న్యాయస్థానంలో చార్జిషీట్ దాఖలు చేశారు. అనంతరం ప్రస్తుత దర్యాప్తు అధికారి రంగా కృష్ణ కోర్టులో సాక్ష్యాలను సమర్థవంతంగా ప్రవేశపెట్టారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్ వెంకటేష్ బలమైన వాదనలు వినిపించడంతో, కోర్టు నిందితుడికి జీవిత ఖైదు విధించినట్లు జిల్లా ఎస్పీ తెలిపారు. ఈ కేసులో కోర్టు లైజనింగ్ ఆఫీసర్ ఎస్సై విఠల్, కానిస్టేబుల్ రవీందర్ గౌడ్, సీడీఓ మహిపాల్ రెడ్డి సహకరించినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీసు అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు. చట్టాన్ని ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

# సిద్దిపేటలో మహిళా భద్రతపై అవగాహన సదస్సు

**విశాలభారతి,సిద్దిపేట ప్రతినిధి :** తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక' కార్యక్రమంలో భాగంగా సిద్దిపేట పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో మహిళా భద్రత, గృహ హింస నివారణపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు పాల్గొని మహిళల రక్షణ కోసం ప్రభుత్వం, పోలీస్ శాఖ తీసుకుంటున్న చర్యలను వివరించారు. గృహ హింస నిరోధక చట్టం, వేధింపులపై అమలులో ఉన్న నిబంధనల గురించి అవగాహన కల్పించారు. అత్యవసర పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, షీ టీమ్స్ సేవలు, డయల్ 100 వినియోగంపై సూచనలు ఇచ్చారు. సమాజంలో బాల్య వివాహాలు, సైబర్ వేధింపులు, వరకట్న వేధింపుల వంటి సమస్యలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. మహిళలు తమ హక్కులను తెలుసుకుని భయపడకుండా సమస్యలను పోలీసులకు తెలియజేయాలని కోరారు. మహిళలకు గౌరవం లభించినప్పుడే సమాజ అభివృద్ధి సాధ్యమని స్పష్టం చేశారు. సదస్సు అనంతరం మాదకద్రవ్యాల నిరోధక ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో స్థానిక పోలీస్ అధికారులు, న్యాయవాదులు, ఎన్జీవో ప్రతినిధులు, పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

# పోలీస్ కానిస్టేబుల్‌కు ఘన వీడ్కోలు కార్యక్రమం

**విశాలభారతి, సిద్దిపేట ప్రతినిధి :** సిద్దిపేట కమిషనరేట్ పరిధిలో సుదీర్ఘ కాలం విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన పోలీస్ కానిస్టేబుల్ వంటేరు అమరేందర్ రెడ్డికి కమిషనర్ ఆఫ్ పోలీస్ కార్యాలయంలో ఘనంగా వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు డీసీపీ అడ్మిన్ కుశాల్కర్ అభినందనలు తెలియజేస్తూ సన్మాన పత్రం, మెమెంటో అందజేసి శాలువాతో సత్కరించారు. పోలీస్ శాఖలో అంకిత భావంతో సేవలందించి అందరి మన్ననలు పొందినట్టు పేర్కొన్నారు. సుదీర్ఘ సేవల అనంతరం పదవీ విరమణ చేయడం గర్వకారణమని, సేవా కాలంలో చూపిన నిబద్ధత అందరికీ ఆదర్శంగా నిలుస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో అదనపు డీసీపీ (ఎఆర్) సుభాష్ చంద్రబోస్, రిజర్వ్ ఇన్స్పెక్టర్ రాజేష్, రాష్ట్ర పోలీస్ సంఘం ఉపాధ్యక్షుడు రవీందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుకు అడ్డంగా నిలిపిన భారీ వాటర్ ట్యాంకర్.. నిలిచిపోయిన వాహనాలు




# హైదర్‌నగర్‌లో ట్యాంకర్ రాజ్యం

**చట్టం ముందు చక్రాలు ఆగవా?**

## ప్రాణాలు పోయినా ట్యాంకర్ డ్రైవర్ల తీరు మారదా...?

- రాంగ్ రూట్‌లో దూసుకెళ్లడమే కాదు, రోడ్డుకు అడ్డంగా నిలిపి వీరంగం
- చేష్టలూడిగి చూస్తున్న ట్రాఫిక్ పోలీసులు
- యథావిధిగా ప్రమాదాలు

**సైబరాబాద్, విశాలభారతి:**

ఒక మరణం...వందల హెచ్చరికలు. అయినా హైదర్‌నగర్ మెట్రో వంతెన కింద రోడ్డు మాత్రం ట్యాంకర్ల సామ్రాజ్యంగానే కొనసాగుతోంది. మంగళవారం అభినవ్ అనే యువకుడి రక్తపు మరకలు ఆరకముందే, గురువారం అదే చోట మళ్లీ అదే రాంగ్ రూట్ దృశ్యాలు. ఇది కేవలం డ్రైవర్ల నిర్లక్ష్యం కాదు.. వ్యవస్థలన్నీ కళ్లు మూసుకున్న వైనానికి ప్రత్యక్ష సాక్ష్యం.

**'కబ్జా'కు కేంద్ర బిందువు**

సమస్యకు మూలం జలమండలి ఫిల్లింగ్ పాయింట్. నగరానికి నీటి అవసరాలు తీర్చే ఈ పాయింటే ఇప్పుడు ప్రమాదాలకు కేంద్రమైంది. ఇక్కడి నుంచి బయటకు వచ్చే ప్రతి ట్యాంకర్‌కు షార్ట్‌కట్ కావాలి. నిబంధనల ప్రకారం కిలోమీటర్ ముందుకు వెళ్లి యూటర్న్ తీసుకోవాల్సిన డ్రైవర్లు, ఫిల్లింగ్ పాయింట్ గేటు దాటగానే ఎదురుగా ఉన్న అక్రమ యూటర్న్‌లోకి దూసుకెళ్తున్నారు. దీంతో నిజాంపేట్ నుంచి హైదర్‌నగర్ వైపు వచ్చే వందల వాహనాలు ఒక్కసారిగా మృత్యువును ఎదుర్కోవాల్సి వస్తోంది.

**చట్టం ఎందుకు పనిచేయదు?**

1. **ట్రాఫిక్ పోలీసుల 'మౌన వ్రతం':** అక్కడే విధుల్లో ఉండే కానిస్టేబుల్ నుంచి ఎస్సై వరకు అంతా చూస్తూ ఊరుకుంటున్నారు. 'రాంగ్ సైడ్ డ్రైవింగ్ ప్రొహిబిటెడ్' బోర్డు కిందే రోజుకు 200కు పైగా ట్యాంకర్లు రాంగ్ రూట్‌లో వెళ్తున్నాయి. ఒక్క చలాన్ కూడా పడదు. "మావల్ల కాదు, పైనుంచి ఆర్డర్స్ లేవు" అని సిబ్బంది బహిరంగంగానే చెబుతున్నారు.
2. **జలమండలి 'చేతులెత్తేత':** "మావి కాంట్రాక్ట్ ట్యాంకర్లు. డ్రైవర్లు మా కంట్రోల్‌లో ఉండరు" అని జలమండలి అధికారులు తప్పించుకుంటున్నారు. కానీ ఫిల్లింగ్ పాయింట్ నుంచి బయటకు వచ్చే ప్రతి ట్యాంకర్‌కు జీపీఎస్ ఉంది. రూట్ మ్యాప్ ఉంది. అయినా రాంగ్ రూట్‌లో వెళ్తున్న డ్రైవర్‌పై చర్యలేవి? ఒక్క కాంట్రాక్ట్ రద్దు కాలేదు. ఒక్కరికీ జరిమానా లేదు.
3. **సీఎంసీ 'నిర్మాణ వైఫల్యం:** న్యాయవాది సిందం శ్రీకాంత్ చెప్పినట్లు ఈ ప్రాంత మాస్టర్ ప్లాన్‌లో యూటర్న్‌కు అనుమతే లేదు. స్థానిక నేతల ఒత్తిడితో ఏర్పాటు చేసిన అక్రమ యూటర్న్ ఇది. దీన్ని తొలగించాలని రెండేళ్లుగా ఫిర్యాదులు చేస్తున్నా సీఎంసీ ఇంజనీరింగ్ విభాగం స్పందించలేదు. ఫలితం.. రోజూ ప్రమాదాలు.

**బాధితుల గోడు...** "ఉదయం పిల్లల్ని స్కూల్‌కు పంపితే సాయంత్రం క్షేమంగా వస్తారో లేదో తెలియదు. ట్యాంకర్ వస్తే చాలు గుండె ఆగినంత పనవుతోంది" అని ఓ తల్లి కన్నీళ్లతో చెప్పింది. స్థానిక వ్యాపారి రమేశ్ మాట్లాడుతూ "రోడ్డుకు అడ్డంగా ట్యాంకర్ నిలిపి డ్రైవర్ టీ తాగుతాడు. అడిగితే 'నీకెందుకురా' అని ఎదురు తిరుగుతాడు. పోలీసుకు చెబితే 'అడ్జస్ట్ అయిపోండి' అంటాడు" అని వాపోయాడు.




కేవలం యూటర్న్ మూసేసి చేతులు దులుపుకున్న ట్రాఫిక్ పోలీసులు



సిందం శ్రీకాంత్ న్యాయవాది

ఇది ఒక్క హైదర్‌నగర్ సమస్య కాదు. నగరంలోని 27 జలమండలి ఫిల్లింగ్ పాయింట్ల వద్ద ఇదే పరిస్థితి. కావాల్సింది ఉమ్మడి కార్యాచరణ. 1. అక్రమ యూటర్న్‌లను 48 గంటల్లో తొలగించాలి. 2. ఫిల్లింగ్ పాయింట్ల వద్ద శాశ్వత ట్రాఫిక్ పోస్ట్ ఏర్పాటు చేయాలి. 3. రాంగ్ రూట్‌లో వెళ్లే

### పరిష్కారం ఏది...?

ట్యాంకర్‌ను మొదటిసారి సీజ్ చేసి రూ.25 వేలు జరిమానా, రెండోసారి క్రిమినల్ కేసు పెట్టాలి. 4. జీపీఎస్ డేటా ఆధారంగా ప్రతి రోజూ జలమండలి ఎండీకి రిపోర్ట్ వెళ్లాలి. ఒక యువకుడి మరణం అయినా వ్యవస్థలను మేల్కొలపకపోతే, రేపు మరో అభినవ్ బలవ్వడం ఖాయం. ట్యాంకర్ చక్రాల కింద చట్టం నలిగిపోతుంటే, ప్రజల ప్రాణాలకు రక్షణ ఎవరిస్తారు? ఇది ప్రశ్న కాదు.. ప్రజల హెచ్చరిక.




తీరుమార్చుకోని డ్రైవర్లు.... యథావిధిగా అదే నిర్లక్ష్యం.

# సిద్దిపేటలో రైతులకు అవగాహన సదస్సు



- ఎఫ్.పీ.వో లో చేరితే రైతులకు భారీ లాభాలు..
- రైతులకు డైరెక్ట్ బెనిఫిట్ సమిష్టి వ్యవసాయంతో ఖర్చులు తగ్గింపు..
- రైతు ఉత్పత్తి సంఘము ( ఎఫ్. పి.ఓ) విభాగ అధికారి మల్యాల శివాని..

**విశాలభారతి, సిద్దిపేట ప్రతినిధి :**

ఎఫ్‌పీవో లో (ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్) చేరితే రైతన్నలకు మంచి లాభాలు వస్తాయని అధికారులు చెబుతున్నారు. సమిష్టి కృషితో ఆదాయం పెంచుకోవచ్చని సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో సిద్దిపేట మార్కెట్ యార్డులో నిర్వహించిన అవగాహన సదస్సులో రైతులకు ఎఫ్‌పీవో ప్రయోజనాలపై వివరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎఫ్ పి ఓ డొమైన్ ఎక్స్పర్ట్ అధికారి మల్యాల శివాని మాట్లాడుతూ రైతులు రైతు ఉత్పత్తి సంఘాల్లో చేరితే ఆర్థికంగా బలపడతారని తెలిపారు. ఎఫ్‌పీవో ద్వారా రైతులు ఒకే వేదికపై చేరి తమ పంటలను మార్కెట్ చేయవచ్చని, దీనివల్ల మధ్యవర్తులు తగ్గి రైతులకు నేరుగా లాభం చేకూరుతుందని చెప్పారు. అలాగే విత్తనాలు, ఎరువులు, ఇతర వ్యవసాయ అవసరాలను సమూహంగా కొనుగోలు చేసుకోవడంతో ఖర్చులు తగ్గుతాయని వివరించారు. పంటలకు సరైన ధర లభించడంతో పాటు మార్కెటింగ్ సదుపాయాలు కూడా మెరుగుపడతాయని తెలిపారు. రైతులు సమిష్టిగా వ్యవసాయం చేస్తే లాభాలు పెరుగుతాయని, ప్రభుత్వ పథకాలను సులభంగా పొందవచ్చని సూచించారు. రైతులు ఎఫ్‌పీవోలో చేరి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో పలువురు రైతులు పాల్గొన్నారు.

# కేసీఆర్, హరీష్ రావు ఆశీర్వాదంతో చైర్ పర్సన్ అయ్యా

**మున్సిపల్ కౌన్సిల్ చివరి సమావేశం భావోద్వేగంగా ముగింపు**

**విశాలభారతి, సిద్దిపేట ప్రతినిధి :**

సిద్దిపేట మున్సిపల్ కౌన్సిల్ చివరి సమావేశం భావోద్వేగ వాతావరణంలో జరిగింది. మున్సిపల్ చైర్ పర్సన్ కడవేరుగు మంజుల రాజనర్సు మాట్లాడుతూ, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ఆశీర్వాదంతో చైర్ పర్సన్ పదవి దక్కిందని తెలిపారు. ఐదు సంవత్సరాల కాలంలో ప్రజలకు సేవ చేసే అవకాశం రావడం తన అదృష్టంగా భావిస్తున్నానని పేర్కొన్నారు. ఈ ప్రయాణంలో తన భర్త రాజనర్సు అందించిన సహకారం ఎంతో కీలకమని, ఆ తోడ్పాటు ఎప్పటికీ మరువలేనిదని చెప్పారు. సమావేశంలో ఎజెండాలోని 26 అంశాలను అధికారులు చదివి వినిపించగా, పాలకవర్గ సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. గడిచిన ఐదేళ్లలో పట్టణ అభివృద్ధికి కృషి చేసి రాష్ట్ర, కేంద్ర స్థాయిలో అవార్డులు సాధించామని చైర్ పర్సన్ పేర్కొన్నారు. త్వరలో కౌన్సిల్ పదవీకాలం ముగియనున్న నేపథ్యంలో చైర్ పర్సన్ భావోద్వేగానికి గురయ్యారు. సిద్దిపేట ప్రజలకు సేవ చేసే అవకాశం లభించడం గర్వంగా ఉందని తెలిపారు. ఎండాకాలంలో నీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. మున్సిపల్ సిబ్బంది సమన్వయంతో పనిచేసి పట్టణానికి మరింత మంచి పేరు తీసుకురావాలని కోరారు. పాలకవర్గ సభ్యులు మాట్లాడుతూ, పట్టణంలోని అన్ని వార్డుల అభివృద్ధికి ఎమ్మెల్యే హరీష్ రావు కృషి, చైర్ పర్సన్ నాయకత్వం కీలకమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్, వైస్ చైర్మన్‌కు సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. పట్టణ జనాభా పెరుగుతున్న నేపథ్యంలో భవిష్యత్తులో వార్డుల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు సూచించారు. స్వచ్ఛ సర్వేక్షన్ 202627 సిటిజన్ ఫీడ్‌బ్యాక్ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, సిబ్బంది, కౌన్సిలర్లు పాల్గొన్నారు.



# విజయ్ దేవరకొండ జోడీగా?

తెలుగులో ఇప్పటికే మూడు చిత్రాల్లో నటించినా..కమర్షియల్‌గా మాత్రం ఆశించిన సక్సెస్‌ను సొంతం చేసుకోలేకపోయింది బాలీవుడ్ భామ కృతిసనన్. అయితే హిందీ సినీరంగంలో మాత్రం ఆమెకు మంచి పేరుంది. విలక్షణ కథాంశాల్ని ఎంచుకుంటూ ప్రతిభను చాటుకుంటున్నది. ఈ సొగసరి సుదీర్ఘ విరామం తర్వాత తెలుగులో రీఎంట్రీ ఇవ్వబోతున్నది. వివరాల్లోకి వెళితే.. విజయ్ దేవరకొండ కథానాయకుడిగా శౌర్యువ్ దర్శకత్వంలో ఇటీవలే భారీ పాన్ ఇండియా చిత్రం మొదలైన విషయం తెలిసిందే. మైథాలజీ అంశాలతో సాగే యాక్షన్ డ్రామా ఇది. అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో విజయ్ దేవరకొండ కెరీర్‌లోనే భారీ బడ్జెట్‌తో తెరకెక్కించబోతున్నారు. ఈ సినిమాలో కృతిసనన్ కథానాయికగా ఎంపికైనట్లు సమాచారం. బాలీవుడ్‌తో పాటు తెలుగు ప్రేక్షకులకు కూడా సుపరిచితురాలైన నటి కావడంతో మేకర్స్ ఆమెను ఫైనలైజ్ చేశారని అంటున్నారు. దాదాపు మూడేళ్ల విరామం తర్వాత కృతిసనన్ తెలుగు సినిమాలో నటించబోతున్నది.



Published by Rajini Pagilla on behalf of Keerthi Media House, Editor : Gangarapu Vijay. RNI No APTEL/2010/32877.